'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సోమవారం 22-7-2019

సంపుటి: 12
సంచిక: 121

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

BIG C AASHADAM SALE

బిగ్ సి (South India's Most Trusted Mobile Retail Chain)లో ఆషాడం సేల్ సందర్భంగా మొబైల్స్ కొనుగోలుపై 10కోట్ల విలువ గల బహుమతులు మరియు 5% హెచ్‌డిఎఫ్‌సి,హెచ్‌డిబి క్యాష్ బ్యాక్, 30% పేటీయం క్యాష్ బ్యాక్, upto 51% డిస్కౌంట్, 1 Free EMI, లక్కీడ్రాలో కారు, బైక్‌లు మరియు మొబైల్స్ కూడ గెలుచుకునే గొప్ప అవకాశం. 0% డౌన్ పేమెంట్ సౌకర్యం కలదు.

LOT®

150 STORES ACROSS TS & AP

లాట్ స్మార్ట్

ఆషాఢం సేల్

UPTO 60% DISCOUNT On Exchange*

FLAT 30% CASH BACK
Paytm

UPTO CASH BACK
HDFC BANK We understand your world

ONE TIME SCREEN REPLACEMENT FREE
*On Selected Models

1 MONTH EMI FREE

PRE-BOOK NOW
realme X PRO
4 | 128GB | 8 | 128GB

realme 3Pro
4 | 64 GB ₹14,499/-
6 | 64 GB ₹15,999/-
6 | 128GB ₹16,999/-

NOKIA 3.1 Connecting People 3GB | 32GB UPTO 60% DISCOUNT On Exchange*

oppo A5s 3GB | 32GB UPTO 60% DISCOUNT On Exchange*

micromax Infinity 2 UPTO 60% DISCOUNT On Exchange*

honor FOR THE DRIVE HOLLY 4+ worth ₹3499/- Toreto BLOOM SMART WATCH FREE Only @ ₹8999/-

vivo Y95 4GB | 64GB Toreto SOUND BLAST BAR FREE Only @ ₹15599/-

SAMSUNG Galaxy A50 & A30 0% DOWN PAYMENT

V15 Pro V15 Y17 vivo 1 MONTH EMI FREE on Bajaj Finserv

oppo F11Pro & F11 1 MONTH EMI FREE on IDFC Bank

SAMSUNG Galaxy A70 ₹2000/- CASH BACK

iPhone 10% CASH BACK 6s/6s+/8/8+/Xr/Xs/Xs Max

oppo A9 4GB | 128GB 6.5" FHD+ Waterdrop Screen NEW ARRIVAL

LAVA ONE SURPRISE GIFT

Karbonn K9MINI JODI OFFER Only @ ₹1599/-

micromax X751 JODI OFFER Only @ ₹1599/-

PRE-BOOKING STARTS FROM 26-07-19
K20 PRO 4 GB+128 GB 8 GB+256 GB
K20 6 GB+64 GB 6 GB+128 GB
Xiaomi

*Conditions Apply

లాట్‌లో ఖచ్చితమైన బహుమతులు ఎన్నో..మరెన్నో..

BRANDED ACCESSORIES AVAILABLE

0% DOWN PAYMENT
BAJAJ FINSERV EMI | IDFC FIRST Bank | HDB | HDFC BANK We understand your world | HOME CREDIT | ICICI Consumer Finance

LOT®

Helpline: 1800 123 3567 | www.lotmobiles.com

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 121

సోమవారం 22-7-2019

'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

రన్నరప్‌తో సరి

ఇండోనేసియా ఓపెన్ టోర్నీ ఫైనల్లో ఓడిన పీవీ సింధు - స్పోర్ట్స్‌లో

విండీస్ సిరీస్‌కు సై

మూడు ఫార్మాట్‌లకు ఒకేసారి భారత జట్ల ప్రకటన - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కర్ణాటక తెరపై

కుమార.. సందేహం!

కర్ణాటకంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి..

- సీఎం పదవిని వదులుకునేందుకు జేడీఎస్ ఓకే
- రెబెల్స్‌ను బుజ్జగించేందుకు కాంగ్రెస్-జేడీఎస్ వ్యూహం
- సీఎం రేసులో సిద్ధరామయ్య, శివకుమార్, పరమేశ్వర
- ఆత్మగౌరవం దెబ్బతిన్నందున వెనక్కి రాబోమన్న రెబెల్స్
- అసెంబ్లీలో విశ్వాసపరీక్ష నేడే

నైతికత గురించి మాట్లాడే బీజేపీ ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతోంది. ఈ విషయాన్ని దేశం దృష్టికి తీసుకెళ్లాలా అసెంబ్లీలో చర్చకు సమయం కోరా. - సీఎం కుమారస్వామి

ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు నాతో పాటు పరమేశ్వర, సిద్ధరామయ్యల్లో ఎవరు సీఎం పదవిని చేపట్టినా అభ్యంతరం లేదని జేడీఎస్ నేతలు చెప్పారు. - కాంగ్రెస్ నేత శివకుమార్

సోమవారం విశ్వాసపరీక్షపై ఓటింగ్ చేపడితే ఈ వ్యవహారం ఓ ముగింపుకొస్తుందని విశ్వాసంతో ఉన్నా. - బీజేపీ నేత యడ్యూరప్ప

5 లో

నేడే చూడండి

అంతరిక్ష యవనికపై

జాబిల్లికి జైత్రయాత్ర!

చంద్రయాన్-2కు మొదలైన కౌంట్‌డౌన్

మధ్యాహ్నం **2:43** గంటలకు

జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం1 ప్రయోగం..

ఇస్రో చరిత్రలో ఇదే అతిపెద్ద ప్రయోగం

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సోమవారం మధ్యాహ్నం 2.43గంటలకు 3,850 కిలోల జీఎస్ఎల్‌వీ- మార్క్-3 ఎం1 వాహక నౌకను ప్రయోగించడానికి సర్వం సిద్ధం చేశారు. పదేళ్లపాటు ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో శ్రమించి రూపొందించిన ఈ చంద్ర యాన్-2 మిషన్‌కు ఆదివారం సా.6.43గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఏ రాజ రాజన్ ఆధ్వర్యంలో ఆదివారం లాంచ్ రిహార్సల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ల్యాబ్ మీటింగ్‌లో సా.6.43 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించాలని మిగతా 2వ పేజీలో ▶

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
కో అంటే కోటీ....బహుమతులు
7 కూపన్

ఏమిటీ 'పోడు' పని

గిరిజనుల ముసుగులో గిరిజనేతరుల అక్రమ సాగు

ఇక్కడ కనపడుతున్నట్లు గిరిజనులు, ఆదివాసీలు దుక్కి దున్నరు. అడవుల్లోని వాలు గల ప్రాంతాల్లో ఉండే చిన్న పాటి పొదలు, మొక్కల్ని నరికి సేద్యానికి అనువుగా మలుచుకుంటారు. గిరిజనుల ముసుగులో సాగుతున్న అక్రమాలకు ఇదే ఉదాహరణ. ఈ చిత్రం మహబూబాబాద్ జిల్లాలోనిది.

- అడవుల్ని నరికి యథేచ్ఛగా అక్రమ పోడు
- హక్కు పత్రాలతో అటవీ భూముల్లో పాగా
- బినామీ పేర్లతో ఆక్రమణ.. వ్యవసాయం
- కబ్జాలతో కుచించుకుపోతున్న అడవులు
- పాఠ్యపుస్తకాలకే పరిమితం కానున్న 'కాకులు దూరని కారడివి'

సాక్షి, నెట్‌వర్క్

అడవి.. తనను నమ్ముకున్నోళ్లకు, అమ్ముకుంటున్నోళ్లకు మధ్య నలిగిపోతోంది. ఆక్రమణలు, దౌర్జన్యాల ఆటవిక చేష్టలకు చిక్కిశల్యమైపోతూ 'అరణ్య'రోదన చేస్తోంది. పలుకుబడి గల పెద్దలు, రాజకీయ ముసుగులోని స్థానిక నాయకులు, కబ్జాదారులు వనాలను నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ఆదివాసీ, గిరిజన తెగలకు అడవిపై జన్మతః ఓ 'హక్కు' ఉంటుంది. అలా వారికి సంక్రమించిన హక్కుల్లో 'పోడు వ్యవసాయం' ఒకటి. ఇప్పుడా హక్కుకు, అడవికి ముప్పొచ్చింది. వనజీవన విధానాన్ని నాశనం చేస్తూ, అడవిబిడ్డలను తరిమేస్తూ, అడవులను నరికేస్తూ, ఆక్రమించేస్తూ రకరకాల ముసుగుల్లో గిరిజనేతరులు పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. ప్రస్తుతం 'పోడు'పేరుతో నడుస్తోన్న పాడు దందా.. చోటుచేసుకుంటున్న ఆటవిక దాడులు, అటవీ ఆక్రమణలు మిగతా 2వ పేజీలో ▶

ఆక్రమణల్లో 'టాప్' జిల్లాలు (హెక్టార్లలో)

జిల్లా	అటవీ విస్తీర్ణం	ఆక్రమణ	ఆక్రమణ శాతం
ఆదిలాబాద్	1,70,689	35,890	21.009
భద్రాద్రి	4,28,698	78,199	18.241
ములుగు	4,50,504	22,470	4.988
ఖమ్మం	62,189	17,285	27.794
ఆసిఫాబాద్	2,42,017	34,997	14.461
మహబూబాబాద్	1,49,070	40,291	27.028
వరంగల్ (రూరల్)	16,359	13,930	85.151

ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సాకపెట్టి సాగంగ.. మొక్కులు తీరంగ..

వైభవంగా ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర - వివరాలు 2లో

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
ఫోన్: 040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని
www.shriramcity.in
*షరతులు వర్తిస్తాయి

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Venkobb FRESH CHICKEN
సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ హైదరాబాద్ తోస్ ధరలు
గ్రుడ్ల రిటైల్ ధర ₹ 46 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 76 కిలో
డ్రస్డ్ స్కిన్‌తో 142 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 98 కిలో
స్కిన్‌లెస్ 162 కిలో
Courtesy Agriculture
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



బీసీలు, ముస్లింలకు

సగం టికెట్లు..

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యేకంగా కేటాయిస్తాం: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ వెల్లడి
- బీసీ రిజర్వేషన్లపై టీఆర్ఎస్ తీరును ఎండగట్టాలి.. పార్టీ శ్రేణులు రేపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలి
- సంగారెడ్డిలో కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక భేటీ

4 లో

సీపీఐ పగ్గాలు అందుకున్న రాజా

- సీపీఐ ప్రధాన కార్యదర్శిగా డి.రాజా ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని జాతీయ సమితి ఆమోదించింది. - 5లో

శ్రీజ తడాఖా

- కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో మూడు పతకాలు ఖాయం చేసుకున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ. - స్పోర్ట్స్‌లో

2 కోట్లు.. ఓ పెట్రోల్ బంకు

- తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బీజేపీ ప్రలోభాలు
- పార్టీలో చేరకుంటే జైలుకు పంపుతామంటూ బెదిరింపులు
- బీజేపీ తీరుపై ధ్వజమెత్తిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

- వివరాలు 5లో

డాలర్ డ్రీమ్స్ కరిగిపోతాయా?

హెచ్-4 వీసాల రద్దుతో అందరికీ నష్టం... ఎస్ఏపీఆర్ఐ సర్వే 5 లో



తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదొక రికార్డు

ఉద్యోగాల కల్పనపై ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల చరిత్రలో 4.01 లక్షల ఉద్యోగాలు కల్పించడం ఒక రికార్డు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో 1,33,494 శాశ్వత ఉద్యోగాలు ఉన్నాయని వెల్లడించారు. ఈమేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదొక రికార్డు. 1,33,494 శాశ్వత ఉద్యోగాలతో సహా మొత్తం 4.01 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నాం. పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పుగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ తీసుకు వస్తున్నాం. మీ ఆశీర్వాద బలం వల్లే ఇది సాధ్యమవుతోంది'అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు 8 గంటలే పని

ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్లకు రోజుకు 8 గంటలు మాత్రమే పనివేళలుగా అమలు చేయాలని సంస్థ సీఎండీ డి. ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక చట్టాల ప్రకారం 8 గంటల పనివేళల నియమాన్ని ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులతోపాటు ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని ఆదివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆయన సూచించారు. ఆపరేటర్ల పనివేళలకు సంబంధించి కచ్చితమైన సమాచారంతో హాజరు పట్టికలను నిర్వహించాలని, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

స్పైస్ జెట్ విమానం ఆలస్యం

విశాఖ వెళ్లాల్సిన ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్: ముంబై నుంచి శంషాబాద్ విమానాశ్రయం మీదుగా విశాఖపట్నం వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం 5 గంటలు ఆలస్యం కావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. స్పైస్ జెట్ విమానం ఉదయం 5.45 గంటలకు ముంబై నుంచి బయలుదేరి 7.15 గంటలకు శంషాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది. తిరిగి 7.45 గంటలకు శంషాబాద్ నుంచి బయలుదేరి 8.55 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉంది. అయితే విమానంలో సాంకేతిక లోపం కారణంగా ముంబై నుంచి విమానం నిర్దిష్ట సమయానికి బయలుదేరలేదు. దీంతో శంషాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన ప్రయాణికులు సదరు ఎయిర్‌లైన్స్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మరమ్మతుల అనంతరం ఉదయం 10.37 గంటలకు ముంబై నుంచి బయలుదేరిన విమానం 11.59కి శంషాబాద్‌కు చేరుకుంది. 12.44 గంటలకు శంషాబాద్ నుంచి విశాఖకు బయలుదేరడంతో ప్రయాణికులు శాంతించారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఫౌండేషన్ కోర్సు అభ్యర్థుల జాబితా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా నిర్వహించే ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను **tsscstudycircle.telangana.gov.in** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పది స్టడీ సర్కిళ్లలో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుకు అభ్యర్థులను రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశామన్నారు. ఒక్కో స్టడీ సర్కిల్‌లో 100 మంది అభ్యర్థులకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇస్తామని, ప్రతివిద్యార్థికి పాకెట్‌మనీతో పాటు రూ.2,500 విలువ చేసే బుక్స్ కిట్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న ఉద్యోగ ప్రకటనలకు ఈ ఫౌండేషన్ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందని, ఈ కోర్సు పొందిన అభ్యర్థులు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తా వస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 23 నుంచి 25 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా కేంద్రంలోని స్టడీ సర్కిల్‌కు వచ్చి పరిశీలనకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఆగస్టు 1 నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు ఫౌండేషన్ కోర్సు తరగతులు జరుగుతాయని చెప్పారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిరుపేదకు రూ.8 లక్షల పరిహారం

దేవయ్యకు చెక్కును అందజేస్తున్న అకున్ సబర్వాల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వినియోగదారుల సహాయ కేంద్రం ఓ బాధితుడికి అండగా నిలిచింది. డాక్టర్ల నిర్లక్ష్యంతో ఆపరేషన్ వికటించి ఉపాధి కోల్పోయి తీవ్ర అనారోగ్యానికి గురైన యోగా మాస్టర్‌కు రూ.8 లక్షలు నష్టపరిహారం ఇప్పించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లికి చెందిన పి.దేవయ్య(31) యోగా శిక్షకుడు. 2018 ఫిబ్రవరి 24 సికింద్రాబాద్‌లోని పైల్స్ క్లినిక్‌లో రూ.25 వేల ప్యాకేజీతో లేజర్ ట్రీట్‌మెంట్ చేయించుకున్నాడు. డిశ్చార్జి అయిన తర్వాత తీవ్రమైన రక్తస్రావం కావడంతో మరుసటిరోజు సంప్రదించాడు. దీంతో యశోదా హాస్పిటల్‌కు వెళ్లాలని వైద్యులు రిఫర్ చేశారు. చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమని డాక్టర్లు చెప్పడంతో దేవయ్య కుటుంబసభ్యులు, సన్నిహితులు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సంప్రదించారు. ఆయన తక్షణమే స్పందించి రూ.5.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. కానీ, నెలన్నర పాటు యశోద హాస్పిటల్‌లో చికిత్స చేసుకున్న దేవయ్యకు మొత్తం రూ.18 లక్షల ఖర్చు అయింది. మిగతా డబ్బుల కోసం తనకున్న కొద్దిపాటి భూమిని అమ్మి, మరికొంత అప్పు చేసి హాస్పిటల్ బిల్లు చెల్లించారు. అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత పైల్స్ క్లినిక్‌పై తెలంగాణ వినియోగదారుల సహాయకేంద్రాన్ని ఆశ్రయించారు. సహాయ కేంద్రం నిర్వాహకులు హాస్పిటల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి ఇరవై రోజుల్లో కేసును పరిష్కరించి దేవయ్యకు రూ.8 లక్షల నష్టపరిహారం ఇప్పించారు. ఈ చెక్కును పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ ఆదివారం దేవయ్యకు అందజేశారు.

'మున్సిపల్'పై గెజిట్ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన మున్సిపల్ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 19న శాసనసభ ఆమోదించిన బిల్లును ఆదివారం గవర్నర్ ఆమోదించడంతో తెలంగాణ మున్సిపల్ నిబంధనలు (సవరణ) చట్టం-2019గా దీన్ని గెజిట్ చేస్తున్నట్లు న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

జాబిల్లికి.. జైత్రయాత్ర!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించారు. 20 గంటల కౌంట్‌డౌన్ సమయంలో భాగంగా ఆదివారం రాత్రికి మూడో దశలోని క్రయోజనిక్ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టనున్నారు. అలాగే, సోమవారం వేకువజామున రాకెట్‌కు రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను పూర్తిచేయడానికి పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ద్రవ ఇంధనం నింపిన అనంతరం రాకెట్‌కు పలు పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తరువాత ప్రయోగానికి మరికొన్ని గంటల ముందు రాకెట్‌లో హీలియం గ్యాస్ నింపడానికి, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యవస్థలను అప్రమత్తం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చంద్రయాన్-2 ప్రయోగం ఇస్రో చరిత్రలో అతిపెద్ద మైలురాయిగా నిలిచిపోయే ప్రయోగంగా చెప్పవచ్చు. ఇంతపెద్ద రాకెట్‌ను, ఇంతపెద్ద ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ప్రయోగాన్ని ఇస్రో చరిత్రలో భారీ ప్రయోగంగా అభివర్ణిస్తున్నారు.

నేటి మ.2.43 గంటలకు వినువీధిలోకి..

కాగా, 20 గంటల కౌంట్‌డౌన్ అనంతరం సోమవారం మ.2.43 గంటలకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం1 ను ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రహాంతర ప్రయోగాల్లో ఈ ప్రయోగం మూడోది. చంద్రునిపై పరిశోధనలు చేయడానికి చేస్తున్న రెండో ప్రయోగం. షార్ నుంచి 75వ ప్రయోగం కావడం విశేషం. ఇదిలా ఉంటే.. ముందుగా అనుకున్నట్లుగా ఈనెల 15వ తేదీన జరగాల్సిన ఈ ప్రయోగం సాంకేతిక కారణాలతో చివరి క్షణంలో వాయిదా పడిన విషయం తెలిసిందే.

సాక పెట్టి సాగంగ... మొక్కులు తీరంగ..

ఉజ్జయినీ మహంకాళిని దర్శించుకున్న భాగ్యనగరం

హైదరాబాద్: తెలతెలవారంగా... జనమంతా తరలంగా... సాక పెట్టి సాగంగా... మొక్కులు తీరంగా... డప్పుల దరువేయంగా... బొటు పెట్టి బోనమెత్తగా.. భక్తజనం హోరెత్తగా... లష్కర్ పోటెత్తగా... అమ్మా.. బైలెల్లినాదో..! మహంకాళి బైలెల్లినాదో..! సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం వైభవంగా సాగింది. లక్షలాదిమంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక సమర్పించి సల్లంగ చూడాలని మొక్కుకున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సాధారణ భక్తుల నుంచి ప్రముఖుల వరకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి అమర్‌నాథ్ గౌడ్, ఎంపీలు రేవంత్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఓల్డ్‌దాస్ మండి నుంచి ఒక వాహనంలో బంగారు బోనంసహా 1008 బోనాలను మాజీ ఎంపీ కవిత, పలువురు భక్తులు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తుల బోనాలు...పోతురాజుల విన్యాసాలతో...సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలన్నీ పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీకి తోడు వీఐపీల తాకిడి పెరగడంతో సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ రద్దీని నియంత్రిస్తూ రాకపోకలపై భక్తులకు మార్గనిర్దేశం చేయాల్సిన పోలీసులు, ఇతర విభాగాల అధికారులు వీఐపీల సేవలో తరించిపోయారు. భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి రావడం, మంచినీరు, మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

తొలిపూజ చేసిన మంత్రి తలసాని

అమ్మవారి బోనాల జాతరలో భాగంగా ఆదివారం ఉదయం 4 గంటలకు మంత్రి తలసాని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన సతీమణి అమ్మవారికి బోనం సమర్పించారు. అటు తర్వాత మంత్రి తొలిపూజ చేశారు. అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనానికి అవకాశం కల్పించారు. మంత్రితోపాటు కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కృష్ణ కుటుంబసభ్యులు ఉన్నారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

బంగారు బోనంసహా 1008 బోనాలతో సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి చెంతకు వెళ్తున్న మాజీ ఎంపీ కవిత, పలువురు భక్తులు

ఏమిటీ 'పోడు' పని

▶ మొదటి పేజీ తరువాయి

ఎందాకా వెళ్తాయనేది అంతుబట్టని విషయంగా మారింది. తెలంగాణలో మొత్తం అటవీ విస్తీర్ణం 26.9 లక్షల హెక్టార్లు (24 శాతం). ప్రభుత్వం దీన్ని 33శాతానికి పెంచాలనే లక్ష్యంతో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఓ పక్క ఇటువంటి ప్రయత్నాలు జరుగుతుంటే.. మరోపక్క అటవీ భూముల ఆక్రమణ, చెట్ల నరికివేత వంటి విధ్వంసకర చర్యలతో పర్యావరణం తీవ్రంగా నష్టపోతోంది. అడవుల ఆక్రమణ, నరికివేత వంటి ఘటనల నేపథ్యంలో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 10శాతానికే పరిమితమైందనేది ఒక అంచనా. దేశంలోనే వేగంగా అటవీ విస్తీర్ణం తరిగిపోతున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో 'కాకులు దూరని కారడవి'అనేది పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాకతప్పదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు, ఆదివాసీల పేరుతో గిరిజనేతరులు సాగిస్తున్న సంప్రదాయేతర పోడు సాగు, అడవుల నరికివేత వంటి పరిణామాలు 'అడవులకు పట్టిన క్యాన్సర్'అని వారంటున్నారు.

ఏటూరునాగారం మండలంలోని అటవీ ప్రాంతంలో పోడు కోసం నరికేసిన చెట్లు

'పోడు' పేరుతో పాడు ఆక్రమణలు

గిరిజనులు, ఆదివాసీల పోడు వ్యవసాయం ప్రత్యేకమైనది. అడవుల్లోని వాలు గల ప్రాంతాల్లో ఉండే చిన్నపాటి పొదలు, మొక్కల్ని నరికి సేద్యానికి అనువుగా మలుచుకుంటారు. ఈ విధానంలో దుక్కి దున్నరు. నాగలికి ఎడ్లను కట్టరు. ఒక చిన్నపాటి పుల్ల (దీనిని 'కచల్'అంటారు)తో భూమిని లోతుకు పెళ్లగించి విత్తనాలు విత్తుతారు. వీరు సాగుచేసే పంటలు కూడా రాగులు, సజ్జలు, జొన్నలు ఇతర చిరుధాన్యాలే. ఈ పంటలకు పూర్తిగా పశువుల పెంటనే ఎరువుగా వినియోగిస్తారు. ఒకేచోట రెండు మూడు పంటల కంటే ఎక్కువ సాగు చేయరు. స్థిర వ్యవసాయం కంటే కూడా చాలా సహజ పద్ధతుల్లో సాగే ఈ పోడు వ్యవసాయం విధానాల వల్ల అడవులకు, పర్యావరణానికి కానీ పూచిక పుల్లంత హాని కూడా జరగదు. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పోడు భూముల విస్తీర్ణం భారీగా ఉంది. ఈ భూములపై కన్నేసిన ఆయా జిల్లాల్లోని స్థానిక నాయకులు ఆదివాసీలను మచ్చిక చేసుకుని, వారిని బినామీలుగా మార్చుకుని పోడు భూముల్ని చెరబట్టారు. గిరిజనుల పేరుతో తామే సాగుచేయడం మొదలుపెట్టారు. అసలైన పోడు వ్యవసాయానికి అర్థం మార్చేస్తూ.. అడ్డొచ్చిన మొక్కల్ని, చెట్లను నరికేస్తూ.. అడవులను మైదానాలుగా మార్చేసి సేద్యం చేయడం మొదలుపెట్టారు. అటవీ అధికారులతో పాటు ప్రభుత్వమూ చూసీ చూడనట్టు వదిలేయడంతో అడవులు ఆగమైపోతున్నాయి. పోడు, ఇతర అటవీ భూముల తదాగాలు చెలరేగినా, ఘర్షణలు తలెత్తినా గిరిజనులను ముందుంచి 'వివాదాస్పదం'చేయడం మొదలైంది. అందుకు తాజా ఉదాహరణలే మొన్న సిర్సాలా, కొత్తగూడెం ఉదంతాలు.

ఎక్కడికక్కడ అడవులు హాంఫట్

ప్రస్తుతం పోడుతో పాటు అటవీ భూములు ఎంతెంత ఎక్కడ ఆక్రమణకు గురయ్యాయో కూడా అటవీ శాఖ వద్ద సరైన లెక్కలు లేని దుస్థితి. ఎడాపెడా అడవులను ఆక్రమించేస్తున్న వారిలో అన్ని పార్టీలకు చెందిన వారున్నారు. తెలంగాణలో మొత్తం అటవీ విస్తీర్ణం 26,90,370 హెక్టార్లు కాగా, ఇందులో 2,94,693 హెక్టార్ల భూమి ఆక్రమణల చెరలో ఉంది. ఇది దాదాపు 11 శాతానికి సమానం. మొదట పోడు పట్టాలున్న ఆదివాసీలు, గిరిజనులను ముగ్గులోకి దించుతున్న ఆక్రమణదారులు.. వారిని ముందుంచి అడవుల ఆక్రమణకు తెగబడుతున్నారు. ఆపై నెమ్మదిగా కొద్ది కొద్దిగా ఆక్రమణలను విస్తరించుకుంటూ పోతున్నారు. ఈ ఆక్రమణల పర్వం ప్రస్తుతం చేయి దాటిపోయిన స్థితికి చేరింది.

అడవిపై హక్కెవరిది?

2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ ఓఎఫ్ఆర్) కింద పోడు భూముల పట్టాలిచ్చింది కొందరికే. ఇప్పటికీ ఆయా జిల్లాల్లో వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు కానీ గిరిజనేతరులు కానీ మూడు తరాలుగా (కనీసంగా 75 ఏళ్లు) అక్కడ నివాసం కలిగి ఉంటే.. వారికి సహజంగా అటవీ భూములపై హక్కులు కల్పించాల్సి ఉంది. కానీ, ఆదిలాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం తదితర జిల్లాల్లో వందేళ్లకు పైబడి అడవుల్లో ఉంటున్న వారికీ పట్టాలు అందని పరిస్థితి ఉంది. అటవీ హక్కుల చట్టం కింద 2017 చివరి వరకు 11 లక్షల ఎకరాలకు హక్కులు కల్పించాలంటూ 1,86,534 దరఖాస్తులు అందాయి. వీటిలో 6,30,714 ఎకరాలకు 1,83,107 మంది వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్నారు. సామూహిక (కమ్యూనిటీ) కేటగిరీ కింద 4,70,605 ఎకరాలకు 3,427 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వేల మంది ఇప్పటికీ అటవీ హక్కుల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతుంటే.. రెండు కేటగిరీల కింద 82,572 దరఖాస్తులను తిరస్కరించగా, తమ వద్ద మాత్రం 9,743 దరఖాస్తులు మాత్రమే పెండింగ్ ఉన్నాయని అటవీ, ఐటీడీఏ రికార్డులు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే, అటవీ శాఖ.. హక్కు పత్రాలున్న తమ భూముల్ని స్వాధీనం చేసుకోవడానికి చూపిస్తున్న ఉత్సాహం గిరిజనేతరుల ఆక్రమణలపై మాత్రం కిమ్మనడం లేదనే ఆరోపణలున్నాయి.

పోడు భూముల్లో కార్పొరేట్ సాగు

భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కావడిగుండ్ల, కన్నాయిగూడెం, పాత కన్నాయిగూడెం గ్రామాల్లో వందల ఎకరాల పోడు భూములున్నాయి. ఇవన్నీ స్థానిక నాయకుల గుప్పిట్లోనే ఉన్నాయి. ఈ ప్రాంతాలకు సమీపంలో గల ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా దొరమామిడి, పూచికపాడు, కన్నాపురం ప్రాంతాలకు చెందిన బడా గిరిజనేతర రైతులు ఈ పోడు భూముల్లో కార్పొరేట్ స్థాయిలో పంటల సాగు చేస్తున్నారు. అలాగే ఈ జిల్లాకు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి పెద్దసంఖ్యలో గొత్తికోయలు ఇక్కడకు వలస వచ్చి అటవీ భూముల్లో పోడు సాగు చేస్తున్నారు. ఒకటి రెండు పంటలు వేసిన అనంతరం ఆ భూముల్ని గిరిజనులు, గిరిజనేతరులకు అమ్మేస్తున్న దాఖలాలు ఉన్నాయి. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో 90 వేల ఎకరాల అటవీ భూముల్లో అక్రమంగా పోడు వ్యవసాయం సాగుతుండటమే ఇందుకు నిదర్శనం. ఇక, మహబూబాబాద్ జిల్లాలో 4,096.95 హెక్టార్లలో అక్రమంగా పోడు సాగుతోంది. చాలామంది ఆదివాసీలు, గిరిజనులు ఆర్థిక ఇబ్బందులతో తమ అటవీ భూముల్ని భూస్వాములు, స్థానిక నాయకుల చేతుల్లో పెడుతున్నారు. ఇలా లక్షల ఎకరాలు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

ఎక్కడపడితే అక్కడ 'పోడు'చేస్తున్నారు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో దాదాపు 10వేల ఎకరాల్లో అక్రమంగా పోడు సేద్యం సాగుతోంది. ఈ భూమిలో హక్కు పత్రాలున్నదెంత? లేనిదెంత? అనేది అధికారుల వద్దే లెక్కా పత్రం లేదు.
- మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన వ్యాపారి జనగం పాపారావు, పెద్దల్లాపురం గ్రామానికి చెందిన రామారావు వంద ఎకరాల చొప్పున, ఇదే గ్రామానికి చెందిన మాజీ మిలిటెంట్ రామ్‌చందర్ 70 ఎకరాల్లోనూ బినామీ పేర్లపై పోడు సాగు చేస్తున్నారు.
- ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో 30వేల ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైంది. ఈ డివిజన్‌లోని సార్సాలలో ఇటీవల అటవీశాఖ అధికారిణిపై దాడికి పాల్పడిన వారిలో పోచం అనే వ్యక్తి కూడా ఉన్నారు. ఈయన 40 ఎకరాల వరకు అటవీ భూమిని కబ్జా చేసినట్టు తేలింది. గిరిజనుల పేరుతో ఈయనకు డివిజన్ వ్యాప్తంగా వందల ఎకరాలను బినామీ పేర్లతో కబ్జా చేసినట్టు ప్రచారం సాగుతోంది.
- ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన ఓ ప్రముఖుడు తనతో పాటు తన బంధువులు, తన కింద పని చేసే వారి పేర్లపై నెమ్మళగుట్ట, జబ్బోనిగూడెం అటవీ ప్రాంతంలోని 50 ఎకరాల్లో జామాయిల్ తోటలు పెంచుతున్నారు. ఇందులో ఈయన పేరిట 15 ఎకరాల వరకు రెవెన్యూ రికార్డుల్లో ఉండగా, మిగతా భూమి తన పెట్రోలు బంకులో పనిచేసే సిబ్బంది పేర్లపై ఉన్నట్టు సమాచారం.
- ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని గోగుపల్లి, పప్కాపురం, చిన్నబోయినపల్లి శివారు ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు అడవుల్లోని చెట్లను కొట్టించి, కూలీలతో వ్యవసాయం చేయిస్తున్నారు. చిన్నబోయినపల్లిలోని వందల ఎకరాల భూమి గిరిజనేతరుల చేతుల్లోనే ఉండగా.. ఈ వివాదం ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది.

ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆస్పత్రి భవనం. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా గట్లమల్లారానికి చెందిన దుస్సా సమ్మయ్య ప్రైవేట్ వైద్యుడు,. అధికార పార్టీ నేతగానూ ప్రచారం చేసుకుంటాడు. తప్పుడు ధ్రువపత్రాలతో మొదట 5సెంట్ల భూమి కొనుగోలు చేసిన ఆయన మరో పది సెంట్ల వరకు పక్కనే ఉన్న అటవీ భూమిని ఆక్రమించి రెండంతస్తుల వైద్యశాలను నిర్మించారు. అనుమతుల ప్రక్రియ నిమిత్తం అటవీ అధికారి రూ.3 లక్షలు తీసుకున్న విషయం ఇక్కడ బహిరంగంగా చెప్పుకుంటారు. ప్రధాన రహదారి పక్కనే.. 70% అటవీ భూమిలో, 30% ప్రభుత్వ భూమిలో కనిపించే భవనం.. అటవీ భూముల ఆక్రమణకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. నిజానికి ఈ ప్రాంతంలో '170 యాక్ట్'అమల్లో ఉంది. అంటే, ఇక్కడ పట్టా భూమిలో వెంచర్ వేయడానికి కూడా వీల్లేదు. కానీ, రెండంతస్తుల భవనం కళ్లెదుటే కనిపిస్తున్నా.. పట్టించుకునే అటవీ, రెవెన్యూ అధికారులే లేరు.

అడవిలో ఆస్పత్రి

గిరిజనేతరులే కొట్టిస్తున్నారు

అటవీహక్కుల చట్టం కింద అక్రమంగా పట్టాలు పొందాలనే దురుద్దేశంతో గిరిజనేతరులు.. గొత్తికోయలతో అడవుల్ని కొట్టిస్తున్నారు. చెల్పాక అటవీ ప్రాంతంలో పలు పార్టీలకు చెందిన నాయకులు వందెకరాలకు పైగా అడవిని కొట్టించి పోడు వ్యవసాయం చేస్తున్నారు. అలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అర్హులైన గిరిజనులకు న్యాయం చేయాలి.

– తోలెం కిష్టయ్య, ముల్లకట్ట, ఏటూరు నాగారం

సర్కారు ఉద్యోగి 'పాడు'దందా

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పోడు పేరుతో అక్రమంగా సాగుచేస్తున్న భూమి. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలానికి చెందిన హాస్టల్ వార్డెన్ గుస్సా స్వామి.. మండలంలోని వివిధ ప్రాంతాల్లో 55 ఎకరాల్లో అక్రమంగా పోడుసాగు చేస్తున్నట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. కానీ తీగలాగితే.. ఇది 300 ఎకరాలుగా తేలింది. ఈయన భార్య సర్పంచ్ కూడా. మొత్తానికి ఈయన పోడు దందాపై ప్రభుత్వానికి ఫిర్యాదు అందిన దరిమిలా సస్పెండ్ అయ్యారు. తిరిగి విధుల్లో కూడా చేరిపోయాడు. ఈ జిల్లాకు చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఖానీం 18 ఎకరాల్లో అక్రమంగా పోడు సాగు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందిన మరుక్షణమే ఈయన కాంగ్రెస్ నుంచి అధికార పార్టీలోకి దూకేశారు. కేసు కాకుండా తప్పించుకున్నారు కానీ, పోడు భూమిని మాత్రం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పక్కాగా... పకడ్బందీగా..

- మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- నేడు హైకోర్టులో దాఖలు చేయాల్సిన కౌంటర్‌పై ఉన్నతాధికారుల భేటీ
- సీఎస్ జోషితో సమావేశమైన మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి
- కోర్టు సంతృప్తి చెందేలా శాస్త్రీయ వాదనలు వినిపించడంపై సమాలోచనలు

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అడ్డంగా మారిన కోర్టు కేసుల నుంచి బయటపడేందుకుగాను హైకోర్టులో పకడ్బందీగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే నెలలోపు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్న ప్రభుత్వం, నేడు హైకోర్టులో జరగనున్న కేసు విచారణలో కోర్టు సంతృప్తి చెందేలా వాదనలు వినిపించడంతో పాటు శాస్త్రీయంగా కౌంటర్ దా

కుంటాలకు మళ్లీ జలకళ

నేరడిగొండ(బోథ్): కుంటాల జలపాతం మళ్లీ జలకళను సంతరించుకుంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని ఈ జలపాతానికి జల ప్రవాహం ప్రారంభమైంది. ఇన్నిరోజులు వర్షాలు లేక బోసి పోయి కనిపించిన జలపాతం ఇప్పుడు జలకళను సంతరించుకొని పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

'లక్నవరం' వెలవెల..

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు గతేడాది ఇదే సమయంలో నీటితో కళకళలాడుతూ ఉండగా నేడు నీరు లేక వెలవెలబోతోంది. గత ఏడాది జూలై 21 నాటికి లక్నవరం సరస్సులో నీరు 30 అడుగులకు చేరింది. అయితే ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం సరస్సులో 13 అడుగుల నీరు మాత్రమే ఉంది.

నేడు చింతమడకకు సీఎం కేసీఆర్

- గ్రామస్తులతో రోజంతా సమావేశం
- మూడు వేల మందితో సహపంక్తి భోజనం
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబ సమేతంగా సోమవారం స్వగ్రామమైన చింతమడకకు రానున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు గ్రామంలో పర్యటించడంతో పాటు గ్రామ ప్రజలతో కలసి సహపంక్తి భోజనం చేయనున్నారు. సీఎం హోదాలో కేసీఆర్ ఒక రోజంతా తన స్వగ్రామంలో గడిపేందుకు వస్తుండటంతో ఆయన బాల్యమిత్రులతో పాటు గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. సీఎం రాక నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామిరెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీస్ కమిషనర్ జోయల్‌డేవిస్ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

వరుసగా రెండు సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన సీఎం కేసీఆర్ ప్రధానంగా చింతమడక గ్రామ ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో వస్తున్నారు. ముందుగా గ్రామంలో సర్వే ద్వారా ప్రస్తుత స్థితిగతులను సేకరించారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు అందించడంతోపాటు, గ్రామంలో అభివృద్ధి పనులు, ప్రజలతో ఆత్మీయ సమావేశం, గ్రామస్తులతో సహపంక్తి భోజనంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీ, రూ.30 కోట్లతో నిర్మించనున్న బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల శంకుస్థాపన, రామాలయం ప్రారంభోత్సవం, చారిటబుల్ ట్రస్ట్ తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

చింతమడకలో గ్రామస్తులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పోశవ్వ మీ శేఖరన్న వస్తుండు..

'పోశవ్వ మీ అన్న శేఖరన్న ఊరికి వస్తుండు. గ్రామంలో జరిగే ముఖ్యమంత్రి సభకు తప్పకుండా రావాలే.' పొద్దున 11 గంటల వరకు సీఎం సారు వస్తున్నారని గ్రామానికి చెందిన పోశవ్వతో ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు.

సర్వే నివేదిక ఆధారంగా సీఎం ప్రకటన

గ్రామ స్వరూపాన్ని, ప్రజల జీవన స్థితిగతులను మార్చే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇటీవల గ్రామంలో నిర్వహించిన కుటుంబ సర్వే నివేదికను అధికారులు సోమవారం సీఎంకు అందజేయనున్నారు. సర్వేలో వివరాల ఆధారంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా, వ్యక్తిగత ప్రయోజన లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించనున్నారు. ప్రతీ కుటుంబానికి రూ.10 లక్షల విలువైన సంక్షేమ ఫలాలు అందిస్తామన్న సీఎం ముందస్తు ప్రకటన నేపథ్యంలో సర్వే నివేదికకు ఎంతో ప్రాముఖ్యత నెలకొంది. సీఎం కేసీఆర్ చింతమడక పర్యటన నేపథ్యంలో పోలీస్ అధికారులు ఆదివారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. వాతావరణం సహకరిస్తే సీఎం హెలీకాప్టర్ ద్వారా గ్రామానికి చేరుకోనున్నారు. పరిస్థితి అనుకూలంగా లేకపోతే రోడ్డు మార్గాన చింతమడకకు చేరుకునే అవకాశం ఉంది. హెలీప్యాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామిరెడ్డితో పాటు గ్రామ సర్పంచ్‌లు స్వాగతం పలికేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ముఖ్య మంత్రితో సమావేశంలో పాల్గొనే గ్రామస్తులందరికీ ప్రత్యేకంగా గుర్తింపు కార్డులను జిల్లా అధికారులు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. సుమారు 3,200 మంది గ్రామ ప్రజలతో కలసి సీఎం సహపంక్తి భోజనాలు చేయనున్నారు. సీఎం పర్యటన కేవలం చింతమడక గ్రామానికి పరిమితం కావడంతో జిల్లా, నియోజకవర్గాల నుంచి నాయకులు, అభిమానులు, ప్రజలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు, సూచనలు చేశారు.

3 వేల మందితో సహపంక్తి భోజనం..

సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌శర్మ

బ్రాహ్మణ పరిషత్ సంక్షేమ ఫలాలు పొందండి

సమాఖ్య అధ్యక్షుడు జగన్మోహన్‌శర్మ

వేములవాడ: బ్రాహ్మణ పరిషత్ ద్వారా అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందరూ పొందాలని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఆదివారం బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ యువతరం రాజకీయాల్లోకి రావాలని అన్నారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, కోశాధికారి సముద్రాల విజయ సారథితోపాటు 31 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన గంభీరావుపేట సర్పంచ్ కటకం శ్రీధర్, మెదక్ జిల్లా దొంతి సర్పంచ్ ఫణి శశాంక్ శర్మను ఘనంగా సన్మానించారు. తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చొప్పకట్ల కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా బుడంగారి మహేశ్, కోశాధికారిగా పురాణం శ్యామ్ ఎన్నికయ్యారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా సిద్దిపేట

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు చదవాలని సూచన

సిద్దిపేట టౌన్: సిద్దిపేట పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్, తన ఆకాంక్ష అని హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.19.39 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పీజీ కాలేజీ భవనం, బాలికల హాస్టల్‌ను ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రామచంద్రంతో కలసి ప్రారంభించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. 1994లోనే సిద్దిపేట పీజీ కళాశాలకు నాంది పడిందన్నారు. సిద్దిపేటలో రెండు మెడికల్ కళాశాలలు ఉన్నాయని, నాలుగు పాలిటెక్నిక్, ఐటీఐ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మహిళా ఎస్సీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు తెచ్చామని వివరించారు.

వర్సిటీ ఏర్పాటుకు చర్యలు...

జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని హరీశ్‌రావు తెలిపారు. గతేడాదే వర్సిటీ ఏర్పాటయ్యే అవకాశం వచ్చిందని కానీ విద్యతోపాటు పేద ప్రజలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో ముందుగా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. వివిధ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిపేలా మీలో ఉన్న నైపుణ్యాలను బయటకు తీయాలని విద్యార్థులకు సూచించారు. పీజీ కాలేజీలోనూ ఫిషరీస్ కోర్సును అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న కాలంలో జిల్లాలో మత్స్య సంపద పెరిగే అవకాశం ఉందని, దీంతో ఫిషరీస్ కోర్సుకు డిమాండ్ ఉంటుందన్నారు. మనం చదివే విద్యా విధానంలో మార్పు రావాలని, రెగ్యులర్ కోర్సులు కాకుండా మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న కోర్సులను చదువుకోవాలని సూచించారు. ప్రైవేటు రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యం ఉంటే ఆ రంగంలోనూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. పీజీలు, బీటెక్‌లు చదివి కానిస్టేబుల్ ఉద్యోగాలు చేస్తున్న వారిని చూస్తుంటే ఎంతో బాధ కలుగుతుందని, ప్రతి విద్యార్థి ఒక సైంటిస్ట్‌గా మారాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఉస్మానియా వర్సిటీ వీసీ రామచంద్రం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో సిద్దిపేట పీజీ కళాశాల ముందుందన్నారు. జెడ్పీచైర్ పర్సన్ వేలేటి రోజారాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సిద్దిపేట పీజీ కళాశాల దోహదపడుతుందన్నారు. కార్యక్రమం లో ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల కాపరులపైకి దూసుకెళ్లిన ఇన్నోవా

- అక్కడికక్కడే ముగ్గురి మృత్యువాత
- కుచ్చర్‌కల్ సమీపంలో ఘటన

జడ్చర్ల (మహబూబ్‌నగర్ జిల్లా): పశువుల కాపరులపైకి ఇన్నోవా దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చర్‌కల్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రంగయ్య (52), యాదగిరి (18), చంద్రయ్య (50) తమకున్న గేదెలు, ఆవులను మేత కోసం శివారులోని ఉప్పుచంద్రయ్యగడ్డ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. సాయంత్రం 4 గంటలకు తిర్మలాపూర్ నుంచి రాజాపూర్ వైపు అతివేగంగా వెళ్తున్న ఇన్నోవా వాహనం రోడ్డుకు కొద్ది దూరంలో పశువులను మేపుతూ ఒకేచోట కూర్చుని మాట్లాడుకుంటున్న ఈ ముగ్గురిపైకి దూసుకెళ్లింది. దీంతో ఆ ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పరారీ అయిన నిందితుడిని తమకు అప్పగించాలంటూ గ్రామస్తులు రోడ్డుపై కొద్దిసేపు బైఠాయించారు. బాధిత కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి సీఐ శివకుమార్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- ప్రజా సమస్యలు పట్టని సీఎం కేసీఆర్: ఎంపీ బండి సంజయ్
- కేసీఆర్.. జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండు: డీకే అరుణ

హుస్నాబాద్: ప్రస్తుతం తెలంగాణలో పశ్చిమ బెంగాల్ తరహాలో అరాచక పాలన సాగుతోందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. టీఆర్ఎస్ అవినీతిని ప్రశ్నించిన బీజేపీ కార్యకర్తలను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కరీంనగర్ జిల్లా సీపీఐ కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరిక సందర్భంగా జరిగిన పార్టీ సమావేశానికి ముఖ్య అతిథులుగా బండి సంజయ్, మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డీకే అరుణ హాజరయ్యారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను పేరు మార్చి, తనవిగా చెప్పుకుంటూ కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ వాటాలేని పథకాలేవో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ స్థానాలను కైవసం చేసుకోవాలన్న కుతంత్రంతో బీజేపీని ఎదుర్కొనేందుకు హిందూ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారని ఆరోపించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అరాచకాలన్నింటినీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి గుణపాఠం చెబుతామన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతోపాటు 2023లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ విజయం సాధించి గోల్కొండపై కాషాయం జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు.

టీఆర్ఎస్ పతనం ప్రారంభమైంది: డీకే అరుణ

బండి సంజయ్ ఘనవిజయంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన కరీంనగర్ గడ్డ నుంచే టీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని డీకే అరుణ అన్నారు. టీఆర్ఎస్ ముఖ్య నాయకులుగా చలామణి అయిన వినోద్‌కుమార్, కేసీఆర్ కూతురు కవితలను ఓడించి రెండు జిల్లాల ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కేసీఆర్ అరాచక పాలనలో నిజాంలను మించిపోయారని ఎద్దేవా చేశారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను గందరగోళంగా మార్చిన సీఎం, మున్సిపల్ చట్టాల్లో మార్పులు చేస్తూ రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసీర్‌తోపాటు కేటీఆర్, కవితలు జైలుకు వెళ్లేందుకు మూటా ముల్లె సర్దుకుని సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. టీఆర్ఎస్ పాలనలో అవినీతి బీజం ప్రగతి భవన్ నుంచే మొదలైందని ఆరోపించారు. కేసీఆర్‌కు రాష్ట్రమన్నా, దేశమన్నా ఎలాంటి భక్తి భావాలు లేవని, కేవలం ఓవైసీ సోదరులపైనే ఆయన భక్తి కురిపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కన్నెపల్లిలో మళ్లీ రెండు మోటార్లు షురూ

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కన్నెపల్లి పంపుహౌస్‌లో మళ్లీ రెండు మోటార్లను ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. నాలుగు రోజులుగా ఆటోమోడ్ పద్ధతిలోకి మార్చడానికి మోటారకు విరామం ఇచ్చిన విషయం తెలిసిందే. ఆదివారం పంపుహౌస్‌లోని 3, 4 నంబర్ల మోటార్లు డెలివరీ సిస్టంలో నీటిని ఎత్తిపోశాయి. మిగతా మోటార్లు కూడా సోమవారం నుంచి ఎత్తిపోస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

నేడు రెండో మోటార్‌కు వెట్‌రన్

కన్నెపల్లిలో 2వ నంబర్ మోటార్‌కు ఇప్పటి వరకు వెట్‌రన్ నిర్వహించలేదు. దీనికి సోమవారం వెట్‌రన్ నిర్వహించే అవకాశం ఉందని, దీనితోపాటు 7, 8 మోటార్లకు కూడా వెట్‌రన్ నిర్వహిస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కాగా, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు ఆదివారం కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించారు. పంపింగ్ పనులను తనిఖీచేశారు.

కన్నెపల్లి పంపుహౌస్‌లో పనులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

గేట్లన్నీ మూత..: మేడిగడ్డ బ్యారేజీలోని 85 గేట్లను మూసివేశారు. నాలుగు రోజుల క్రితం వరద ఉధృతి పెరగడంతో ఇంజనీరింగ్ అధికారులు 8 గేట్లు ఎత్తారు. వరద ఉధృతి తగ్గుతుండడంతో రెండేసి చొప్పున గేట్లు మూస్తూ వచ్చారు.

అన్నారంలో..: అన్నారం బ్యారేజీలో నాలుగు రోజులుగా మోటార్లు నిలిపివేశారు. ఆదివారం కన్నెపల్లిలో రెండు మోటార్లు నడపటంతో మళ్లీ గ్రావిటీ కాల్వ నుంచి నీటిని తరలించారు. దీంతో అన్నారం బ్యారేజీలోకి నీరు చేరుతోంది.

ముగిసిన కేఎంసీ వజ్రోత్సవాలు

ఎంజీఎం: వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) వజ్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం ప్రారంభమైన ఈ వేడుకల్లో 1959 నుంచి 2019 వరకు కళాశాలలో వైద్య విద్య అభ్యసించిన పలువురు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. ఉదయం సైకియాట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే వాక్ కార్యక్రమాన్ని నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు ప్రారంభించారు.

మన సంస్కృతిలో భాగం బోనాల పండుగ

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని (బాన్సువాడ): బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో భాగమని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన బోనాల పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని లక్షలాది మంది మహిళలు ఆషాఢ మాసంలో బోనాలు సమర్పించి అమ్మవారిని ప్రార్థిస్తారన్నారు. గ్రామ దేవతలు కరుణించి రాష్ట్రాన్ని ఆశీర్వదించాలని ప్రార్థించారు. గ్రామస్తులకు ఆయన బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రుద్రూర్‌లో బోనం ఎత్తుకున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

శిక్షించాలే కానీ రద్దు చేస్తామంటే ఏలా?

- వీఆర్ఓ వ్యవస్థ రద్దుపై ఎంపీ కోమటిరెడ్డి ధ్వజం
- ఆగస్టు 15 నుంచి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు సాధన పాదయాత్ర

నల్లగొండ: గ్రామాల్లో పనిచేసే వీఆర్ఓలను అవినీతిపరులు అని నిందిస్తూ వీఆర్ఓ వ్యవస్థను మారుస్తా అని అంటున్న సీఎం కేసీఆర్ వాటిని కూడా రద్దు చేస్తారా అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. వీఆర్ఓలు నిజంగా తప్పు చేస్తే వారిని శిక్షించాలని కానీ ఆ వ్యవస్థనే రద్దు చేస్తామనడం సరికాదని హితవు పలికారు. ఆదివారం నల్లగొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ మంత్రే లేడని ఎద్దేవా చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి లేడు కానీ మున్సిపల్ చట్టాలు వచ్చాయన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకుగాను పెంచిన ఆసరా పింఛన్ల ఉత్తర్వులను ఇప్పుడు ఇస్తున్నారని, ఓడిపోతామన్న భయంతోనే వార్డుల విభజన ఇష్టానుసారంగా చేపట్టారని ఆరోపించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆగస్టు 15న బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌లోని జల సౌధ వరకు ప్రాజెక్టు సాధన పాదయాత్ర చేస్తానని చెప్పారు. తెలంగాణ ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ ఇస్తానని కేసీఆర్ మాట తప్పారని.. ఏపీలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అక్కడి ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ ఇచ్చారని గుర్తుచేశారు.

బదిలీలు యూనియన్ ఆఫీసుల్లో జరగవు: మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ: బదిలీలు యూనియన్ ఆఫీసుల్లో జరగవని, సీఎంఓలోనే జరుగుతాయని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన కేజీ టు పీజీ తెలంగాణ విద్యా సదస్సులో ఆయన పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా బదిలీలు జరుగుతున్నాయని ఎస్‌టీయూ ఆరోపించడం సరికాదన్నారు. బదిలీలు ప్రభుత్వం చేస్తుందని.. యూనియన్ కార్యాలయాల్లో జరగవని.. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి విశేష అధికారాలు ఉంటాయని గుర్తుచేశారు. ఎవరు ఎక్కడ అవసరం అనేది ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. సీఎంఓలో అక్రమ బదిలీలు జరుగుతున్నాయని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు హైదరాబాద్‌లో చేసిన ధర్నాపై ప్రశ్నించగా మంత్రి పైవిధంగా స్పందించారు. 70 ఏళ్ల నాటి బ్రిటిష్ విద్యావిధానం కారణంగా విద్యా వ్యవస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. విద్యా విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

సౌదీలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు మంచిర్యాల జిల్లా వాసుల మృతి

మల్లేశ్

రాజు

జన్నారం/దండేపల్లి: ఉపాధి కోసం కుటుంబాన్ని వదిలి సౌదీకి వెళ్లిన మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన ఉప్పు మల్లేశ్ (42) ఆదివారం ఉదయం రియాద్ నగరంలో దండేపల్లి మండలం గుడిరేవుకు చెందిన నాంపెల్లి రాజు (24)తో కలసి స్కూటీపై వెళ్తుండగా వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఉప్పు మల్లేశ్ మార్బుల్ దుకాణంలో పని చేస్తుండగా, రాజు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మల్లేశ్‌కు భార్య భాగ్యతోపాటు మహేశ్, నవీన్ అనే ఇద్దరు కొడుకులున్నారు. రాజుకు తల్లిదండ్రులు రాజవ్వ, సత్తయ్యలతో పాటు చెల్లి ఉంది. వీరి మృతదేహాలను స్వగ్రామానికి తీసుకురావాలని కుటుంబీకులు కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరుకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. భిక్కనూరు సీఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని చిలుకానగర్‌కు చెందిన లోకేష్ అలియాస్ స్వామి, తార్నాక ప్రాంతానికి చెందిన పిట్ల శ్రీనివాస్ తోడల్లుళ్లు. కామారెడ్డిలో అత్తగారింట్లో ఆదివారం బోనాల పండుగ ఉండడంతో వేకువజామునే బైక్‌పై కామారెడ్డికి బయలుదేరారు. భిక్కనూరు టోల్‌గేట్ వద్ద వీరి బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. స్వామి కామారెడ్డి ఆస్పత్రిలో మరణించగా.. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాతపడ్డాడు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
8 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ₹ 2000.00 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ఆఫర్ చేసింది.
మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద 23 జూలై, 2019 (మంగళవారం)న నిర్వహించ బడుతుంది. మరింత సమాచారం కొరకు 19 జూలై, 2019 (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ (www.rbi.org.in) ను చూడండి.
"మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

NALLA MALLA REDDY ENGINEERING COLLEGE
NAAC - 'A' GRADE, NBA ACCREDITED
COMMITTED FOR QUALITY EDUCATION
'B' CATEGORY / MANAGEMENT SEATS AVAILABLE IN
MECHANICAL, EEE, ECE & CIVIL
Rs. 86,000/- Annual Fee
SCHOLARSHIPS FOR THE MERIT STUDENTS
Contact & Apply Immediately
DIVYANAGAR, Near Narapally on Warangal Road at 16th KM from Hyderabad
9392184185/86, 9392184234, 040-29705020/29706020, info@nmrec.edu.in

ప్రైవేటు గేటెడ్ కమ్యూనిటీ కాదు.. ప్రభుత్వ టౌన్‌షిప్: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాలోని కొల్లూరులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు. 'ఇది ప్రైవేట్ గేటెడ్ కమ్యూనిటీ భవన సముదాయం కాదు. రూ. 1360 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న ఆధునిక టౌన్‌షిప్. 15,660 డబుల్ బెడ్‌రూం యూనిట్లతో ఆసియాలోనే అతి పెద్ద నిర్మాణంగా దీన్ని చెప్పొచ్చు. యావత్ భారత్‌కు ఇదో కొత్త గీటురాయిగా నిలవబోతోంది'అని ఆయన ట్వీట్‌లో తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 2 నిమిషాల వీడియోను కూడా ట్వీట్‌కు జతచేయడంతో అది వైరల్‌గా మారింది. 10 గంటల్లోనే దాదాపు 25 వేల మంది ఈ వీడియోను వీక్షించారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన కేంద్ర మాజీ మంత్రి



సాక్షి, హైదరాబాద్: ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసి చాలా రోజులు అయినందున మర్యాదపూర్వకంగా కలిసినట్లు దత్తాత్రేయ వెల్లడించారు.

బీసీలకు వ్యతిరేకంగా కొత్త మున్సిపల్ చట్టం

బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మున్సిపల్ చట్టం బీసీలకు పూర్తి వ్యతిరేకంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా చేసేందుకు ఈ చట్టాన్ని రూపొందించిందని విమర్శించారు. ఆదివారం బీసీ భవన్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి వారి రాజకీయ జీవితాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మున్సిపల్ చట్టంలో మార్పులు చేసిందని ఆరోపించారు. ఇంతకు ముందు పంచాయతీ రాజ్ సంస్థల్లోనూ బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 22 శాతానికి కుదించిందని, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల్లోనూ బీసీలకు ప్రభుత్వం ఎగనామం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిందిగా రాజ్యాంగం చెబుతోందని, కానీ ప్రభుత్వం మాత్రం బీసీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీసీల రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని, బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలని, హక్కులను సాధించుకోవాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీగా ప్రచారం చేసుకుని ప్రధాని అయ్యారు

మోదీపై మండిపడిన కంచ ఐలయ్య

హైదరాబాద్: వైశ్య కులంలో పుట్టిన మోదీ బీసీగా ప్రచారం చేసుకుని ప్రధాని అయ్యారని టీమాస్ ఫోరం చైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య విమర్శించారు. ఈ క్రమంలో దేశంలో పెద్ద మార్పు రావాల్సిన అవసరం ఉందని.. దీనికి గానూ కమ్యూనిస్టులు నిర్మాణాత్మకమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఎన్నికల రంగంలో దిగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో మార్క్సిజం-అంబేడ్కర్ ఆలోచనా విధానం-సామాజిక న్యాయం ప్రస్తుత కర్తవ్యం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐలయ్య మాట్లాడుతూ.. కింది కులాల వారిని ఐక్యం చేసి రాజ్యాధికారం వైపు పయనించేలా చేయాలని సూచించారు. ముస్లిం మైనార్టీకి చెందిన వ్యక్తిని తమ పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిని చేసిందని చెప్పారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మద్దికాయల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్, తాండ్ర కుమార్, జయరాజు, నల్లా సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాగరాజ్

హైదరాబాద్: తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కేశం నాగరాజ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం కార్యవర్గ సమావేశం నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో జరిగింది. సమావేశంలో సభ్యులు రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బొబ్బిలి రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బాలగౌని వెంకటేశ్‌గౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా పొతాగాని ఐలన్‌గౌడ్, బాదగౌని విక్రమ్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా దూడల శంకర్‌గౌడ్, కె.శ్రీనివాస్‌గౌడ్, ఐల మధుగౌడ్, కోశాధికారిగా పుంజాల హరిచరన్‌గౌడ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా బైరగోని ధనుంజని గౌడ్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ నిర్మాణం, నియామకాల బాధ్యతను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది గౌడలు ఉన్నారని, వారు అన్ని రంగాల్లో ముఖ్యంగా విద్యా, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం తోడ్పడాలని కోరారు.

ఆసరా కొత్త లబ్ధిదారుల ఎంపిక షురూ

- గతేడాది ఓటరు జాబితా వివరాల ఆధారంగా ఎంపిక
- పెంచిన పెన్షన్లు నేటి నుంచే లబ్ధిదారులకు...

సాక్షి, హైదరాబాద్: ఆసరా పథకం కింద నూతన లబ్ధిదారుల ఎంపికపై గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు మొదలుపెట్టింది. గతేడాది నవంబర్ 19న విడుదల చేసిన ఓటరు జాబితాను అనుసరించి వృద్ధాప్య పెన్షన్ దారుల కొత్త జాబితాను తయారు చేయనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే కొత్త పింఛన్ల మంజూరుపై ఆదేశాలు ఇవ్వడంతో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రాష్ట్రంలో ఎంత మంది 57 ఏళ్లు పైబడిన వారున్నారో లెక్కలు తీశారు. 57 ఏళ్ల నుంచి 64 ఏళ్ల మధ్య 8,45,339 మంది ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం 65 ఏళ్ల పైబడిన వారందరికీ పెన్షన్లు ఇస్తున్నారు. 57 ఏళ్లు నిండిన వారికి కూడా పెన్షన్లు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రెట్టింపు చేసిన పింఛన్ల సొమ్ము సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్నాయి. మొత్తం రూ.863.24 కోట్లను బ్యాంకులు, పోస్టాఫీసులకు తరలించారు. బ్యాంకుల నుంచి, బయోమెట్రిక్ విధానంతో పోస్టాఫీసుల్లో.. పింఛన్లను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. పెంపుదల ఉత్తర్వులు కూడా గ్రామ గ్రామాన లబ్ధిదారులకు చేరాయి. నగదు కూడా బ్యాంకులకు బదిలీ కావడంతో.. సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారులు పింఛన్లు తీసుకునేందుకు అవకాశముంటుంది. ఇటు బ్యాంకర్లు కూడా పింఛన్‌దారులకు నగదు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 38.99 లక్షల మంది పింఛన్‌దారులుండగా... పెరిగిన సొమ్ము ప్రకారం రూ.863.24 కోట్లు ప్రతీనెలా చెల్లించాల్సి వస్తుంది. 2018 నవంబర్ 19న విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం రాష్ట్రంలో 8,45,339 మంది 57 ఏళ్ల నుంచి 64 ఏళ్ల మధ్య ఉన్నవారున్నారు. సేకరించిన జాబితాలో ఇతర పింఛన్లు పొందుతున్న వాళ్లు ఎవరైనా ఉన్నారా, ప్రభుత్వపరంగా ఉద్యోగాలు చేస్తున్నవారు లేదా సదరు కుటుంబంలో ఇతర సభ్యులెవరైనా లబ్ధిదారులు ఉన్నారా అనే అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు కూడా తీసుకున్నారు. ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటున్న వారి సంఖ్య 12,92,594గా ఉంది. వీరికి అదనంగా మరో 7 లక్షలకుపైగా పెరిగే అవకాశాలున్నాయి.

అందాల ఆదిలాబాద్..

ఆదిలాబాద్ అటవీ ప్రాంతం గుండా వెళ్తున్న ఎన్‌హెచ్ 44 రహదారి వెంట పచ్చదనం పరుచుకుంది. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు, రోడ్డు డివైడర్ల మధ్య విరబూసిన పూల మొక్కలు ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ రహదారి గుండా ఆదిలాబాద్ నుంచి నిర్మల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బీసీలు, ముస్లింలకు సగం టికెట్లు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యేకంగా కేటాయిస్తాం: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్
- అభ్యర్థులంతా పార్టీ మారబోమని అఫిడవిట్ ఇవ్వాలి
- సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పురపాలక ఎన్నికల సన్నాహక భేటీ

సాక్షి, సంగారెడ్డి: త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లు కాకుండా బీసీలు, ముస్లింలకు ప్రత్యేకంగా 50 శాతం సీట్లు కేటాయిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాలతో కాంగ్రెస్ ఏకీభవిస్తోందని, ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన టీపీసీసీ పురపాలక ఎన్నికల రాష్ట్రస్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ భేటీలో మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలు చర్చించారు. ఈ భేటీ అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై టీఆర్ఎస్ విధానాన్ని తప్పుపడుతూ ఈ నెల 23న అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు సర్వసన్నద్ధంగా ఉండాలని, ఈ నెల 26న అన్ని మున్సిపాలిటీల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో అన్ని మున్సిపాలిటీలలో స్థానిక నేతల ఆధ్వర్యంలో 'ఇంటింటికీ కాంగ్రెస్-వాడవాడనా జెండా'నినాదంతో పార్టీ శ్రేణులు ముందుకు కదలాలన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంటుందని ఉత్తమ్ పునరుద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. కౌన్సిలర్ లేదా కార్పొరేటర్‌గా గెలిచాక చైర్మన్, వైస్‌చైర్మన్, కో-ఆప్టెడ్ సభ్యులకు ఓటు వేసే విషయంలో పార్టీ విప్ ధిక్కరించనని, గెలిచాక పార్టీ వీడనని అఫిడవిట్‌లో స్పష్టం చేయాలన్నారు. కాగా, ప్రస్తుతం ఎంపీగా పార్లమెంటులో అడుగుపెట్టిన తనకు పార్లమెంటు భవనం కంటే తెలంగాణ అసెంబ్లీ, సెక్రటేరియట్ భవనాలే బాగున్నట్లు అనిపించిందన్నారు. వీఆర్వో వ్యవస్థలో లోపాలను ప్రభుత్వం మెరుగుపరచాలే కానీ రద్దు చేయాలనుకోవడం తగదన్నారు. అనంతరం జగ్గారెడ్డితో కలసి కల్పగూరు వద్దనున్న మంజీరా డ్యామ్‌ను సందర్శించిన ఉత్తమ్... ప్రభుత్వం పటాన్‌చెరు వరకు సరఫరాయ్యే గోదావరి జలాలను సంగారెడ్డికి తరలించాలని ప్రభుత్వానికి సూచించారు.

టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే...

అంతకుముందు జరిగిన సన్నాహక సమావేశంలో ఉత్తమ్ మాట్లాడుతూ టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టంచేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గట్టి పోటీ ఇచ్చి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు ఎంపీ సీట్లు గెలవగానే అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు పగటి కలలు కంటున్నారని, అది ఎన్నటికీ నెరవేరదని ఎద్దేవా చేశారు. కొత్త మున్సిపల్ చట్టంలో ప్రత్యక్షపద్ధతిలో చైర్మన్‌ను ఎన్నుకుంటే బాగుండేదన్నారు. కౌన్సిలర్లు, చైర్మన్లను తొలగించే అధికారం కలెక్టర్లకు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 25 మున్సిపాలిటీల్లో ఎన్నికలపై హైకోర్టు స్టే ఇచ్చినా ఎన్నికల నిర్వహణకే రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

పట్టణాల్లో వ్యతిరేకత ఉంది...

మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా ఎదుర్కోవాలని టీపీసీసీ రాష్ట్ర స్థాయి సమావేశంలో నేతలు నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, దాన్ని సొమ్ము చేసుకోవడానికి మున్సిపల్ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లేలా కసరత్తు చేయాలని తీర్మానించారు. సమావేశంలో భాగంగా ఒకరిద్దరు జిల్లా అధ్యక్షులు పార్టీ నేతల వైఖరి మార్చుకోవాలని సూచించినట్టు తెలిసింది. ముందు రాష్ట్ర స్థాయి నేతలంతా ఏకతాటిపైకి వచ్చి గాంధీ భవన్ మెట్లెక్కితే పార్టీ గాడిన పడుతుందని, జిల్లాల్లో సమావేశాలు నిర్వహించేటప్పుడు అందరికీ సమాచానమిచ్చి నిర్వహిస్తే బాగుంటుందని వారు సూచించినట్టు సమాచారం. స మావేశానికి ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సీతక్క, పోడెం వీర య్య తదితరులు హాజరు కానప్పటికీ వారంతా వ్యక్తిగత పనుల వల్లే రాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి పనుల కోసం తీర్మానం...

జిల్లాకు మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, గోదావరి జలాలతో సింగూరు ప్రాజెక్టును నింపడం, సంగారెడ్డి ప్రజల తాగు, సాగునీటి అవసరాలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రతిపాదనలు చేయగా వాటిని ఆమోదిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. అలాగే రామాయంపేట్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలనే తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. సమావేశంలో పార్టీ నేతలు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, సంపత్‌కుమార్, వంశీధర్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్‌పద్మావతి, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, గీతారెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, నిర్మలా జగ్గారెడి తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కుంతియా. చిత్రంలో పొన్నం, గీతారెడ్డి, పొన్నాల, ఉత్తమ్ తదితరులు

గెలుపు గుర్రాలకే టికెట్లు: కుంతియా

మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుస్తామని ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి. కుంతియా ధీమా వ్యక్తం చేశారు. గెలిచే వారిని గుర్తించి టికెట్లు కేటాయించాలని ఆయన సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తక్కువ సీట్లు వచ్చినా ఓట్ల శాతం మాత్రం పెరిగిందన్నారు. ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తూ కొత్త మున్సిపల్ చట్టంలో కలెక్టర్లకు సంపూర్ణ అధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఎమ్మెల్యే భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు కట్టబెట్టడం విచారకరమన్నారు. శాసనసభలో మందబలం ఉందని సీఎం కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు చట్టాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మున్సిపల్ ఎన్నికల సీట్ల కేటాయింపులో ముస్లింలు, యువతకు ప్రాధాన్యమివ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ సూచించారు.

కన్నభూమికీ సేవలందించండి

అమెరికాలోని భారత సంతతి వైద్యుల సదస్సులో ఉపరాష్ట్రపతి

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో సేవలందిస్తున్న భారతీయ వైద్యులు తమను కన్న భూమి సేవకూ ముందుకు రావాలని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. కర్మభూమి అయిన అమెరికాలో ఉండి అత్యుత్తమ సేవలందిస్తున్నారని వైద్యులను ప్రశంసిస్తూనే... మాతృభూమి భారత్‌లోని గ్రామాలను దత్తత తీసుకుని సేవలందించడంపై దృష్టి సారించాలని వారికి సూచించారు.అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ '(ఏఏపీఐ) ఆధ్వర్యంలో 'గ్లోబల్ హెల్త్‌కేర్ సమ్మిట్ -2019'పేరుతో తాజ్‌కృష్ణా హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారత్‌లో యాంటీబయోటిక్స్ నిరోధక వ్యవస్థ క్షీణించడంపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ సమస్యను అధిగమించేందుకు భారత వైద్యులతో కలిసి అమెరికాలోని భారత సంతతి వైద్యులు పనిచేయాలని కోరారు. అమెరికాకు వెళ్లి చదువుకోవడం అక్కడ పనిచేయడం తప్పు కాదని... అలా చేస్తూనే మాతృభూమికి కొంతైనా రుణం చెల్లించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వైద్య వ్యవస్థకు భారత్ దీపస్తంభమని శుశ్రుతుడు, చరకుడు వంటి వారు నిరూపించారని అన్నారు. చాలా దేశాల నుంచి భారత్‌కు వైద్యసేవల కోసం వచ్చేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోందన్నారు.గతంతో పోలిస్తే భారతీయుల ఆయుర్దాయం 69 ఏళ్లకు పెరిగిందని, ఇదంతా వైద్యుల కృషి ఫలితమేనన్నారు.సామాజిక వైద్య బాధ్యతలతో ఆరోగ్య భారత్ లక్ష్యం సులువుగా సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. అమెరికాలో ప్రతి ఏడుగురిలో ఒకరికి భారత వైద్యులే సేవలందిస్తున్నారని తెలిపారు. ఇదంతా నాణేనికి ఒకవైపేనని ఇంకా చాలాచోట్ల ఇక్కడి గ్రామీణ ప్రాంతాల్లో కనీస వైద్య సేవలు లేవనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. గ్రామాల వరకు వైద్య సేవల విస్తరణకు ఒక్క ప్రభుత్వం పనిచేస్తేనే సరిపోదని, ప్రైవేటురంగం కూడా చొరవ చూపాలని వెంకయ్య అన్నారు. వియత్నాంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం వల్ల వైద్యరంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. సర్వేజనాః సుఖినోభవంతు, వసుధైక కుటుంబం అనే మూలమంత్రాలకు కట్టుబడి ఉన్నందునే ఇంకా భారత్ ఈ స్థాయిలో ఉందని గుర్తుచేశారు.

కార్యక్రమంలో సీసీఎల్ఎస్ మాన్యువల్‌ను ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య తదితరులు

సంస్కరణల వేగం...

ప్రపంచంలో భారత్ అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ అన్న ఉప రాష్ట్రపతి దేశంలో సంస్కరణలు వేగం పుంజుకున్నాయని తెలిపారు. త్వరలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం పెద్ద విషయం కాదని ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, మూడీస్ రేటింగ్ తదితర సంస్థలు చెబుతున్నాయన్నారు.ఇక్కడ మానవ వనరులకు , జ్ఞాన సంపదకు కొరతలేదని దీన్ని సరిగ్గా వినియోగించుకోలేకపోవడమే లోపమన్నారు. వీటి సద్వినియోగానికి ప్రభుత్వంతో పాటు వ్యాపారవేత్తలు, వైద్యులు, ఇలా ప్రతి రంగంలోని వారు దేశం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సదస్సుకు చెందిన సావనీర్‌ను ఉపరాష్ట్రపతి విడుదల చేశారు. అనంతరం 'రేషికేషన్ కౌన్సిల్'వారు రూపొందించిన కాంప్రహెన్సివ్ కార్డియో లైఫ్ సపోర్ట్ (సీసీఎల్ఎస్) మాన్యువల్‌ను ఆవిష్కరించారు.

భారత సంతతి వైద్యులకు సింగిల్ విండో అనుమతులు: హర్షవర్ధన్

శాస్త్ర విజ్ఞాన రంగంలో భారతదేశం ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హర్షవర్ధన్ అన్నారు.దేశంలో వైద్య సేవలు అందించాలనుకునే భారత సంతతి వైద్యులకు సింగిల్ విండో అనుమతులు ఇప్పిస్తామన్నారు. డాక్టర్లు తమ సమయాన్ని, జ్ఞానాన్ని దేశ ప్రజల కోసం వినియోగించాలన్నారు. గతంలో ఫైబర్ నెట్‌వర్క్ కేవలం 350 కిలోమీటర్లు ఉంటే, ఇప్పుడు ఏకంగా 2 లక్షల కిలోమీటర్లకు చేరుకుందని ఆయనన్నారు. గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో మంత్రి మాట్లాడారు. 2022 నాటికి దేశాన్ని పరిపూర్ణంగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2025 నాటికి టీబీని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. పోలియోను ఇప్పటికే పూర్తిగా నిర్మూలించామన్నారు. తెలంగాణలో చేపడుతున్న ఆరోగ్యశ్రీ, కంటివెలుగు, హరితహారం వంటి పథకాలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సదస్సులో వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి, 'ఆపి'అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ రెడ్డి, ప్రముఖ వైద్యులు కాకర్ల సుబ్బారావు, నోరి దత్తాత్రేయుడు, అమెరికాలో భారత సంతతి వైద్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్త ఏఏపీఐ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

స్వయం ఉపాధికి సాయం

రూ.1,100 కోట్లతో కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఆర్థిక సహకార సంస్థలు సిద్ధమవుతున్నాయి. 2019-20 వార్షికంలో నిరుద్యోగులకు స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ఆర్థిక సాయం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి సక్రమంగా నిధులు విడుదల కాకపోవడంతో గత కొన్నేళ్లుగా కార్పొరేషన్ రుణాల పంపిణీ ఆశించిన స్థాయిలో లేదు. దాదాపు నాలుగేళ్లుగా బీసీ కార్పొరేషన్ నుంచి రుణాలు తీసుకున్న వారి సంఖ్య అతి తక్కువగా ఉంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2016-17లో రుణాలివ్వగా.. ఆ తర్వాత నుంచి రుణపంపిణీ అటకెక్కింది. తాజాగా సంతృప్తికర స్థాయిలో రుణాలు ఇచ్చేందుకు ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు ప్రణాళికలు తయారు చేస్తున్నాయి. దీనిలో భాగంగా ఈ రెండు కార్పొరేషన్లు రూ.1,100 కోట్ల భారీ మొత్తంతో కార్యాచరణ ప్రణాళికలు తయారు చేశాయి. వీటిని ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నాయి. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన మంజూరీలు చేపట్టాలని కార్పొరేషన్లు భావిస్తున్నాయి.

ఆగస్టులో దరఖాస్తులు..

స్వయం ఉపాధి పథకాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు చర్యలు మొదలుపెడుతున్నాయి. ఆగస్టు రెండో వారం నుంచి దరఖాస్తులు స్వీకరించాలని భావిస్తున్నాయి. వీటిని ఆన్‌లైన్ పద్ధతిలో స్వీకరించేందుకు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నాయి. దరఖాస్తుదారుడు స్వయం ఉపాధి ప్రాజెక్టు వివరాలను దరఖాస్తుతోపాటే సమర్పించాల్సి ఉంటుంది

722 గంటలు.. 5.65 టీఎంసీలు!

- కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా ఇప్పటివరకు జరిగిన ఎత్తిపోతలు
- మేడిగడ్డ బ్యారేజీలో మరో 7 టీఎంసీల నిల్వ..
- అన్నారం బ్యారేజీలో 2 మోటార్లకు వెట్‌రన్ కొనసాగింపు
- ఆగస్టు 15 నాటికి మిడ్‌మానేరుకు నీటి తరలింపే లక్ష్యంగా ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం.. ప్రాజెక్టుల్లోకి ఎక్కడా నీటి ప్రవాహాలు కానరాని నేపథ్యంలో పూర్తిగా ప్రాణహిత ద్వారా వస్తున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపుపై ప్రభుత్వం పూర్తి శ్రద్ధ పెట్టింది. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన వరదను వచ్చినట్లుగా ఒడిసిపడుతున్న నీటిపారుదల శాఖ కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు చేపడుతోంది. ఇంతవరకు 722 గంటల పాటు కన్నెపల్లిలోని 5 మోటార్లను నడపగా, 5.65 టీఎంసీల మేర నీటిని ఎత్తిపోశారు. మేడిగడ్డ బ్యారేజీలో మరో 7 టీఎంసీల మేర నీటిని నిల్వ చేశారు. ప్రాణహిత నదీ పరివాహకంలో ఆశించిన

2 కోట్లు.. ఓ పెట్రోల్ బంకు

- తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బీజేపీ ప్రలోభాలు
- పార్టీలో చేరకుంటే జైలుకు పంపుతామంటూ బెదిరింపులు
- బీజేపీ తీరుపై ధ్వజమెత్తిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డంపెట్టుకొని తమ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బెదిరిస్తోందని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. తమ పార్టీలో చేరాలని, లేకుంటే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి చిట్‌ఫండ్ కుంభకోణంలో జైలుకు పంపిస్తామని టీఎంసీ ప్రజాప్రతినిధులను బీజేపీ భయపెడుతోందని మండిపడ్డారు. ఆదివారం కోల్‌కతాలో అమరవీరుల దినాన్ని పురస్కరించుకొని టీఎంసీ భారీ ర్యాలీ నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలు భారీగా హాజరైన ఈ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. కర్ణాటకలో అనుసరిస్తున్న వైఖరినే రాష్ట్రంలోనూ ప్రయోగించాలని బీజేపీ చూస్తోందని ఆమె విమర్శించారు. దీనికోసం తమ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరికి రూ.2 కోట్లతోపాటు పెట్రోల్ బంక్ ఇస్తామని ప్రలోభపెడుతోందని ఆరోపించారు. తమ పార్టీ గ్రామ నేతలకు రూ.20 లక్షలు ఇస్తామని ఆశ చూపుతోందన్నారు. డబ్బుతో ఎవరినైనా కొనేయగలమనే అహంకారంలో బీజేపీ ఉందని మండిపడ్డారు.

ఇలాగైతే మరో రెండేళ్లే..

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలను మేనేజ్ చేసి బీజేపీ గెలిచిందని మమత ఆరోపించారు. ప్రస్తుత తీరుగానే వారి వ్యవహారం ఉంటే మరో రెండేళ్లే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటుందని హెచ్చరించారు. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి టీఎంసీ నాయకులు వసూలు సొమ్మును తిరిగిచ్చేయాలని తాను అన్నట్లుగా తన గత ప్రకటనను బీజేపీ వక్రీకరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల అమలుపై ఓ కన్నేసి ఉంచాలని తమ పార్టీ నాయకులకి తాను చెప్పానని, అయితే తన మాటలని వక్రీకరించి తమ నాయకులను బీజేపీ భయపెడుతోందని మండిపడ్డారు. ముందు బీజేపీ తరలించిన నల్లధనాన్ని వెనక్కి తీసుకురావాలని, అలాగే ఆ పార్టీ నాయకులు ఉజ్వల పథకంలో వసూలు చేసిన సొమ్మును వెనక్కి ఇవ్వాలన్నారు. ఇదే డిమాండ్‌తో 26వ తేదీన నిరసనలు చేపట్టాలని కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. ఉచిత ఎల్పీజీ పేరుతో బీజేపీ నేతలు డబ్బు వసూలు చేయడంపై దర్యాప్తు జరుపుతామన్నారు. 18 లోక్‌సభ స్థానాలు గెలిచి.. మొత్తం రాష్ట్రాన్ని గెలిచేసినట్లుగా బీజేపీ భావిస్తోందని ఎద్దేవా చేశారు. గంటపాటు ర్యాలీలో ఆమె.. ఏ ఒక్క బీజేపీ నాయకుడి పేరు కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

ఆదివారం కోల్‌కతాలో జరిగిన భారీ బహిరంగసభలో ప్రసంగిస్తున్న మమతా బెనర్జీ

ఇక్కడ కనిపిస్తున్నవి ఓ బకెట్లో ఉంచిన చిన్న చిన్న మొసలి పిల్లలు. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం హోంస్టెడ్‌లో ఉన్న అణు విద్యుత్ కేంద్రం వద్ద మొసళ్లు చాలా ఉంటాయి. ఈ అణువిద్యుత్ కేంద్రానికి సంబంధించిన 168 మైళ్ల పొడవైన కాలువల్లో ఇవన్నీ పెరుగుతుంటాయి. వీటి ఎదుగుదలను గమనించేందుకు, వాటిని పరిరక్షించేందుకు ప్రత్యేకంగా నిపుణులు ఉన్నారు. చిన్న మొసళ్ల శరీరంలో ఓ చిప్‌ను అమర్చి, మళ్లీ వాటిని నీళ్లలో వదిలేసి, వాటి ఆరోగ్య వివరాలను ఆ చిప్ ద్వారా తెలుసుకుంటుంటారు.

కర్నాటకంలో కాంగ్రెస్ సీఎం!

ముఖ్యమంత్రి పదవిని వదులుకునేందుకు జేడీఎస్ అంగీకారం

- రెబెల్ ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు కాంగ్రెస్-జేడీఎస్ వ్యూహం
- కొత్త సీఎం రేసులో సిద్దరామయ్య, శివకుమార్, పరమేశ్వర
- అసెంబ్లీలో విశ్వాసపరీక్ష నేడే • సర్వత్రా ఉత్కంఠ

బెంగళూరు/ముంబై/న్యూఢిల్లీ: విశ్వాస పరీక్షకు ఒక్కరోజు ముందు కర్ణాటకలో రాజకీయం అనూహ్య మలుపు తిరిగింది. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు అవసరమైతే ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకునేందుకు కుమారస్వామి సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మంత్రి డి.కె.శివకుమార్ తెలిపారు. సీఎం కుమారస్వామి, ఆయన సోదరుడు రేవణ్ణ తీరునచ్చకే తాము రాజీనామా చేస్తున్నామని పలువురు రెబెల్ ఎమ్మెల్యేలు చెప్పిన నేపథ్యంలో శివకుమార్ ఈ ప్రకటన చేశారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు నాతో పాటు డిప్యూటీ సీఎం పరమేశ్వర, సీఎల్పీ నేత సిద్దరామయ్యల్లో ఎవరు ముఖ్యమంత్రి పదవిని చేపట్టినా తమకు అభ్యంతరం లేదని జేడీఎస్ నేతలు చెప్పారు. మా ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసే బాధ్యతను కాంగ్రెస్ అధిష్టానికి అప్పగించారు' అని చెప్పారు. విధానసౌధలో విశ్వాసపరీక్ష ప్రక్రియను సోమవారంతో ముగిస్తానని, ఇకపై ఎంతమాత్రం ఆలస్యం చేయబోనని స్పీకర్ రమేశ్‌కుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న అసెంబ్లీ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

వెనక్కితగ్గే ప్రసక్తే లేదు: రెబెల్స్

ముంబైలోని రినైసెన్స్ హోటల్‌లో ఉంటున్న రెబెల్ ఎమ్మెల్యేలు శివకుమార్ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ మేరకు రెబెల్ ఎమ్మెల్యేలు ఆదివారం ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిద్దరామయ్య అనుచరుడు, ఎమ్మెల్యే బైరాతి బసవరాజ్ మాట్లాడుతూ..''సంకీర్ణ ప్రభుత్వంలో మా ఆత్మగౌరవం దెబ్బతింది. కాబట్టి ఇప్పుడు సిద్దరామయ్యను సీఎం చేసినా మేం రాజీనామాలను వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదు. మమ్మల్ని ఎవ్వరూ నిర్బంధించలేదు. ఇష్టపూర్వకంగానే ఇక్కడ ఉంటున్నాం. మేం డబ్బు లేదా వేరేవాటి కోసం ఇక్కడకు రాలేదు. కుమారస్వామి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకే వచ్చాం. పరిస్థితులు సద్దుమణిగాక బెంగళూరుకు తిరిగివెళ్లిపోతాం' అని తెలిపారు.

కలవరపెట్టిన బీఎస్పీ ఎమ్మెల్యే..

విశ్వాస పరీక్షకు ఒక్కరోజు ముందు బీఎస్పీ ఎమ్మెల్యే ఎన్.మహేశ్ సంకీర్ణ ప్రభుత్వానికి చెమటలు పట్టించారు. సోమవారం జరిగే విశ్వాసపరీక్షకు వెళ్లొద్దని పార్టీ అధినేత్రి మాయావతి తనను ఆదేశించారని మహేశ్ తెలిపారు. ఇది జరిగిన కొద్దిసేపటికే స్పందించిన మాయావతి, కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వానికి ఓటేయాల్సిందిగా ఆదేశించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ నేతలు బెంగళూరులోని 'తాజ్‌వివంత హోటల్'లో, బీజేపీ నేతలు 'హోటల్ రమద'లో సమావేశమై చర్చించారు.

'సుప్రీం'లో స్వతంత్రుల పిటిషన్..

బీజేపీకి ఇటీవల మద్దతు ప్రకటించిన ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు హెచ్.నగేశ్, ఆర్.శంకర్‌లు నేడు సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నారు. ఈ విషయమై స్వతంత్ర ఎమ్మెల్యేల న్యాయవాది మాట్లాడుతూ..'ప్రభుత్వం మైనారిటీలో పడిపోయినప్పటికీ కర్ణాటక అసెంబ్లీలో విశ్వాసపరీక్షను నిర్వహించడం లేదు. ఈ విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టు తన అసాధారణ అధికారాలను ఉపయోగించి సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా మెజారిటీని నిరూపించుకునేలా సీఎం కుమారస్వామిని ఆదేశించాలి' అని పిటిషన్ దాఖలుచేయబోతున్నట్లు చెప్పారు. కాగా, ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారమే విచారించే అవకాశముందని సమాచారం.

సర్కారుకు ఆఖరిరోజు: యడ్యూరప్ప

కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి నేడే ఆఖరిరోజని కర్ణాటక బీజేపీ చీఫ్ యడ్యూరప్ప తెలిపారు. 'సీఎం కుమారస్వామి, సీఎల్పీ నేత సిద్దరామయ్య, స్పీకర్ సోమవారం విశ్వాసపరీక్షపై ఓటింగ్ చేపడతామని చెప్పారు. కాబట్టి ఈ వ్యవహారం రేపటికల్లా ఓ ముగింపుకొస్తుందని విశ్వాసంతో ఉన్నా. సోమవారమే కుమారస్వామి ప్రభుత్వానికి చివరిరోజు అవుతుందని నాకు నమ్మకముంది' అని యడ్యూరప్ప చెప్పారు.

అసెంబ్లీలో శివకుమార్, పరమేశ్వరలతో మాట్లాడుతున్న సీఎం కుమారస్వామి(ఫైల్)

దయచేసి వెనక్కి రండి: సీఎం

ప్రభుత్వ తీరుకు నిరసనగా రాజీనామా చేసిన రెబెల్స్ అంతా వెనక్కు రావాలని సీఎం కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. 'నైతికత గురించి మాట్లాడే బీజేపీ ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతోంది.ఈ విషయాన్ని దేశం దృష్టికి తీసుకెళ్లాలా చేసేందుకే అసెంబ్లీలో చర్చకు సమయం కోరాను. మీరంతా(రెబెల్స్) వెనక్కురండి. సమస్యలను మనం కలిసి కూర్చుని చర్చల ద్వారా పరిష్కరించుకుందాం. సోమవారం జరిగే విశ్వాసపరీక్షకు హాజరై బీజేపీ అసలు రూపాన్ని బట్టబయలు చేయండి' అని కుమారస్వామి రెబెల్ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు.

అసెంబ్లీలో ఎవరి బలమెంత?

కర్ణాటక అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుడితో కలిపి 225 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీలో అధికార కాంగ్రెస్-జేడీఎస్ కూటమికి ప్రస్తుతం 117 ఎమ్మెల్యేలు(స్పీకర్, నామినేటెడ్ ఎమ్మెల్యేను కలుపుకుని) ఉండగా, వీరిలో 15 మంది పదవులకు రాజీనామా చేశారు. అదేసమయంలో 105 స్థానాలున్న బీజేపీకి ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించడంతో ఆ పార్టీ బలం అసెంబ్లీలో 107కు చేరుకుంది. ఒకవేళ 15 మంది రెబెల్ ఎమ్మెల్యేలు సోమవారం సభకు రాకపోయినా లేక వారిపై అనర్హత వేటుపడ్డా అసెంబ్లీలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 210కి చేరుకుంటుంది. అప్పుడు ఏకైక బీఎస్పీ ఎమ్మెల్యే మద్దతుతో కాంగ్రెస్-జేడీఎస్ కూటమి బలం 103కు తగ్గిపోతుంది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 106 అవుతుంది. దీంతో ఇప్పటికే 107 మంది ఎమ్మెల్యేల మద్దతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆస్కారముంది.

ఏకకాలంలో రెండు డిగ్రీలు

న్యూఢిల్లీ: త్వరలో విద్యార్థులు ఏకకాలంలో రెండు డిగ్రీలు చేసే అవకాశం కలగనుంది. దీనిపై సాధ్యాసాధ్యాలను చర్చించేందుకు గతనెలలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే ఒకసారి సమావేశమైంది. విద్యావేత్తల అభిప్రాయాలను సేకరిస్తున్నామని యూజీసీ సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఆలోచన అమలైతే ఒకే వర్సిటీ నుంచిగానీ, వేర్వేరు వర్సిటీల నుంచిగానీ దూరవిద్య, ఆన్‌లైన్, పార్ట్‌టైమ్ కోర్సుల ద్వారా ఏకకాలంలో రెండు డిగ్రీలను పూర్తిచేసే అవకాశముంటుంది.

నకిలీ ఉద్యోగాల ఉచ్చులో భారతీయులు

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నకిలీ ఉద్యోగాల ఉచ్చులో తొమ్మిది మంది భారతీయులు చిక్కుకున్నారు. ప్రకటనల్లో చూపిన రీతిగా డబ్బులు కట్టి ఇప్పుడు వీరంతా యూఏఈలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. కేరళకు చెందిన తొమ్మిది మంది సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఉద్యోగ ప్రకటనలను చూశారు. ఆ ప్రకటన ఇచ్చిన ఏజెంట్ షఫీక్‌ను సంప్రదించారు. దుబాయ్‌లోని ఆల్ ఐన్, అజ్మాన్ ప్రాంతాల్లో ఉన్న ఓ సూపర్ మార్కెట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని అతడు నమ్మబలికాడు. వీసా కోసం రూ.70 వేలు చెల్లించాలనడంతో అప్పులు చేసి మరీ కట్టారు. వీరందరికీ వాట్సాప్‌లో కాల్‌లెటర్ పంపగా అబుదాబీ వెళ్లారు. అక్కడ వాకబు చేయగా.. సదరు సూపర్ మార్కెట్ యజమాని జైల్లో ఉన్నట్లు తెలిసింది. కంగుతిన్న బాధితులు అక్కడి భారత రాయబార కార్యాలయాన్ని ఆశ్రయించారు.

బిహార్ ఎంపీ రామచంద్ర పాశ్వాన్ మృతి

న్యూఢిల్లీ: బిహార్ ఎంపీ, కేంద్రమంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ సోదరుడు రామచంద్ర పాశ్వాన్ (57) కన్నుమూశారు. గతవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరిన రామచంద్ర పాశ్వాన్ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు రామ్ విలాస్ పాశ్వాన్ మీడియాకు వెల్లడించారు. ఆయన 1999నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు.

కశ్మీర్‌ను కొల్లగొట్టిన వారిని చంపండి

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భద్రతా సిబ్బందితో సహా అమాయక ప్రజలను చంపడం మానేయాలని, వారికి బదులు ఏళ్ల తరబడి కశ్మీర్ సంపదను కొల్లగొడుతున్న వారిని చంపాలని ఉగ్రవాదులకు పిలుపునిచ్చారు. 'ఉగ్రవాదులు తుపాకులను చేతబట్టి తమ సొంత వారినే పొట్టనపెట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు కశ్మీర్ సంపదను దోచుకుంటున్న వారినెవరినైనా చంపారా?' అని ఆదివారం లడఖ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రశ్నించారు.

బిహార్ వరద మృతులు 102

పట్నా: బిహార్‌లో వరదల వల్ల మరో అయిదుగురు మృతిచెందారు. వీరంతా మధుబని జిల్లాకు చెందినవారు. దీంతో ఆదివారానికి మొత్తం మృతుల సంఖ్య 102కు చేరిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం తెలిపింది. దీంతో మధుబని జిల్లాలో మృతుల సంఖ్య 23కు చేరింది. 27 మరణాలతో సీతామర్హి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపింది.

రూ. 200 కోట్లు లంచంగా ఇచ్చా

యశవంతపుర (బెంగళూరు): కర్ణాటకలో ముఖ్యమైన రాజకీయ నేతలు, ప్రభుత్వాధికారులకు రూ. 200 కోట్లను లంచంగా ఇచ్చానని ఐఎంఏ జ్యువెల్స్ సంస్థ యజమాని మహ్మద్ మన్సూర్ ఖాన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో వెల్లడించినట్లు సమాచారం. రూ. 4 వేల కోట్ల డిపాజిట్లను మన్సూర్ ఖాన్ ప్రజల నుంచి సేకరించి మోసం చేయడం తెలిసిందే. ఈ కేసులో మన్సూర్‌ను ఈడీ శనివారం కస్టడీకి తీసుకుని విచారణ ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో పలువురు నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ కేసులో తాము ఇరుక్కుపోతామా? అని భయాందోళనకు గురవుతున్నట్లు సమాచారం. ఈ కేసులో ఒక ఐఏఎస్ అధికారిని సిట్ అరెస్టు చేసింది. కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే రోషన్‌బేగ్‌ను విచారించింది.

అమెరికాలో పూజారిపై దాడి

జాతి విద్వేష ఘటనగా పోలీసుల అనుమానం

న్యూయార్క్: అమెరికాలో ఓ హిందూ పూజారిపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యూయార్క్‌లోని ఫ్లోరల్ పార్క్ సమీపంలో జూలై 18న ఉదయం 11 గంటలకు (స్థానిక కాలమానం) స్వామి హరీశ్ చంద్ర పురీ అనే పూజారిపై ఓ వ్యక్తి దాడి చేయడంతో ఆయన గాయాలపాలయ్యారు. జాతి విద్వేషం కారణంగానే ఈ దాడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దాడికి పాల్పడిన 52 ఏళ్ల సెర్గియో గోవియా అనే వ్యక్తిని ఇప్పటికే అరెస్టు చేశారు. ఫ్లోరల్ పార్క్ సమీపంలోని గ్లెన్ ఓక్స్‌లో శివ శక్తి పీఠం ఉంది. అక్కడి దగ్గర్లోని రోడ్డుపై హరీశ్ చంద్ర పూజారి వేష ధారణలోనే నడుచుకుంటూ వెళ్తుండగా, సెర్గియో వెనుక నుంచి వచ్చి హరీశ్ చంద్రపై పిడిగుద్దులు కురిపించాడు. ఆ దెబ్బలకు తాళలేక హరీశ్ చంద్ర ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. 'ఇది మా ప్రాంతం' అని దాడి సమయంలో సెర్గియో అరిచినట్లు హరీశ్ చంద్ర పురీ చెప్పారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన నలుగురు మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ వాళ్లు తమ స్వదేశాలకు వెళ్లిపోవాలని అన్నారు. ఈ తర్వాతే ఈ దాడి జరగడం గమనార్హం. ఈ దాడిని ప్రతినిధుల సభలో సభ్యురాలైన గ్రేస్ మెంగ్ ఖండించారు. అమెరికాలో అల్పసంఖ్యాకులైన హిందువులకు తాను అండగా ఉంటాననీ, వివిధ దేశాల నుంచి వచ్చిన అనేకమంది మైనారిటీలు తన నియోజకర్గంలో ప్రశాంతంగా నివసిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

ప్రతిపక్ష ఎంపీలపై బీజేపీ వల!

రాజ్యసభలో పైచేయి సాధించడమే లక్ష్యం

న్యూఢిల్లీ: రాజ్యసభలో సంఖ్యాపరంగా ప్రతిపక్షం కంటే వెనుకబడిన అధికార బీజేపీ బలం పెంచుకునే ప్రయత్నాల్లో పడింది. ఇందుకోసం గత కొన్ని రోజులుగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను మచ్చిక చేసుకుంటోంది. దీని ఫలితంగానే రాజ్యసభలో తెలుగుదేశం పార్టీకి ఉన్న ఆరుగురు సభ్యుల్లో నలుగురితోపాటు సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు, మాజీ ప్రధాని చంద్రశేఖర్ కొడుకు నీరజ్ శేఖర్ ఇటీవల కాషాయ కండువా కప్పుకున్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ వైఖరితో తీవ్ర అసంతృప్తితో ఉన్న మరి కొందరు కూడా త్వరలో బీజేపీలో చేరనున్నట్లు నీరజ్ శేఖర్ అంటున్నారు. ప్రతిపక్షాలకు చెందిన ఇంకొందరు కూడా 'కాషాయ'బాటలో నడిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఊహాగానాలు వస్తున్నాయి. 245 మంది సభ్యులున్న రాజ్యసభలో ప్రస్తుతం బీజేపీ బలం 78కి చేరుకుంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలతో వచ్చే ఏడాది కల్లా రాజ్యసభలో అధికార ఎన్‌డీఏకి మెజారిటీ దక్కే అవకాశముంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆలోగానే బీజేపీకి రాజ్యసభలో పైచేయి సాధించే అవకాశాలున్నాయంటున్నారు. అయితే, ఎన్‌డీఏలోని జేడీయూ వంటి పార్టీలు బీజేపీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ తలాక్, పౌరసత్వ బిల్లు వంటి కీలక అంశాలపై ప్రభుత్వానికి మద్దతు ఇవ్వకపోయే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకే బలం పెంచుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామని బీజేపీ నేత ఒకరు అన్నారు. ఇందులో భాగంగానే ఒడిశాలోని మూడు రాజ్యసభ సీట్లలో ఒకటి కై వసం చేసుకునేందుకు ఆ రాష్ట్ర సీఎం, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌తో ప్రధాని మోదీ సహా పలువురు కీలక నేతలు మంతనాలు సాగిస్తున్నారు.

షీలాకు కన్నీటి వీడ్కోలు

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ అంత్యక్రియలు ఆదివారం అధికార లాంఛనాలతో ముగిశాయి. ఇక్కడి నిగమ్‌బోధ్ శ్మశాన వాటికలో జరిగిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా కూడా ఉన్నారు. షీలాకు నివాళులర్పించిన వారిలో బీజేపీ కురువృద్ధ నేత ఎల్‌కే అడ్వాణీ, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సీఎంలు అశోక్ గహ్లోత్, కమల్‌నాథ్ తదితరులు ఉన్నారు. ఆమె నివాసం నుంచి పార్థివ దేహాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంతోపాటు, చివరగా బాధ్యతలు నిర్వహించిన ఢిల్లీ కాంగ్రెస్ విభాగం కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తలు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా అనేక రంగాలకు చెందిన ప్రజలు ఆమెకు నివాళులర్పించారు.

షీలాదీక్షిత్ అంతిమయాత్ర

సీపీఐ పగ్గాలు అందుకున్న రాజా

ప్రధాన కార్యదర్శిగా పార్టీ జాతీయ సమితి ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నూతన ప్రధాన కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు డి.రాజా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని పార్టీ జాతీయ సమితి, కార్యవర్గ సమావేశం ఆమోదించింది. సుదీర్ఘ కాలం ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్‌రెడ్డి వయసురీత్యా వైదొలిగారు. గత మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ సమితి, కార్యవర్గ సమావేశాల్లో సురవరం రాజీనామాను ఆమోదించారు. ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వైదొలిగినా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతానని సురవరం తెలిపారు. రాజా నేతృత్వంలో పార్టీ పునర్నిర్మాణం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన రాజాకు కేకు తినిపిస్తున్న సురవరం సుధాకర్‌రెడ్డి

విద్యార్థి సంఘం నాయకుడిగా..

తమిళనాడుకు చెందిన 70 ఏళ్ల డి. రాజా యువజన ఉద్యమాల ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. 1975-80 వరకు అఖిల భారత యువజన సమాఖ్య తమిళనాడు కార్యదర్శిగా, 1985-90 వరకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1994 నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2007 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన పదవీకాలం ఈనెల 24వ తేదీతో ముగియనుంది.ఎంపీగా రాజా దాదాపు అన్ని శాఖల పార్లమెంటు స్టాండింగ్ కమిటీల్లో పనిచేశారు.

జాతీయ కార్యవర్గంలోకి కన్హయ్య

జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నాయకుడు కన్హయ్య కుమార్‌ను జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఇటీవల మరణించిన షమీమ్‌ఫైజీ స్థానంలో కన్హయ్యకు చోటు కల్పించారు. ఒడిశాకు చెందిన రామకృష్ణ పాండ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మనీష్ కుంజంను జాతీయ కార్యవర్గంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. సమావేశాల్లో ఏపీ, తెలంగాణ కార్యదర్శులు రామకృష్ణ, చాడా వెంకట్ రెడ్డి సహా ముప్పాళ్ల నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, అక్కినేని వనజా, ఓబులేసు పాల్గొన్నారు.

డాలర్ డ్రీమ్స్ కరిగిపోతాయా?

హెచ్-4 వీసాల రద్దుతో అందరికీ నష్టం • ఎస్ఏఏపీఆర్ఐ సర్వే

అమెరికాలో హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు (హెచ్-4 వీసాదారులు) వర్క్ పర్మిట్ రద్దుతో భారతీయుల ఆశలు నీరుగారిపోవడంతో పాటుగా అగ్రరాజ్యాన్ని బాగా దెబ్బ తీస్తుందని తాజా సర్వేలో వెల్లడైంది. సౌత్ ఏషియన్ అమెరికన్ పాలసీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎస్ఏఏపీఆర్ఐ) అనే సంస్థ నిర్వహించిన ఈ సర్వేలో హెచ్-4 వర్క్ పర్మిట్ రద్దు ప్రభావం అమెరికా ఐటీ ఇండస్ట్రీపై తీవ్రంగా ఉంటుందని తేలింది. అమెరికాలో హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు కూడా పని చేయాలంటే హెచ్4-ఈఏడీ (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్) వీసా ఉండాలి. ఈ వీసాలను రద్దు చేయడానికి ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలు తుది దశకు చేరుకుంటున్న సమయంలో ఎస్ఏఏపీఆర్ఐ సర్వే చేపట్టింది. ఆ సర్వేలో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి.

దక్షిణాసియా దేశాలకే అత్యధిక లబ్ధి

1997- 2017 మధ్య కాలంలో హెచ్-4 ఈఏడీ వీసాల మంజూరు బాగా పెరిగింది. వాటితో దక్షిణాసియా దేశాలకు చెందిన మహిళలే ఎక్కువగా లబ్ధి పొందారు. 1997 నాటికి ఏటా 18, 979 మందికి ఈ వీసాలు మంజూరు చేస్తే, 2017 నాటికి వాటి సంఖ్య 1.18 లక్షలకు చేరుకుంది. ప్రస్తుతం హెచ్-4 వీసాదారుల్లో 93 శాతం మంది దక్షిణాసియా దేశాల వారే. ఇక భారత్‌కు చెందిన మహిళా ఇంజనీర్లు కూడా బాగా లబ్ధి పొందారు. 2015 నుంచి మంజూరు చేసిన వీసాల్లో 90 శాతానికి పైగా భారత్‌కు చెందిన మహిళలే దక్కించుకున్నారు.

ప్రమాదంలో భారత మహిళల ఉద్యోగాలు

2017లో ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక వలస విధానాలను కఠినతరం చేశారు. అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ చేసిన వారికే హెచ్-1బీ వీసాలు మంజూరు చేయడానికి ప్రాముఖ్యతనిచ్చారు. హెచ్-1బీ

నల్లగొండ | సోమవారం
జూలై | 22 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

ఖాళీ చేసిన మూల

పచ్చకోటువాడు బండీ ఎక్కడానికి తొందర పడలేదు. నిల్చున్నచోటు నుంచి కదల్లేదు. వీడు ఇక్కడే ఉండిపోతాడు కాబోలు. బతికేను. ట్రెయిన్ పదిగజాలు నడిచింది. పాతిక గజాలు దాటింది. అంతే! కాని అదేమిటి? అదేమిటి?

స్టేషన్లోకి ట్రెయిన్ వచ్చి చాలా సేపయింది. కుడి చేత్తో టిక్కెట్టూ, ఎడం చేత్తో తోలుసంచీ పట్టుకుని పరిగెత్తేడు రాజు ప్లాట్‌ఫారం వైపు. పచ్చకోటు తొడుక్కొని ముందు పోతూన్న ఒకణ్ణి తోసేయబోతూంటే, ''ఎందుకలా గాభరా పడతావయ్యా! ఎక్కడానికి టైముందిలే'' అని కసిరేడు టికెట్ కలెక్టరు.

టికెట్ కలెక్టరు ఆపినందుకూ కసిరినందుకూ కించపడలేదు రాజు. ''ఆహా! ఇంకా టైముందండీ?'' అని నిట్టూర్చి ప్రశ్నించేడు. ''ఓ! చచ్చినంత'' అన్నాడు టీసీ టికెట్ పంచ్ చేస్తూ.

పచ్చకోటు తొడుక్కున్నవాడు ప్లాట్‌ఫారంలోకి ముందుగా పోయేడు. ఆ వెనకే రాజు కూడా వెళ్లేడు.

మేనల్లుడి పెళ్లికి వెళ్లకపోతే బావుండదని బయల్దేరేడు. బండి తప్పిపోయిందని అక్కయ్య నమ్మదు, బావకి కోపం వస్తుంది. పెళ్లిళ్ల రోజులవడం చేత జనం కిటకిట లాడుతున్నారు.

చివరిదాకా నడిచి ''అదృష్టం బావుంది'' అనుకున్నాడు. ఆఖరి కంపార్ట్‌మెంటు ఖాళీగా వుంది. కిటికీలోంచి లోనికి చూస్తే వెనకవైపు కిటికీ దగ్గర కార్నర్ సీట్లో ఎవరూ ఉన్నట్టు లేదు. మరీ అదృష్టం! సంతోషిస్తూ లోనికి ఎక్కబోయేడు రాజు.

అతనికంటే ఒక్కడుగు ముందయేడు పచ్చకోటువాడు. తిన్నగా పోయి కిటికీ పక్క మూల సీట్లో కూర్చున్నాడు. అతణ్ణి మనసులో తిట్టుకొంటూ గత్యంతరం లేక అతనికి ఎదుట సీట్లో కూర్చున్నాడు రాజు. కొంచెం సర్దుకొని, టిక్కెట్టు పర్సులో భద్రంగా పెట్టి, సంచీ వారకి పెట్టి, చెప్పులు కిందకి విడిచి, మఠం వేసుక్కూర్చుని కంపార్ట్‌మెంటంతా కలయజూసేడు. పదిమందికంటె ఎక్కువ లేరు. అంత తక్కువ మంది ఉన్నప్పటికీ తనకి కార్నర్ సీటు దొరకనందుకు పచ్చకోటువాణ్ణి చూస్తే ఒళ్లు మండుకొచ్చింది.

పచ్చకోటు చెప్పలేనంతగా మాసింది. అతను తొడుక్కున్న షర్టు తెల్లగా పువ్వులా ఉంది. కట్టుకున్న మాసీ మాయని పంచ అక్కడక్కడ చిరిగింది. నెత్తి మీద పెట్టుకున్న నల్లటి మరాఠీ టోపీ కింద జుత్తు బాగా పండినట్టు కనిపిస్తోంది. వయసు నలభైకి మించకపోవచ్చు. ముక్కు ఎత్తుగా ఉండడం చేతా, కళ్లు లోతుకు పోవడం చేతా, మనిషి గెద్దలా ఉన్నాడు. అతను ఎవ్వరివైపూ చూడ్డం లేదు. కిటికీలో ఎడం చెయ్యి ఆన్చుకొని, కాల్తున్న సిగరెట్టు కుడిచేత్తో పట్టుకొని ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

''వీడి పిండాకూడుగాని పచ్చరంగు కోటు తొడుక్కోడం ఏమిటి?'' అని రాజు అనుకొంటూండగా ట్రెయిన్ కదలింది. రాజు న్యూస్ పేపర్ తీసేముందు చుట్ట ముట్టించేడు. పేపర్లో నచ్చిన వార్తలేవీ కనిపించడం లేదు. మలయా పరిస్థితి గురించి, కొరియా యుద్ధం గురించి చేటభారతం రాసేరు. వెధవ గోల! ఛూ! ఉమ్ముకోవడానికి కిటికీ దగ్గరికి పోవాలి. అక్కడే కూర్చుంటే ఎంత బావుండేది! పేపరు మడత పెట్టేశాడు. చేసేదిలేక అటూ ఇటూ చూస్తున్నాడు. ఏదో స్టేషను దగ్గరవుతూన్నట్టుంది. కళ్లు మూసుకొని కిటికీ వార పడుకున్నా బావుండేది.

''మీరెక్కడండీ దిగుతారూ?'' అని పచ్చకోటు వాణ్ణి ప్రశ్నించేడు. అతను జవాబు చెప్పలేదు. ప్రశ్న విన్నట్టుగానే లేదు. లోతుకుపోయిన కళ్లతో లోతుల్లోకి చూసుకొంటున్నాడు. జవాబు చెప్పడేం?

''ఏమండోయ్, మిమ్మల్నే'' గట్టిగా అరిచేడు రాజు. సుఖంగా నిద్ర పోదామని సిద్ధమయ్యేసరికి పక్కనున్నవాళ్లు అల్లరిచేస్తే ఎంత కోపంగా ఉంటుందో అలావుంది పచ్చకోటువాడి ముఖం. ''ఎక్కడకో అక్కడికి వెళ్తాను'' అని విసురుగా తల మీద టోపీ తీసి బల్ల మీద పడేశాడు.

ఏమిటీ? వీడి పొగరూ? టోపీ తీసేయడంతో అతని ఎండిన పీచు జుత్తు గాలికి చెదురుతోంది. చెవులు పెద్దవిగా కనిపిస్తున్నాయి. గెడ్డం బాగా మాసింది. రాజు కంటికి అతను వికృతంగా కనిపించేడు.

మర్యాదా లేదు మప్పితం లేదు. జవాబివ్వలేదేం సరిగ్గా! రోజల్లా నా ఎదట దిష్టిపిడతలా కూర్చుంటాడు కాబోలు.

వీడెక్కడికి వెళ్తే నాకేం? వల్లకాట్లోకి పోతాడు. కాని, పెట్టేబేడా తెచ్చుకోలేదే వీడు! వాటం చూస్తే టిక్కెట్ కొన్నవాళ్లా లేడు. టికెట్ కలెక్టర్ వస్తే దింపించి పారేయవచ్చు.

ఒక స్టేషనప్పుడే దాటిపోయింది. టీసీ ఇంకా రాడేం? పూర్వం ఇలాగే ఉండేదా? అడుగడుక్కీ వచ్చి చెక్ చేసేవారు. ఛా! డబ్బిచ్చి వచ్చినవాడు బాధపడ్డం! కాణీ ఇవ్వకుండా వచ్చినవాడు సుఖపడ్డం!

పచ్చకోటువాడు దగ్గడం ప్రారంభించేడు, బాధగా, కఫంగా, అసహ్యంగా. దగ్గి దగ్గి కిటికీలోంచి పైకి ఉమ్మి కోటుచేత్తో మూతి తుడుచుకొని ''హమ్మయ్యా'' అని ఆయాసం తీర్చుకున్నాడు.

వీడికి క్షయ రోగం ఉన్నట్టుంది. జబ్బులున్నవాళ్లని ట్రెయిన్‌లోకి ఎందుకు రానిస్తారో! ఈ వెధవ ఈ క్షణంలో చస్తే నేనయితే విచారించను. భూభారం ఎంత తగ్గినా తగ్గడమే!

మరో స్టేషన్ వచ్చింది. ట్రెయినాగింది. ఇద్దరు బికార్లు దిగిపోయేరు. ఈ బికారి కూడా దిగిపోతే బావుణ్ణు అని రాజు అనుకొంటూ ఉండగానే పచ్చకోటువాడు ఏదో నిశ్చయానికి వచ్చినట్టుగా గబాల్న లేచి కంపార్ట్‌మెంట్‌లోంచి వెనక గుమ్మంలోంచి వెనకవైపుకి దిగిపోయేడు.

నిజంగా పోయినట్టేనా? టోపీ వదిలేసేడే? మళ్లీ వస్తుంది కాబోలు శనిదేవత. టీసీ వస్తాడని భయపడ్డాడో ఏమో?

వెనక్కి తిరిగి చూస్తే ప్లాట్‌ఫారం కనిపిస్తోంది. బండీ కదుల్తే బావుండనుకొంటూ లేచి ఎదట కిటికీలోంచి పైకి చూసేడు.

ఇదుగో పచ్చకోటువాడు! ఇక్కడే నిల్చున్నాడు. బండి కదల భయం, మళ్లీ ఎక్కిపోతాడు. అతన్ని చూస్తూ అలాగే నిల్చుండిపోయేడు రాజు, కిటికీ దగ్గర.

చలికాలపు ఎండలో పచ్చకోటువాడు ప్రశాంతంగా గంభీరంగా నిల్చున్నాడు. అతని కళ్లలో వెలుగు కనిపిస్తోంది. అతన్లో ఏదో తేజస్సు ప్రజ్వరిల్లుతున్నట్టుగా ఉంది. జగత్తునంతా తృణీకరించి చూస్తున్నట్టుగా ఉన్నాడు.

అబ్బో! వీడికి ఇంత డాబు ఎక్కణ్ణించి వచ్చింది? అని రాజు అనుకొంటూ ఉండగానే ఇంజన్ గర్జించింది. గాడీ కదిలింది.

పచ్చకోటువాడు బండీ ఎక్కడానికి తొందరపడలేదు. నిల్చున్నచోటు నుంచి కదల్లేదు. వీడు ఇక్కడే ఉండిపోతాడు కాబోలు. బతికేను. ట్రెయిన్ పదిగజాలు నడిచింది. పాతిక గజాలు దాటింది. అంతే! కాని అదేమిటి? అదేమిటి?

పచ్చకోటువాణ్ణి చూస్తూన్న రాజు ఒక్క కేక వేసేడు. ఎవరో చెయిన్ లాగారు. ఎంతో అయిష్టతతో బండి ఆగింది.

రాజుకి ముఖం తిరిగింది. మూర్ఛ వచ్చేట్టయింది. పచ్చకోటువాడి మెడ రైలు పట్టాపైన. ట్రెయిన్ చక్రాల కింద. అవతల తల; ఇవతల మొండెం; ఇందాట్టా ప్రాణం; ఇప్పుడిప్పుడే మరణం!

ఒక్కసారిగా, ఒకేసారిగా, ''అయ్యయ్యో, అయో అయో, ఎంత పనెంత పని చేసేడు, ఎలా ఎలా ఎలా చేసేడు, శంకరా హరహరా, ఈశ్వరా సర్వేశ్వరా.''

బండీలో ఉన్న జనం అంతా వెనకవైపుకే దిగుతున్నారు. గోలగోల, ఒకటే గోల. పోలీసులు, టీసీలు, ప్రయాణీకులు, కేకలు. చేత్తో సంచీ పట్టుకొని, బండి దిగి అటువైపుకి తొందరగా గాభరాగా నడిచేడు రాజు.

''అబ్బ! ఒక్క సెకెండే చూసేను. కాని నాకీ జన్మలో నిద్రపట్టదు'' అని ఎటూ వెళ్లక మధ్య నిల్చున్న పెద్దమనిషి ఎవరితోనో అంటున్నాడు.

అందర్నీ అటువైపునుంచి తోసుకువస్తూన్న కూలిమనిషిలా కనిపించే అడమనిషి వెక్కివెక్కి ఏడుస్తూ వస్తోంది.

''ఏమవుతాడమ్మా? నీ కతనేమవుతాడు?'' అని పదిమంది ప్రశ్నించేరామెని.

''ఏమవుతాడు బాబూ! మీ కేమవుతాడో నాకూ అదే అవుతాడు. నిండు ప్రాణం పోతే ఏడుపురాదూ'' అన్నదామె కళ్లు తుడుచుకొంటూ.

చుట్టూ చేరినవాళ్ల మధ్య సందుల్లోంచి చనిపోయినవాడి అరిపాదాలు మాత్రం కనిపిస్తున్నాయి. ''ఇహ నే చూడలేను భగవంతుడా'' అనుకొన్న రాజు, వెనక్కి తన కంపార్ట్‌మెంటు వైపుకి మళ్లేడు.

ఎదట కార్నర్ సీట్లో నామాలు పెట్టుకున్న వృద్ధుడెవరో కూర్చున్నాడు. రాజు కూర్చున్నాక, టోపీ చూపిస్తూ ''ఎవరో కాని టోపీ మర్చిపోయి దిగిపోయినట్టుందండీ'' అన్నాడు రాజుతో.

''ఇందాట్లా చచ్చిపోయిన వాడిదండీ ఆ టోపీ!''

''ఇక్కడేనా ఏమిటి వాడు కూర్చున్నాడు?'' అని టోపీకి కొంచెం ఎడంగా జరిగేడు నామాలవాడు. కొంతసేపు తటపటాయించి, ఏదో పనున్నట్టుగా లేచి గేటువైపు వెళ్లి అక్కడ బల్లమీద కూర్చున్నాడు. చావంటే ఎంత భయం!

ట్రెయినింకా కదల్లేదు. ఇంకా ఆలస్యం అవుతుంది కాబోలని ఎవరో విసుక్కుంటున్నారు. కిటికీలోంచి పైకి చూస్తున్నాడు రాజు.

ఆకాశం చెప్పలేనంత నీలంగా ఉంది. దూరంగా మామిడితోటలకీ తాటితోపుకీ వెనక కనపడీ కనపడకదాగుంది ఏదో వూరు. తెల్లటి చుక్కల్లా బాతులు ఈదే చెరువు నీటిలో దూరంగా అచలంగా నిల్చున్న నీలి కొండలూ, ఎండలో వెండి ముద్దల్లా కనిపించే తెల్లమబ్బులూ కదిలిపోతున్నాయి. చెరువుకి పక్కగా ఉన్న తాటాకుల ఇంటిముందు విరియపూసిన గన్నేరు చెట్టు బరువుగా కొమ్మలు వంచుకొంది. బాగా ఎదిగిన అమ్మాయెవరో కొమ్మల్ని వంచి నీలంగా ఉన్న చీరచెంగులోకి కెంపుల్లాంటి పువ్వుల్ని కోసి పడేసుకొంటోంది. దూరం నుంచి చూస్తూంటే అంతా ప్రశాంతంగా హాయిగా కనిపిస్తోంది. అవన్నీ అదంతా చూస్తోన్న రాజెందుకోగానీ వికల మనస్కుడయ్యేడు.

ఈ నీలపు కొండలూ, నీలి ఆకాశం, ఈ శీతాకాలపు ఎండా, బాతులు ఈదే చెరువూ, పువ్వులు కోసే జవ్వనీ, ఏవీ ఏదీ ఎవర్నీ కూడా చూడలేదే పచ్చకోటువాడు! ఈ జీవితంలో ఎట్టి బాధల్ని భరించలేక, ఎన్నెన్ని బాధలు చూడలేక చూడకుండా పోయేడు పచ్చకోటువాడు? అని రాజు ఆలోచిస్తూ ఉండగా ఇంజన్ పెనుబొబ్బ పెట్టింది. రెయిల్ కదిలింది.

ఎండలో మిలమిల్లాడుతూ పరిగెడుతూన్న టెలిగ్రాఫ్ తీగల వైపూ, స్తంభాల వైపూ చూడక చూస్తోన్న రాజుకి గుండెల్లో ఎంతో బరువుగా, మనసులో ఎంతో దిగులుగా ఎందుకుందో అర్థం కాలేదు.

సుప్రసిద్ధ రచయిత రావిశాస్త్రి (1922-93) కథ 'కార్నర్ సీట్'కు సంక్షిప్త రూపం ఇది. 1953లో 'కాంతా కాంత' కలంపేరుతో అచ్చయింది. సౌజన్యం: కథానిలయం. అల్పజీవి, రాజు మహిషి, రత్తాలు రాంబాబు, ఆరు సారా కథలు, రుక్కులు రావిశాస్త్రి రచనల్లో కొన్ని.

రావిశాస్త్రి

కనక అభిషేకం

సాహిత్య మరమరాలు

కోరుకొండలోని సాహిత్యాభిమానులు విశ్వనాథ సత్యనారాయణకు కనకాభిషేకం చేయాలని సంకల్పించారు. విశ్వనాథ వారించారు. 'నాయనా, కనకాభిషేకం చేయాలంటే బంగారం కరిగించి నెత్తి మీద పోయాలి. అలా చేస్తేనే అవుతుంది కనకాభిషేకం' అని చెప్పి వద్దన్నారు. కార్యకర్తలు స్వర్ణ పుష్పాభిషేకం చేయడానికి బతిమాలి ఒప్పించారు.



తర్వాత కొన్ని రోజులకు సభ. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి అధ్యక్ష స్థానంలో ఉన్నారు. జరుగుతున్న సత్కారం తీరు ఆయనకు నచ్చలేదు. అందుకని– ''విశ్వనాథ సత్యనారాయణ గారు కవి సమ్రాట్ కనక, సాంప్రదాయ సాహిత్యానికి మణిమకుటం వంటివారు కనక, వివిధ ప్రక్రియలలో సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు కనక, మనం అందరం ఒకచోట చేరాం కనక, వారు వద్దన్నారు కనక, వీరు చేయక తప్పదన్నారు కనక, ఇది 'కనక' అభిషేకం'' అన్నారు.

ఇంకేముంది? మధునాపంతుల కనక వర్షం కురిపించినందుకు కనకాన్ని కరిగించి పోసినంత సంబరంగా సభ చిరునవ్వులు చిందించింది.

◆ దాట్ల దేవదానం రాజు

కడుపులో కందిరీగలున్న స్త్రీలు

కొత్త బంగారం

అనితా నాయర్

'నన్ను నేను చంపుకున్న ఆ సోమవారం స్పష్టంగా, ప్రకాశవంతంగా ఉన్నది. నా మరణం చుట్టు పక్కల వారి దృష్టిలో నన్ను 'కేరళ వర్జీనియా వుల్ఫ్'ను చేసింది. మార్కోస్ మాత్రం నా పేరెత్త లేదు. అర్ధరాత్రి శ్మశానానికి వచ్చి, నా కుడిచేతి చూపుడి వేలి ఎముకను తీసుకెళ్ళాడు. ఆ నా ఆత్మను, నేనతనికి బహూకరించిన వెల్వెట్ పెన్ను డబ్బాలో ఉంచి, కర్ర బీరువా రహస్యపు అరలో పెట్టాడు. నా భౌతిక భాగం, లోకంలో ఉన్నంతవరకూ తప్పించుకోలేను. సంవత్సరాలు గడిచాయి. బీరువా మరేదో చోటుకి తరలించబడింది. నా పేరు శ్రీలక్ష్మి. రచయిత్రిని.' ఇది అనితా నాయర్ రాసిన **'ఈటింగ్ వాస్ప్స్'** నవల.

కేరళలోని నీలా నది పక్కనుండే ఊర్లో చనిపోయిన శ్రీలక్ష్మి 30ల్లో ఉన్న ఉపాధ్యాయురాలు, సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత. 'ఒకసారి కందిరీగను మింగి, దాని పోట్లను తట్టుకున్నాను. కానీ, మరణించిన తరువాత మరిచిపోబడిన ఎముకగా మాత్రమే మిగిలాను' అంటుంది.

52 ఏళ్ళ తరువాత, ఒక హోటెల్లో ప్రాచీన కాలపు బీరువాలో దాక్కున్న పిల్ల మేఘ, దాన్లో ఉన్న సున్నంతో నిలవబెట్టబడిన ఆ వేలి ఎముకను చేతిలోకి తీసుకుంటుంది. 'దయ్యాలు, రచయితలు ఒకేలా ఉంటారు. మీరు మాకు చెప్పకపోయినా గానీ, మీ ఆలోచనలను మేము వినగలం. నేను దయ్యాన్నీ, రచయిత్రినీ కూడా' అంటూ, తనను ఆ తరువాత తాకిన మిగతా తొమ్మండుగురు స్త్రీల కథలనూ పసిగడుతుంది శ్రీలక్ష్మి. అలా అణచివేతనూ, మనోభావాల గాయాలనూ మోస్తున్న– భిన్నమైన నేపథ్యాలకు, మతం, కులం, వయస్సుకు చెందిన స్త్రీల జీవితాలు బయటపడతాయి. అందరూ లింగ వివక్షను ఎదుర్కొంటున్నవారే. తమ ఆశలను వెళ్ళబుచ్చినందుకు సమాజపు ఎగతాళి అనుభవించినవారే. అలా, ఒకరితో మరొకరికి ఏ సంబంధం లేని ఊర్వశి, నజ్మా, ఇతర స్త్రీల జీవితాలు పాఠకులకు పరిచయం అవుతాయి. నజ్మా ఏసిడ్ దాడి బాధితురాలు. ఊర్వశి పాత్రికేయురాలు. పెళ్ళయి, పెద్ద పిల్లలున్న స్త్రీ. డేటింగ్ అప్లికేషన్ వాడి, ఒక వ్యక్తిని కలుసుకుని అతనికి కావలసినది కేవలం భౌతిక సంబంధం మాత్రమే అని గుర్తించి దూరం తొలిగిపోతుంది. అతను వెంటాడుతాడు. వీరందరూ దృఢమైన స్త్రీల్లా కనిపించినా, ఎవరి బలహీనతలు వారి కుంటాయి. అయితే, పరిస్థితులకు తలవంచరు.

దీన్లో ప్రాధాన్యత ఉండేది శ్రీలక్ష్మి, ఊర్వశి కథలకే. మిగతా స్త్రీలకి ఒక అధ్యాయమో తక్కువో కేటాయించబడతాయి. మిగతావారు కొన్ని అధ్యాయాల్లో సహాయక పాత్రలు పోషిస్తారు. 'ఇది ఇచ్ఛలూ, వాటి పర్యవసానాల పుస్తకం' అంటారు నాయర్. 'ఇచ్ఛ భౌతికమైనదే కానవసరం లేదు. పరిస్థితులని తప్పించుకునే ఆశ అయిండొచ్చు. తమ గుర్తింపు కోసమైన అన్వేషణ అవ్వొచ్చు. తమని సమాజం పట్టించుకోవాలన్న కోరిక కావొచ్చు. స్త్రీలకు ఇచ్ఛలు ఉండకూడదని పవిత్ర గ్రంథాలు చెప్తాయి. నా కథలో స్త్రీలు అలాంటివారు కారు. వారు తమ చర్యల పర్యవసానాలను ఎదుర్కోవడానికి సిద్ధపడినవారు' అంటారు. నవల్లో ఉండే అనేకమైన పాత్రల, ఉపకథలవల్ల కొంత అయోమయం కలిగించినా, సారం మాత్రం స్పష్టంగా ఉంటుంది.

చివర్న, కథనం కథకురాలి మీదకి మళ్ళి, ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందో అన్న అంశానికి తిరిగి వస్తుంది. మిగతా ఏ పాత్రకీ ముగింపునివ్వరు రచయిత్రి. 'మీ టూ' ఆందోళన ఊపందుకుంటున్న కాలపు నేపథ్యంతో వచ్చిన ఈ పుస్తకాన్ని, 'కాంటెక్స్ట్' 2018లో ప్రచురించింది.

1960లో కేరళ సాహిత్య పురస్కారం పొంది, 35 ఏళ్ళ వయస్సులో ఆత్మహత్య చేసుకున్న ప్రసిద్ధ మలయాళ రచయిత్రి/కవయిత్రి రాజలక్ష్మిని శ్రీలక్ష్మి పాత్రకు ఆధారంగా తీసుకున్నారు అనితా నాయర్. అనిత కూడా రచయిత్రీ, కవయిత్రీ. కేరళలోని పాలక్కడ్ జిల్లాలో పుట్టారు. 2012లో కేరళ సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకున్నారు.

◆ కృష్ణ వేణి

పదం పలికింది - పాట నిలిచింది

నీ బాసల్లోని తియ్యదనాన్ని తెలుగు భాషకే ఇవ్వద్దు

అతిశయోక్తుల్లోని అందం ఈ పాట. రచన ప్రయోగశీలి చంద్రబోస్. సంగీతం మణిశర్మ. పాడినవారు సునీత, మల్లికార్జున్. 2002లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు వి.వి. వినాయక్. ఇది ఆయన తొలి చిత్రం. కీర్తి చావ్లా, ఎన్టీఆర్ నటీనటులు.

నీ నవ్వుల తెల్లదనాన్ని నాగమల్లి అప్పడిగింది
ఇవ్వద్దూ ఇవ్వద్దూ ఇవ్వద్దూ
నీ పెదవుల ఎర్రదనాన్ని గోరింటాకే అరువడిగింది
ఇవ్వద్దూ ఇవ్వద్దూ ఇవ్వద్దూ
నీ కోకను సీతాకోక నీ పలుకులు చిలకల మూక
నీ చూపును చంద్రలేఖ నీ కొంగును ఏరువాక
బదులిమ్మంటు బతిమాలాయి
ఇవ్వద్దూ ఇవ్వద్దూ ఇవ్వద్దూ
అసలివ్వద్దూ ఇవ్వద్దూ ఇవ్వద్దూ

నీ బుగ్గల్లోని సిగ్గులు కొన్ని మొగ్గలకైనా ఇవ్వద్దు
నా వైపే మొగ్గిన నీకైతే? అది మొత్తం ఇవ్వచ్చు
నీ బాసల్లోని తియ్యదనాన్ని తెలుగు భాషకే ఇవ్వద్దు
నాకోసం వేచే నీకైతే? అది రాశిగా ఇవ్వచ్చు
భక్తి శ్రద్ధ ఏదైనా భగవంతునికే ఇవ్వద్దు
నీకే మొక్కే నాకే ఇవ్వచ్చూ

నీ అందం పొగిడే అవకాశాన్ని
కవులకు సైతం ఇవ్వద్దు
మరి నాకై పుట్టిన నీకైతే? అది పూర్తిగ ఇవ్వచ్చు
నీ భారం మోసే అదృష్టాన్నే భూమికి సైతం ఇవ్వద్దు
నీనంటే మెచ్చిన నీకైతే? అది వెంటనే ఇవ్వచ్చు
నిను హత్తుకు పోయే భాగ్యాన్ని
నీ దుస్తులకైనా ఇవ్వద్దు
నీకై బ్రతికే నాకే ఇవ్వచ్చూ

నా వాకిట ముగ్గులు నీకే నా దోసిట మల్లెలు నీకే
నా పాపిట వెలుగులు నీకే
నా మాపటి మెరుపులు నీకే
ప్రాయం ప్రణయం ప్రాణం నీకే
ఇచ్చేస్తా ఇచ్చేస్తా ఇచ్చేస్తా
బదులిచ్చేస్తా ఇచ్చేస్తా ఇచ్చేస్తా

హాహా హూహూ ఎవరో తెలుసా?

ప్రతిధ్వనించే పుస్తకం

ప్రహ్లాదుడు తెలుసు. అతడి తమ్ముడు? హ్లాదుడు. 'వీనిని అనుహ్లాదుడు అనియు అందురు.'

'హాహా' అంటే నవ్వుగా పొరబడే ప్రమాదం ఉంది. కానీ ఆయనొక గంధర్వరాజు. మరి 'హూహూ' కూడా ఉన్నాడా? ఇతడూ గంధర్వుడే. 'దేవల ఋషి శాపముచే మకరి అయిపుట్టి అగస్త్య శాపమున గజరూపి అయిన ఇంద్రద్యుమ్నుని పట్టుకొని బాధించి విష్ణుచక్రముచే తల నఱకబడి శాపవిముక్తుడు ఆయె'. అన్నట్టూ విశ్వనాథ సత్యనారాయణ ఒక నవల పేరు: హాహా హూహూ.

అంశుమాలి అంటే సూర్యుడు. స్వాహాదేవి అగ్నిదేవుని భార్య. అస్తి జరాసంధుని కూతురు, కంసుని పెద్ద భార్య. శ్రుతకీర్తి ఎవరు? 'అర్జునునకు ద్రౌపదియందు జన్మించిన పుత్రుడు'. ఇదే సహదేవుడి కొడుకైతే? శ్రుతసేనుడు. శ్రుతసోముడు భీముని కొడుకు. ద్రౌపది కాక నకులునికి మరొక భార్య ఉందా? ఆమె పేరు రేణుమతి. అర్జునుడు సరే. అర్జుని ఎవరు? బాణాసురుని కూతురు. అలాగే, దశరథపుత్రుడు భరతుని భార్య పేరు? మాండవి. 'కవి' ఒక పేరు కూడా. ఇతడు 'రుక్షయుని కొడుకు. ఇతని వంశస్థులు బ్రాహ్మణులయిరి'.

ఇలాంటి విశేషాలు ఎన్నో తెలియజెప్పే పుస్తకం 'పురాణ నామ చంద్రిక'. సుమారు 140 ఏళ్ల క్రితం 1879లో ముద్రింపబడింది. దీని కూర్పరి యెన మండ్రం వెంకటరామయ్య. 'మన పురాణేతిహాస కావ్యములయందు తఱుచుగ కానబడు ననేక నామములను సులభముగా తెలిసికొనుటకు తగిన ఒక అకారాది నిఘంటువు లేదని యోచించి ఆ కొఱతను కొంతమట్టుకు పూర్తిచేయదలచి ఈ గ్రంథమును వ్రాసితిని' అని వై.వి. తన ముందుమాటలో పేర్కొన్నారు. 'ఇందు మన దేవతలు, ఋషులు, రాజులు, కవులు, దేశములు, పట్టణములు, నదులు, పర్వతములు, గ్రంథములు, మతాచార వ్యావహారిక పదములు మున్నగునవి' కూడా ఉన్నాయి.

కళింగ దేశానికి ఆ పేరెలా వచ్చింది? కళింగుడి వల్ల. ఇతడు 'బలి మూడవ కొడుకు'. ఈ బలి చక్రవర్తి తండ్రి విరోచనుడు. ఈ విరోచనుడు ప్రహ్లాదుని కొడుకు. మల్లనకు ఇందులో ఇచ్చిన వివరం: 'బమ్మెర పోతన కుమారుడు. రుక్మాంగద చరిత్రము అను గ్రంథమును రచియించెను. ప్రౌఢకవి మల్లన అనునది ఇతనికి బిరుదాంకము'. ఆర్యులు అన్నమాటను ఇలా వివరించారు: 'వేదములయందు చెప్పబడినవారు. వీరు తొలుత సరస్వతీ దృషద్వతీ నదుల మధ్య ప్రదేశము నందు ఉండి పిదప ఆర్యావర్తము నందు ఎల్ల వ్యాపించిరి. ఈ దేశమునందలి యాచార వ్యవహారములు అన్నియు వీరే కల్పించినవారు'. శాలివాహనుడు, హిందూమతము లాంటి కొన్ని మాటలకు దీర్ఘ వివరణలు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని ఆర్కైవ్.ఆర్గ్‌లో చదవొచ్చు.

ఈవారం పుస్తకాలు

సారంగంలో పులి (కథా సంపుటి)
రచన: ఎం.వి.వి.సత్యనారాయణ; పేజీలు: 332; వెల: 300;

రంగుల చీకటి (కథలు)
రచన: చంద్రశేఖర్ ఇండ్ల; పేజీలు: 128; వెల: 100;
పై రెండింటి ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 33-22-2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-4; ఫోన్: 0866-2430302

దిండుకింద నల్లతాచు (నవల, కొన్ని కథలు)
రచన: యండమూరి వీరేంద్రనాథ్; పేజీలు: 192; వెల: 120; ప్రతులకు: నవసాహితి బుక్ హౌజ్, విజయవాడ-520002. ఫోన్: 0866-2432885

మహాభారతం: సాగసులు-సూక్ష్మాలు
రచన: సాకం నాగరాజ; పేజీలు: 86; వెల: 100; ప్రతులకు: సాకం శశికళ, 6-1-70, వరదరాజ నగర్, తిరుపతి-517507. ఫోన్: 0877-2230135

ఎ.చేహోవ్ కథలు
అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి; పేజీలు: 144; వెల: 100;

మాక్సీమ్ గోర్కీ కథలు
అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి; పేజీలు: 216; వెల: 150;
పై రెండింటి ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నం. 21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, హైదరాబాద్-20. ఫోన్: 040-27665420

అనేకప్రపంచం

వీడియో గేమ్స్, స్పైడర్ మాన్ సినిమాలు, చక్కని మన క్లాసు అమ్మాయిలు– అని మాట్లాడుకునే మనం, పెద్దయ్యాక మీ నాన్నా, మా నాన్నలా సాహితీ విమర్శ, కథా పరామర్శ అని బోరు మాటలు మాట్లాడుకోవాల్సిందేనారా పండూ?

రారండోయ్

దాశరథి కృష్ణమాచార్య

సి.నారాయణరెడ్డి

- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య 95వ జయంత్యోత్సవం జూలై 22న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో జరగనుంది. కూరెళ్ల విఠలాచార్యకు దాశరథి పురస్కారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రదానం చేస్తారు.
- అవర్ణ తోట రాసిన 'పూర్ణ' పుస్తకావిష్కరణ జూలై 25న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్, మాసాబ్ ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో జరగనుంది. ఆవిష్కర్త: కేథరిన్ హడ్డా. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, శాంతా సిన్హా, మాలావత్ పూర్ణ పాల్గొంటారు. నిర్వహణ: ప్రిజమ్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ.
- 'ప్రజాసాహితి' సంపాదకుడు నిర్మలానంద మొదటి వర్ధంతి సందర్భంగా జూలై 24న సాయంత్రం 6 గంటలకు సి.ఆర్.లైబ్రరీ, విజయవాడలో 'రాజ్యంతో గిరిజన జీవన సంఘర్షణ– ఉద్యమ సాహిత్య కర్తవ్యాలు' అంశంపై కొత్తపల్లి రవిబాబు ప్రసంగిస్తారు. నిర్వహణ: జనసాహితి.
- తెలంగాణ సాహిత్య అకాడమి దాశరథి, సినారె జయంతి వేడుకలను 'తెలంగాణ క

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
22-7-2019

డేటింగ్ ప్రేమికుల మధ్యే కాదు... రక్తసంబంధీకులు, స్నేహితులు. సన్నిహితులతో కూడా చేయొచ్చు! మన కోసం జీవితాన్ని పిండేసిన మమ్మీడాడీతో చేయొచ్చు.. మమ్మీడాడీ లేక అనాథశ్రమంలో ఉన్న బుజ్జి స్నేహితులతో చేయొచ్చు! నిజానికి ఇంతకంటే ప్రియమైన డేటింగ్ ఇంకెక్కడైనా దొరుకుతుందా... చెప్పండి?

● ప్రతీకాత్మక చిత్రం

కొత్త గర్ల్ ఫ్రెండ్... కొత్త బాయ్ ఫ్రెండ్

హైదరాబాద్.. ఇనార్బిట్ మాల్...

ఒక ఇరవైమూడేళ్ల అమ్మాయి.. పక్కనే బహుశా వాళ్ల అమ్మనుకుంటా.. చేయి పట్టుకొని రెస్టారెంట్లోకి తీసుకెళ్లింది అమ్మాయి. రోడ్ సైడ్ వ్యూ ఉన్న కార్నర్ టేబుల్‌ను వెదుక్కొని మరీ వాళ్లమ్మను కూర్చోబెట్టింది. ఎదురుగా తను. మెనూ కార్డ్ తీసుకొని.. ఐటమ్స్ అన్నీ చదివి వినిపించింది. నచ్చింది ఆర్డర్ చేయమని చెప్పింది వాళ్లమ్మకు. బెరుకు బెరుకుగానే ఆర్డర్ చేసింది ఆవిడ. బేరర్ వెళ్లిపోయాక.. ఆ అమ్మాయి లేచి తల్లి దగ్గరకు వెళ్లి ప్రేమగా హత్తుకుంది.. ఓ సెల్ఫీ తీసుకుంది. వెంటనే సోషల్ మీడియాలో పోస్టూ చేసినట్టుంది. లంచ్ అయ్యాక.. అక్కడే షాపింగ్ చేశారు.. చిన్నపిల్లల్లా అల్లరి చేశారు. ఐస్ క్రీమ్ తిన్నారు. కామెంట్స్ చేసుకున్నారు.. జోక్స్ వేసుకున్నారు. వాళ్లమ్మకు తన సెల్‌ఫోన్‌లో (ఫేస్ బుక్కో.. ఇన్‌స్టాగ్రామో అయ్యుంటుంది) ఏదో చూపించింది.. ఆ అమ్మేదో అంది.. ఆ పిల్ల టైప్ చేసింది. మొత్తానికి ఆ ఇద్దరి వయసుల్లో తేడాను బట్టి తల్లీ, బిడ్డగా అంచనా వేయడమే తప్ప వాళ్ల చనువు, స్నేహం చూస్తే ఫ్రెండ్సే అనుకుంటారు. అంతా తిరిగి ఓ బెంచ్ మీద కూర్చున్నారిద్దరూ. ఉండబట్టలేక ఆ పిల్లను కదిలిస్తే..

''మా అమ్మండీ.. సింగిల్ మదర్. నాకు మూడేళ్లప్పుడు మా నాన్న యాక్సిడెంట్‌లో పోయాడు. మా పేరెంట్స్‌ది లవ్ మ్యారేజ్. నాన్న పోయాక కూడా అమ్మమ్మవాళ్లు కాని, నానమ్మ వాళ్లు కాని అమ్మను రానివ్వలేదు. ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా వర్క్‌చేస్తూ నన్ను పెంచింది. ఆటో మోబైల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌ని. జాబ్‌లో చేరి టూ ఇయర్స్ అవుతోంది. హయ్యర్ ఎడ్యుకేషన్ కోసం జర్మన్ యూనివర్సిటీలో అప్లయ్ చేసుకున్నా. సీట్ వచ్చింది. వెళ్లే ప్రిపరేషన్‌లో ఉన్నా. ఈ బిజీలో ఒక్కరోజు కూడా అమ్మతో లీజర్‌గా స్పెండ్ చేయలేదు. ఇప్పుడు నేను వెళ్లిపోతే తను మళ్లీ ఒంటరే. అందుకే ఈ వీకెండ్ అమ్మతో గడపాలని.. ఐ మీన్ మా అమ్మతో డేట్ చేయాలని ప్లాన్ చేసుకున్నా. నిన్న (శనివారం) ఆర్టికిల్ ఫిఫ్టీన్ సినిమా, చార్మినార్, ఈరోజు (ఆదివారం) ఇలా వర్క్ వుట్ చేస్తున్నా'' అంటూ వాళ్లమ్మను మళ్లీ దగ్గరకు తీసుకుంది ప్రేమగా. ఆ తల్లి కళ్లల్లో సన్నని కన్నీటి తెర.

''ఒక్క ఫొటో తీసుకోవచ్చా మీ ఇద్దరిదీ?'' అని సెల్‌ఫోన్‌లోని కెమెరాను సెట్ చేసుకోబోతుంటే ఆ అమ్మ ''అయ్యో.. వద్దండీ'' అంటూ ఇబ్బంది వ్యక్తం చేసింది.

● అనూష తివారి

మియామీ.. గోవా.. నేను

నాకు ఏ మాత్రం టైమ్ దొరికినా నాకిష్టమైన చోటుకి వెళ్లి.. నాతో నేను డేట్ చేయాలనుకుంటాను. వెళ్లాను.. వెళ్తాను కూడా. అమెరికాలో ఉన్నప్పుడు మియామీ.. ఇండియాలో గోవా. మనతో మనం గడిపితే.. మన మైనస్ పాయింట్స్ తెలుస్తాయి.. మన స్ట్రెంత్ అర్థమవుతుంది. కొత్త ఎనర్జీ వస్తుంది.

– అనూష తివారి,
ప్రాజెక్ట్ మేనేజర్ (డెలాయిట్)

● రితిక

సండే.. ఫ్యామిలీ డే

మా పేరెంట్స్ ఇద్దరూ వర్కింగే. నేను, నాకో చెల్లి. కాలేజ్‌తో మేమూ బిజీ. సో... వారానికి ఒక రోజు డేట్ విత్ ఫ్యామిలీ అన్నమాట. ఎవ్రీ సండే.. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి డిన్నర్ వరకు బయటే స్పెండ్ చేస్తాం. చర్చ్, పిక్చర్.. కంపల్సరీ. మిగిలిన విజిటింగ్ ప్లేసెస్ మారుతుంటాయి.. ఒక్కో సండే ఒక్కోచోటికి.

– రితిక, బిటెక్
స్టూడెంట్, హైదరాబాద్

గమనిక: ఈ మ్యాటర్ ఆ ఇద్దరి అనుమతితోనే ఇక్కడ రాశాం.

● ● ●

సుమిత్.. ముప్పైఏళ్లు. బెంగళూరులో ఉద్యోగం. సొంతూరు విశాఖపట్టణం. అతని చిన్నప్పటి స్నేహితురాలు శాలిని అమెరికా నుంచి వస్తే ఆమెను కలవడానికి ఊరెళ్లాడు. ఆమె అతణ్ణి ఓ అనాథ శరణాలయానికి తీసుకెళ్లింది.. డబ్బు డొనేట్ చేయాలని. వెళ్లాక శాలినికి ఓ ఆలోచన వచ్చింది. ''సుమిత్ ఈ పిల్లలను డేట్‌కు తీసుకెళితే?'' అని. మెచ్చుకోలుగా చూశాడు సుమిత్. ఆలస్యం చేయకుండా ఆ పిల్లలను అడిగారు ''బయటకు వెళదామా?'' అని. ''బీచ్‌కి'' చెప్పారు ముక్తకంఠంతో వాళ్లు. వార్డెన్ పర్మిషన్‌తో బీచ్‌కు తీసుకెళ్లారు. చీకటి పడేవరకు ఆడుకున్నారు. అక్కా, అన్నా అంటూ ఈ ఇద్దరితో సరదాగా గడిపారు. కావల్సింది కొనిపించుకున్నారు. అలసిసొలిసి సంతోషంగా ఆర్ఫనేజ్‌కు చేరారు.

ఈ సంఘటనలను బట్టి ఇప్పుడున్న డేటింగ్ ట్రెండ్ అర్థం అవుతోంది కదా!

పెళ్లి బంధంలోకి వెళ్లాలనుకునే ప్రేమికులు.. తమ మధ్య ఉన్న కంపాటబులిటీని అర్థం చేసుకోవడానికి, పెంచుకోవడానికి డేటింగ్ చేస్తారు.. స్నేహం పెరగడానికి డేట్‌కి వెళ్తారు. తెలిసిన విషయమే. కొత్త ఒరవడే.. డేట్ విత్ పేరెంట్స్, సిబ్లింగ్స్, కజిన్స్.. ఫ్రెండ్స్. ఒకే ఇంట్లో ఉంటున్నా వాట్సప్‌లో విష్ చేసుకునే కాలం ఇది. కారణం.. గడియారంతో పోటీ పడే వేగం.. ఉదయం లేవగానే చాయ్‌తో చర్చించే ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, న్యూక్లియర్ ఫ్యామిలీస్‌లో ఉన్న నలుగురికీ కలిసి భోంచేసే భాగ్యం కరువవడం, అమ్మ, నాన్న, అక్క, అన్న, చెల్లి, తమ్ముడితో ముఖాముఖి మాట్లాడుకోవడానికి వీలుపడకపోవడం కావచ్చు. ఇక కజిన్స్.. ఫ్రెండ్స్.. సంగతి చెప్పక్కర్లేదు. ఆ అందరిదాకా ఎందుకు? వర్క్ ఫ్రమ్ హోమ్, క్లయింట్స్‌తో అర్జెంట్ మీటింగ్స్ లాంటి ఎక్స్‌ట్రా ఫిటింగ్స్‌తో మనతో మనం గడిపే టైమూ దొరకట్లేదు అని వాపోతున్న వాళ్లూ చాలామందే! ఈ చాలామంది సోషల్ మీడియా ఫ్రీకే! అయినా వాపోతున్నారంటే.. రిలేటివ్స్, రిలేషన్స్‌కు మధ్య ఉన్న ఆర్టిఫీషియల్ కనెక్టివిటీని తొలగించుకోవాలనుకుంటున్నట్టే కదా! కనిపిస్తూ.. వినిపించే పకరింపు.. భరోసానిచ్చే కరచాలనం.. ఆప్యాయతను చూపించే ఆలింగనం.. బంధాన్ని, అనుబంధాన్ని బలపరిచే ఆత్మీయ స్పర్శ.. ఒకరికొకరం ఉన్నామనే భద్రతను కోరుకుంటున్నట్టే కదా! ఇవన్నీ పొందడానికి కనీసం వారానికి ఒక్కరోజు దొరికినా చాలు అని ఎదురుచూస్తున్నారు. అందుకే ఆ కొత్త ట్రెండ్ వచ్చింది. డేట్ విత్ పేరెంట్స్, తోబుట్టువులు, కజిన్స్, ఫ్రెండ్స్‌తోనే కాదు.. మనతో మనం ఉండే రోజు !

● సిబ్లింగ్స్, కజిన్‌తో రమ్య

సందర్భం క్రియేట్ చేసుకుంటున్నాం..

పెళ్లయిన ఆడపిల్లలకు తోబుట్టువులను కలుసుకోవాలన్నా ఒక అకేషన్ ఉండాలి.. అత్తింట్లో పర్మిషన్ ఉండాలి. అందుకే సిబ్లింగ్స్ అండ్ కజిన్స్‌ను కలుసుకునే సందర్భాన్ని క్రియేట్ చేసుకొని ఆ డేను డేట్ విత్ సిబ్లింగ్స్ అండ్ కజిన్స్‌గా ఎంజాయ్ చేస్తున్నాం.

– ఏలేటి రమ్య, దుబాయ్

60వ పుట్టినరోజే ఫస్ట్ డేట్..

ఎనిమిదేళ్లు అమెరికా (కాలిఫోర్నియా)లో ఉన్నాను. యాపిల్‌లో వర్క్ చేసేదాన్ని. మొన్ననే ఇండియా షిఫ్ట్ అయ్యాను. మా పేరెంట్స్‌తో గడపాలనే ఉద్దేశంతోనే. ఇంతకన్నా పెద్ద డేట్ ఉండదేమో కదా (నవ్వుతూ). నాన్న (ఏ.ఎస్. రామశాస్త్రి).. ఐడిబీఆర్‌టీ డైరెక్టర్. అమ్మ (ఏ. గాయత్రీ దేవి).. ఆయుర్వేదిక్ డాక్టర్. వాళ్ల బిజీతో నా దగ్గరకు రాలేకపోయేవారు. లీవ్స్ లేక ఇండియాకు రావడం నాకూ కష్టమయ్యేది. పేరెంట్స్‌ని చాలా మిస్ అయ్యా. అందుకే ఆ ఉద్యోగాన్ని వదిలి వచ్చేశా. నేనొచ్చాక వాళ్లతో నా ఫస్ట్ డేట్ మా నాన్నగారి 60వ పుట్టినరోజు. ఆయన చిన్నప్పటి ఫ్రెండ్స్ అందరి దగ్గరా నాన్న గురించి కామెంట్స్, జ్ఞాపకాలు తీసుకొని పుస్తకంగా పబ్లిష్ చేయించా. ఆ పుస్తకాన్ని నాన్నకు సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా ఆయన బర్త్‌డే ఫంక్షన్‌లో లాంచ్ చేశాం. ఆ రోజంతా అమ్మా, నాన్న.. వాళ్ల స్నేహితులతో గడిపా. ఇప్పటికీ ఏ రోజు టైమ్ దొరికినా వాళ్లకు ఇష్టమైనవి వండిపెడ్తా. ముగ్గురం కలిసే భోంచేస్తాం.. ఇష్టమైన సినిమా చూస్తాం.. కబుర్లు చెప్పుకుంటాం.

– ఏ. అపరాజిత, ఇండిపెండెంట్ కన్సల్టెంట్.

అమ్మానాన్నలతో అపరాజిత

డైన్ విత్ పేరెంట్స్

● రాహుల్ యాదవ్

మా నాన్న (పర్వతాలు) అడ్వకేట్. అమ్మ (హైమలత).. హోమ్ మేకర్. నేనొక్కడినే కొడుకును. రీసెంట్‌గా బీటెక్ అయిపోయింది. వర్క్‌తో నాన్న బిజీగా ఉంటాడు. అమ్మ నాకోసం ఆరాటపడ్తుంది. కాని ఫ్రెండ్స్, పార్టీలతో నేను అమ్మకు దొరకను. చాలాసార్లు అనుకుంటా అమ్మతో టైమ్ స్పెండ్ చేయాలని. కనీసం నా బర్త్‌డే రోజైనా ఇంట్లో అమ్మతో సెలబ్రేట్ చేసుకోవాలని. మొన్న ఎయిటీంత్(జూలై 18)నే నా బర్త్‌డే అయింది. ఆ రోజు ఇంట్లోనే ఉండాలని అనుకున్నా. కాని ఫ్రెండ్స్ పార్టీ అనేసరికి వెళ్లాల్సి వచ్చింది. అమ్మ చాలా బాధపడింది. ఇప్పటి నుంచి అలా ఉండకూడదనుకుంటున్నా. కనీసం వారంలో ఒక్కరోజైనా మా పేరెంట్స్‌తో గడపాలి. బయటకు వెళ్లడం కుదరకపోతే కనీసం వాళ్లతో కలిసి భోజనమన్నా చేయాలి. ఐ మీన్ డైన్ విత్ పేరెంట్స్ అన్నమాట. ఈ సారి పక్కా!

– రాహుల్ యాదవ్, హైదరాబాద్

దీని గురించి విన్న పెద్ద తరం ''ఏంటో ఉన్న దాన్ని నాశనం చేసుకొని.. మళ్లీ దాన్ని నిలబెట్టుకునే వెర్రి ప్రయత్నాల పిదప కాలం.. పిదప బుద్ధులు కాకపోతే?'' అంటూ పెదవి విరవొచ్చు. ''ముందు ఓల్డేజ్ హోముల్లో పెట్టిన మమ్మల్ని ఇంటికి తెచ్చుకోండి'' అంటూ నొసలు చిట్లించనూ వచ్చు! దొరికిన ఒక్కరోజైనా అయిన వాళ్లతో డేట్‌కెళ్లే హడావుడిలో ఉంది యూత్! ఆ లిస్ట్‌లో ఓల్డేజ్ హోమ్‌లోని గ్రాండ్ పేరెంట్స్ కూడా ఉండొచ్చు. కాబట్టి పాశ్చాత్య పైత్యం.. ఫ్యాషన్ ప్రకోపం అంటూ వాళ్ల మనసుల్ని చిన్నబుచ్చకుండా.. కనీసం ఈ కొత్త తీరుగానైనా పాత పద్ధతిని తిరిగి నిలబెట్టుకునే యత్నం చేస్తున్నందుకు పెద్ద మనసుతో ఆనందపడదాం!

– సరస్వతి రమ

చెట్టు నీడ

ఆత్మపై దృష్టి సడలకూడదు

ఓ యుద్ధంలో శత్రుదేశపు యువరాజుని బంధించిన సైనికులు అతనిని తమ రాజు ముందు నిలబెట్టారు.

ఆ యువరాజు తనను క్షమించి విడిచిపెట్టమని ఈ రాజుని ప్రాధేయపడ్డాడు.

రాజు అందుకు ఒప్పుకున్నాడు కానీ, ఓ షరతు పెట్టాడు.

''నీ చేతికో పాత్ర ఇస్తాం. అది నీటితో నింపిన పాత్ర. దానిని నువ్వు మేము చెప్పిన చోటుకి మేము పెట్టిన గడువు లోపల ఒక కిలోమీటరు దూరం దాకా నడిచివెళ్ళి అక్కడ ఉంచాలి. దారిలో ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా ఆ పాత్ర నుంచి నేల మీద చిందకూడదు. నీ వెనుక నా భటులు వస్తారు. నువ్వు ఒక్క చుక్క నీరు కిందపడేసినా నా భటుడు తన దగ్గరున్న కత్తితో నీ తలను నరికేస్తాడు. అలాకాకుండా నువ్వు చుక్క నీరు కూడా కింద పడకుండా మేము చెప్పిన చోటుకి చేరిస్తే నిన్ను ప్రాణాలతో విడిచిపెడతాం'' అన్నాడు రాజు.

రోడ్డుకు ఇరువైపులా జనం నిలుచున్నారు ఏం జరుగుతుందో చూడాలని. దారంతా శుభ్రపరిచారు. నీరు నింపిన పాత్రను యువరాజు చేతిలో పెట్టారు. దారిపొడవునా అటూ ఇటూ నిల్చున్న వారిలో కొందరు చప్పట్లు కొట్టి ప్రోత్సహించారు. మరికొంతమంది అతనికి వ్యతిరేకంగా అవహేళన చేస్తూ నినాదాలు చేశారు.

అందరి కళ్ళూ అతనిపైనే కేంద్రీకృతమయ్యాయి.

ఇవేవీ పట్టించుకోకుండా యువరాజు నీటి పాత్రతో నడవటం మొదలుపెట్టాడు.

ఓవైపు అతనిని ప్రోత్సహించే చప్పట్లు, మరోవైపు అతనిని హేళన చేస్తూ అరుపులూ...

ఇవేవీ లెక్కచేయకుండా అతను నీటి పాత్రతో ముందుకు పోతున్నాడు. విజయవంతంగా అతను గమ్యస్థానానికి నిర్ణీత సమయంలోనే చేరుకున్నాడు.

అప్పుడు రాజు ''నిన్ను మార్గమధ్యంలో అవమానపరచిన వారిని నువ్వు శిక్షించే వీలుంది. అదేవిధంగా నిన్ను ప్రోత్సహించిన వారికి బహుమానాలివ్వవచ్చు'' అన్నాడు.

అయితే అతను తన దృష్టంతా నీటి పాత్ర పైనే ఉంది కనుక తనను ఎవరు అవహేళన చేశారో తనకు తెలీదన్నాడు.

అప్పుడు యువరాజును విడుదల చేస్తూ రాజు ఇలా అన్నాడు – ''యువ రాజా, పాత్రలో ఉన్న నీరు నీ శరీరంలో ఉన్న ఆత్మ. జీవితాంతం నీ ఆత్మ విషయాన్ని మనసులో ఉంచుకోవాలి. దాని సంగతి విస్మరించకూడదు. చివరకు దానిని సృష్టికర్తకు అప్పగించాలి. నిన్ను ప్రశంసించిన వారిని చూసి గర్వపడకు. అలాగే నిన్ను అవహేళన చేసిన వారిని చూసి డీలాపడిపోకు. ఆత్మపై దృష్టిని ఎప్పుడూ మరచిపోకూడదు'' అని.

– యామిజాల జగదీశ్

బ్యూటిప్

- జలుబు వల్ల ఉదయం నిద్రలేవగానే కళ్ల కింద ఉబ్బుగా కనిపిస్తుంది. ఎండిన చిట్టి చేమంతులను పొడి చేసి, ఆ పొడిని ఒక గుడ్డలో వేసి మూట కట్టాలి. వేడి నీటిలో ఆ మూటను కాసేపు ఉంచి, ఉబ్బుగా ఉన్న కళ్ల కింద మృదువుగా అద్దుతూ (తగినంత మాత్రమే వేడి ఉండేలా జాగ్రత్తపడాలి) ఉండాలి. రోజూ ఉదయాన్నే ఇలా చేస్తే కళ్లకింద ఉబ్బుతో పాటు నల్లని వలయాలు కూడా తగ్గుముఖం పడతాయి.
- చామంతి పొడితో కాచిన తేనీటిని మాడుకు పట్టించి, తర్వాత తలస్నానం చేస్తే ఎంతకీ తగ్గని చుండ్రు సమస్య పరిష్కారం అవుతుంది.

వెనిస్ వాకిట్లో బాంబే రోజ్

బాంబే రోజ్... గులాబీల్లో వెరైటీ కాదు. కాని ముంబైలో పూసిందే! సిల్వర్‌స్క్రీన్ మీద.. గీతాంజలి రావు ఆలోచనల్లోంచి! ఆ సినిమానే రేపు ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 7 వరకు జరగనున్న వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది! ఇక్కడ ప్రస్తావించుకోవడానికి సందర్భాన్ని తెచ్చింది!



'బాంబే రోజ్'లో ఓ సన్నివేశం

● మధుబాలతో..
● గురుదత్‌తో..
● సత్యజిత్‌రేతో..
● స్మితాపాటిల్‌తో...
● చేగువెరాతో..

'విష్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెల్ఫీ' దృశ్యాలు

గీతాంజలి రావు

ముందు సినిమా గురించి చెప్పుకుందాం.. తర్వాత గీతాంజలి రావును పరిచయం చేసుకుందాం.

''బాంబే రోజ్'' యానిమేటెడ్ మూవీ. ముంబైలో జరిగిన ఓ వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందింది. కమల, సలీమ్ .. రెండూ ముఖ్యమైన పాత్రలు. బాల్య వివాహం నుంచి తప్పించుకొని ముంబై చేరుతుంది కమల. కశ్మీర్ రాజకీయాలకు బలైన యువకుడు సలీమ్. కొత్త జీవితం అన్వేషణలో అతనూ ముంబై చేరుతాడు. రోడ్డుకు ఇవతలివైపు పూలు అల్లుకుంటూ కమల, అవతలివైపు పూలమాలలు అమ్ముకుంటూ సలీమ్. బాలీవుడ్ డ్రామాగా ఆ ఇద్దరి మధ్య నడిచిన కథే బాంబే రోజ్. యానిమేషన్ సినిమాలకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ ప్రధానం. రఫ్‌గా తీసిందే బ్లూ ప్రింట్ అవుతుంది. ''బాంబే రోజ్'' బ్లూ ప్రింట్‌కి రెండేళ్లు పట్టిందట. . మొత్తం చిత్రం పూర్తి కావడానికి ఐదు సంవత్సరాల పైనే పట్టిందిట. ఈ సినిమాకు వాడిన సంగీతం ఎనభై శాతం పాత సినిమాల్లోంచి తీసుకున్నదే. కమల పాత్రకు శైలీ ఖారే, సలీమ్ పాత్రకు అమిత్ డియోండీ, విలన్ పాత్రకు మకరంద్ దేశ్‌పాండే, బాలీవుడ్ స్టార్‌కు అనురాగ్ కశ్యప్, కమల తాత పాత్రకు వీరేంద్ర సక్సేనా గళాన్ని అందించారు.

గీతాంజలి పరిచయం..

షూజిత్ సర్కార్ దర్శకత్వం వహించిన ''అక్టోబర్''సినిమా గుర్తుండే ఉంటుంది కదా. అందులో ప్రమాద వశాత్తు బిల్డింగ్ పై నుంచి కిందపడిన యువతి తల్లిగా నటించిన నటే గీతాంజలి రావు. జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో కమర్షియల్ ఆర్ట్ కోర్సు చేశారు ఆమె. అక్కడున్నప్పుడే ప్రఖ్యాత యానిమేటర్ రామ్ మోహన్ దగ్గర యానిమేషన్ నేర్చుకున్నారు. అలా ఆమె 2006లో ''ప్రింటెడ్ రెయిన్‌బో '' అనే తన ఫస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్‌కి రూపమిచ్చారు. దీనికి 28 అవార్డులు వచ్చాయి. ఫిల్మ్ స్కూల్స్‌లో సబ్జెక్ట్ కూడా అయ్యిందీ సినిమా. ఆ తర్వాత పదేళ్లకు ''విష్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెల్ఫీ'' అనే షార్ట్ ఫిల్మ్ తయారు చేశారు. ఆమె తన సెల్ఫీలను రాజకీయనాయకులు, కళాకారులతో కలిసి తీసుకున్నట్టుగా ఫోటోషాప్ చేసి తీసిన సినిమానే అది. చాలామంది ఆసక్తిగా చూశారు. 46 యేళ్ల గీతాంజలి పూర్తిస్థాయి సినిమా తీయడానికి చాలా యేళ్లే నిరీక్షించాల్సి వచ్చింది. ఫైనాన్సియర్లు ముందుకు రాకపోవడమే కారణం. ఈ ప్రాజెక్ట్ కోసం టీవీ కమర్షియల్స్‌లో నటించారు. '' చాలా యేళ్లుగా నటిస్తూనే ఉన్నాను. యానిమేషన్‌లో తలమునకలై ఉండడంతో అనురాగ్ కశ్యప్ '' పాంచ్'' లో నటించే అవకాశం వచ్చినప్పటికీ సున్నితంగా తిరస్కరించాను. బాంబే రోజ్' మేకింగ్‌లో బిజీ అవడంతో ఇంకొన్ని అవకాశాలకూ నో చెప్పాల్సి వచ్చింది. ఆరు సంవత్సరాల కిందటే బాంబే రోజ్ కథ ఆలోచించాను. తీయడానికే నిర్మాతలు దొరకలేదు. మంచి భవిష్యత్ కోసం ముంబైకి వలస వచ్చిన వారి జీవితమే ఈ చిత్రం. నేను కూడా ఇక్కడకు వలస వచ్చినదానినే. ముంబైకి సంబంధించిన ఎన్నో అంశాలు నిత్యం నన్ను పలకరిస్తూనే ఉంటాయి. అందువల్లే ఈ చిత్రం టైటిల్‌లో బాంబే పేరు ఉంచాను. నాకు పూల పట్ల ఉన్న ప్రేమను ప్రదర్శించాను. నేను ట్రైన్లో చూసిన పూలమ్ముకునే అమ్మాయి జీవితం ఆధారంగా వచ్చినదే కమల పాత్ర. నిత్యం నా తలలో మల్లెపూలు పెట్టుకుంటాను. చెమటలు కక్కే బొంబాయి మహానగరంలో వీటి వల్లే సువాసనలు పీల్చుకోగలం. దాదర్ ఫ్లవర్ మార్కెట్, జుహూ బీచ్‌ల మధ్య తిరుగుతుండే పూలవారికి సంబంధించిన దృశ్యాలను యానిమేట్ చేయడానికి ఎనిమిది నెలల సమయం పట్టింది. ఒక సూట్‌కేసులో బట్టలన్నీ నిండుగా ఉన్నట్లే, నా మదిలో కూడా ఆలోచనలు అలాగే ఉన్నాయి. అంతకుముందు.. ముంబైకి వలస వచ్చిన ముగ్గురి కథ ఆధారంగా తీసిన గిర్‌గిత్ చిత్రం.. ఆరు నెలల పాటు నిర్మాణం జరిగాక ఆగిపోయింది. ఆ అనుభవంతో 'ట్రూ లవ్ స్టోరీ' అనే షార్ట్‌ఫిల్మ్ తీశాను. అది 2014లో జరిగిన కేన్స్ ఉత్సవంలో ప్రదర్శనకు ఎంపికైంది. నేను ప్రారంభించి ఆపేసిన చాలా సినిమాల నుంచి కొత్త పాఠాలు నేర్చుకున్నాను. '' అంటారు గీతాంజలి రావు.

● 'అక్టోబర్' చిత్రంలో గీతాంజలి రావు

వెనిస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ''బాంబే రోజ్'' తోపాటు వి. బి. సమంత తీసిన హనుమాన్ (2005), అర్నబ్ చౌదరి తీసిన అర్జున్ – ద వారియర్ ప్రిన్స్ (2012), శిల్పా రనాడే తీసిన గోపీ గవయ్యా బాజా బజయ్యా, చోటాభీమ్ పాత్రల ఆధారంగా రూపొందినవి మరికొన్నీ ప్రదర్శనకు ఎంపికయ్యాయి.

– వైజయంతి

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
22-7-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ లవ్ డాక్టర్ గారూ..! నాకు పిచ్చి పట్టిన ట్లుగా ఉంది. కోపం వచ్చే స్తోంది. తినాల నిపించట్లేదు. బాధగా ఉంది. కారణం.. నేను లవ్‌లో ఉన్నాను. గత కొన్నాళ్లుగా తను నాకు మెసేజెస్, ఫోన్స్ చెయ్యట్లేదు. నేనేమో తన మెసేజ్ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాను. నేను తనకి గుర్తుకురానా? లవ్ గురువుగారూ.. ఎప్పుడూ అబ్బాయిలే మోసం చేస్తారంటా రుగా మీరు? ఇప్పుడు నేను ఎంతగా బాధ పడుతున్నానో చూడండి. తనకి మాత్రం నేను అసలు గుర్తుకు రావట్లేదు. అసలు ఇది ప్రేమేనా? అయినా మొదట్లో తను నా బెస్ట్ ఫ్రెండ్. మేము ఫ్రెండ్స్‌గా ఉన్నప్పుడు తను నాతో బాగా మాట్లాడేది. నేను వాళ్ల పేరెం ట్స్‌తో కూడా మాట్లాడేవాడిని. కానీ ఇప్పుడు భయపడుతోంది. నాకు కొంచెం సలహా ఇవ్వండి. తనతో అసలు ఎలా ఉండాలో మీరే చెప్పండి ప్లీజ్.

– బాలాజీ

అన్నా! మళ్లీ ఫ్రెండైపో అన్నా..!
కొంచెం బెండ్ అయిపో అన్నా..!
లవ్ ఎండ్ అయిపోయినా అన్నా..
కొత్త ట్రెండ్ పట్టుకో అన్నా...!!

'ఏంటి సార్..? ఫ్రెండ్.. బెండ్.. ఎండ్.. ట్రెండ్.. అని సౌండ్ మార్చారు. అమ్మాయి బాలాజీకి 'ది ఎండ్' చెప్పిందని క్లియర్‌గా చెప్పకుండా.. మీ సిస్టర్‌ని కాపాడుకుంటు న్నారా సార్? అమ్మాయి బాలాజీని వేసే సింది సార్.. కట్టింగ్ చేసేసి వేరే ఫిట్టింగ్ చూసుకుంది సార్.. అబ్బాయిలే కాదు సార్ అమ్మాయిలు కూడా చేస్తారు సార్ మోసాలు. అరటిపండు మీద ఒట్టేసి కరెక్ట్ ఆన్సర్ చెప్పండి సార్!''

ఫ్రెండ్‌గా మొదలైన ప్రయాణం వద ల్లేదు బాలాజీ. మధ్యలో వచ్చిన ప్రేమ మధ్య లోనే పోయింది. నువ్వు ముందు నుంచి లవ్ ధ్యాసలో ఉన్నావు కాబట్టే అమ్మాయి కూడా కన్ఫ్యూజ్ అయిపోయి.. ఫ్రెండ్‌షిప్‌ని లవ్ అనుకుంది.. ఇప్పుడు కన్ఫ్యూజన్ లేదు.. స్నేహమే ఉంది.. ఉండాలి..!!

'ఆన్సర్ బాగానే ఉంది కానీ కష్టమే సార్..!! ఒక్కసారి లవ్‌లో పడ్డాక మళ్లీ లేచి ఫ్రెండ్‌గా నిలబడటానికి చాలా బలం కావాలి సార్.. బాలాజీ బీ స్ట్రాంగ్!'

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		4		1				
	5	8	3					
6		9		2		1	5	
					8	6		9
5	1	6	7		9	3	2	8
8		7	2					
	4	3		7		8		6
					6	7	1	
				8		4		

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	8	4	7	9	3	6	2	1
1	2	7	5	8	6	4	9	3
3	9	6	4	2	1	5	8	7
7	4	3	9	6	8	1	5	2
8	6	5	1	4	2	3	7	9
2	1	9	3	7	5	8	4	6
6	7	2	8	3	4	9	1	5
9	5	8	6	1	7	2	3	4
4	3	1	2	5	9	7	6	8


మహేశ్‌బాబు

వాట్ నెక్స్ట్?

మహేశ్‌బాబు ప్రస్తుతం 'సరిలేరు నీకెవ్వరు' సినిమాతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కు తోన్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత మహేశ్ ఎవరి దర్శకత్వంలో సినిమా చేయబోతు న్నారు? అనే ప్రశ్నకు 'గీతగోవిందం' ఫేమ్ దర్శకుడు పరశురామ్ పేరు వినిపి స్తోంది. గతంలో కూడా ఈ దర్శ కుడు మహేశ్‌బాబుకి కథ వినిపించారనే వార్తలు వచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇటీవల మహేశ్‌ని కలిసి పూర్తి కథని చెప్పారట పర శురామ్. ఈ కథ మహేశ్‌కి నచ్చిందట. అన్నీ కుదిరితే గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. వంశీపైడిపల్లి దర్శకత్వంలో మహేశ్ మరో సినిమాకు అంగీ కరించారు. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్‌వంగా కూడా ఓ కథ చెప్పారట. మరి మహేశ్ తర్వాతి సినిమా ఏంటి? అనే విషయంపై క్లారిటీ రావా లంటే మరి కొంత సమయం వేచి ఉండక తప్పదు. 'సరిలేరు నీకెవ్వరు' కశ్మీర్ షెడ్యూల్ పూర్తయింది. తర్వాతి షెడ్యూల్ ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.

నాగార్జున

కొంటె పిల్లడు.. గడసరి అమ్మడు

ఇంట్లో ఏమీ తెలియని అమా యకుడిలా ఉంటూ బయట మాత్రం మన్మథుడి వేషాలు వేసే ఓ అబ్బాయి.. ఇంట్లో పూజలు చేస్తూ బయట సిగరెట్ కాల్చే ఓ అమ్మాయి. ఇలాంటి కొంటె పిల్లాడి జీవి తంలోకి వచ్చిన గడసరి అమ్మాయి చేసిన అల్లరి ఏంటి? వీరిద్దరి జీవితాల్లో ప్రేమ చిగు రించిన తర్వాత జరిగిన పరిస్థితులు ఏంటి?... వంటి అంశాలతో తెరకెక్కిన చిత్రం 'మన్మథుడు 2'. రాహుల్ రవీం ద్రన్ దర్శకత్వంలో నాగార్జున, రకుల్ ప్రీతిసింగ్ జంటగా నటించారు. నాగార్జున, పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను, రకుల్ పోషించిన అవంతిక పాత్ర టీజర్‌ను విడుదల చేశారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రంలోని 'హే మానియా' పాటను ఆదివారం విడుదల చేశారు. సీనియర్ నటి లక్ష్మి, రావు రమేష్, ఝాన్సీ, దేవదర్శిని, 'వెన్నెల' కిశోర్ తదితరులు నటించిన ఈ సినిమా ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు చైతన్య భరద్వాజ్ సంగీతం అందించారు.

పిల్లల సక్సెస్ చూసినప్పుడే ఆనందం

– కె.రాఘవేంద్రరావు

''మీ తాతయ్య (రాజేంద్రప్రసా ద్) నవ్వించేవారు.. నువ్వు(సాయి తేజస్విని) భయ పెడుతున్నావ్. 'మహానటి' చిత్రంతో నటన మొదలు పెట్టావు. మన సక్సెస్ కన్నా మన పిల్లల సక్సెస్ చూస్తే చాలా ఆనందంగా ఉంటుంది'' అని డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు అన్నారు. ప్రియమణి ప్రధాన పాత్రలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'సిరివెన్నెల'. ప్రకాష్ పులిజాల దర్శకత్వం వహిం చారు. 'మహానటి' ఫేమ్ సాయి తేజస్విని, 'బాహుబలి' ఫేమ్ ప్రభాకర్, అజయ్ రత్నం, రాకెట్ రాఘవ కీలక పాత్రల్లో నటించారు. కమల్ బోరా, ఏఎన్‌బాషా, రామసీత నిర్మించిన ఈ సినిమా పాటల విడుదల వేడుక హైదరాబాద్‌లో జరిగింది. రాఘవేంద్రరావు మాట్లాడుతూ– ''నిర్మాతల్లో ఒకరైన బాషాకి రాఘవేంద్రరావు తెలుసు.. రాజమౌళి తెలుసు... అందరితోనూ పని చేశాడు. నా సినిమాలకు చాలా వరకు ఆయనే నేపథ్య సంగీతం అందించారు. నేపథ్య సంగీతం లేకపోతే సినిమానే లేదు. సావిత్రిలాగా అటు మోడ్రన్, ఇటు ట్రెడిషనల్.. ఇలా ఏ పాత్రకైనా ప్రియమణి సరి పోతుంది'' అన్నారు. నటుడు డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''తెలుగు సంగీతాన్ని అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేసిన కీరవాణిగారిని, ఆర్.పి. పట్నాయక్.. ఇంకా ఇంత మంచి మహానుభావులను ఒకే వేదికపై కలవడం ఆనందంగా ఉంది. మా మన వరాలు గురించి నేను చెప్పకూడదు.. ప్రేక్షకులే ఈ సినిమా చూసి ఎలా నటించిందో చెప్పాలి'' అన్నారు. ''ఈ సినిమాతో నా రెండో ఇన్నింగ్స్ ప్రారంభం అయినట్లే. టీజర్, ట్రైలర్ చాలా బాగున్నాయి. తేజస్విని బాగా నటించింది'' అన్నారు ప్రియమణి. ''నేను చేసిన 'అనగనగా ఓ దుర్గ' చిత్రం చూసి బాషాగారు కథ చెప్పమన్నప్పుడు 'సిరివెన్నెల' కథ చెప్పాను. బాషాగారికి, బోరాగారికి నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ కుదిరింది'' అన్నారు ఓం ప్రకాష్. ''ఈ సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అని బాషా, కమల్ బోరా అన్నారు. డైరెక్టర్ వైవీఎస్ చౌదరి, సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణి, ఆర్.పి. పట్నాయక్, నిర్మాత సురేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.

'సిరివెన్నెల' ఆడియో వేడుకలో వైవీఎస్ చౌదరి, రాజేంద్రప్రసాద్, కీరవాణి, కె.రాఘవేంద్రరావు, ప్రియమణి...

ఇక్కడ దీపిక.. అక్కడ మెరిల్

దక్షిణాదిలో కథానాయికగా మంచి పేరు సంపాదించుకు న్నారు తమన్నా. సౌత్‌లో ఫుల్ బిజీగా ఉన్న ఈ బ్యూటీ ఇటీ వల హిందీలో ఓ సినిమాకు సంతకం చేసిన విషయం తెలి సిందే. ఇందులో నవాజుద్దీన్ సిద్ధిఖీ హీరోగా నటించనున్నారు. కాగా బాలీవుడ్‌లో ఏ హీరోయిన్ వర్కింగ్ స్టైల్ అంటే ఇష్టం? అనే ప్రశ్నను తమన్నా ముందు ఉంచితే...''దీపికా పదుకోన్ వర్కింగ్ స్టైల్ అంటే చాలా ఇష్టం. ఆమె కళ్లు చాలా అందంగా ఉంటాయి. ప్రయోగాత్మక చిత్రాలను చేయడానికి ఇష్టపడుతుంటారామె'' అన్నారు. మరి హాలీవుడ్‌లో? అంటే ''ప్రముఖ నటి మెరిల్ స్ట్రిప్స్ అంటే విపరీతమైన అభిమానం. ప్రతి పాత్రలోనూ వైవిధ్యం చూపిస్తా రామె. డెబ్బై ఏళ్ల వయసులో కూడా ఏ పాత్రలో అయినా ఇట్టే ఒదిగిపోగలరు'' అని పేర్కొ న్నారు. ప్రస్తుతం తమిళంలో 'పెట్రోమా క్స్' సినిమాతో బిజీగా ఉన్న తమన్నా తెలుగులో 'దటీజ్ మహాలక్ష్మి, సైరా: నరసింహారెడ్డి' సిని మాలను పూర్తి చేశారు.

తమన్నా

కొత్త కథల్ని ఆదరిస్తున్నారు

''వైకుంఠపాళి' చిత్ర నిర్మాత ఆదినారాయ ణకు సినిమాలంటే ప్యాషన్. ఆయన ఆలో చనలు విభిన్నంగా ఉంటాయి. ఈ సినిమా టైటిల్, ట్రైలర్ కొత్తగా ఉన్నాయి. ప్రేక్షకులు కొత్త కథలను ఆదరి స్తోన్న ఈ తరుణంలో ఈ సినిమా కూడా సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని ప్రముఖ నిర్మాత కె.యస్. రామారావు అన్నారు. సాయికేతన్, మేరి జంటగా అజ్గర్ అలీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వైకుంఠపాళి'. ఎస్‌కెఎమ్‌యల్ పతాకంపై కాండ్రేగుల ఆదినారాయణ నిర్మిస్తోన్న ఈ సినిమా పాటలను కె.యస్. రామారావు విడుదల చేశారు. దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ– ''వైకుంఠ పాళి' అందరికీ బాగా తెలిసిన ఆట. అలాంటి గేమ్‌తో హారర్ సినిమా చేయడం మంచి ఆలోచన. కాన్సెప్ట్ ఓరియంటెడ్ చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తోన్న ఈ సమయంలో ఇలాంటి ప్రయత్నం చేసిన దర్శక–నిర్మాతలకు అభినందనలు'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో తీసిన చిత్రమిది. అందరికీ నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నాం. ఆది నారాయణగారిలాంటి నిర్మాతలు ఉంటే సినిమా విడుదల కోసం కష్టపడాల్సిన పనేలేదు'' అన్నారు అజ్గర్ అలీ. ''మంచి కథ ఉంటే చిన్న సినిమా, పెద్ద సినిమా అని చూడకుండా థియేటర్స్ ఇస్తున్నారు. మా సినిమా బిజినెస్ ఇప్పటికే పూర్తి అయింది. త్వరలో సినిమాని విడుదల చేస్తున్నాం. మా బ్యాన ర్‌లో ప్రొడక్షన్ నెంబర్ 5గా హరీష్ కుమార్ ముక్కి దర్శకత్వంలో 'మిస్టర్ లోన్లీ' ('వీడి చుట్టూ అమ్మా యిలే' అన్నది ఉపశీర్షిక) షూటింగ్ త్వరలో ప్రారం భించబోతున్నాం'' అన్నారు కాండ్రేగుల ఆదినారా యణ. ఈ కార్యక్రమంలో దర్శకుడు వీరశంకర్, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సురేష్ కొండేటి, సాయి వెంకట్, సంగీత దర్శకుడు ప్రమోద్, సాయి కేతన్, హీరోయిన్స్ ప్రియా వల్లభి, నీలమ్ నైనా తదితరులు పాల్గొన్నారు.

ప్రియా వల్లభి, సాయికేతన్, నీలమ్

భార్య కంటే కత్తి మంచిది

'ఏడుచేపల కథ' చిత్రంలో టెంప్ట్ రవిగా క్రేజ్ సంపాదిం చుకున్న అభిషేక్ రెడ్డి, గుంజన్ జంటగా నటిం చిన చిత్రం 'వైఫ్,ఐ'. 'నైఫ్ బెటర్ దెన్ వైఫ్' (భార్య కంటే కత్తి మంచిది) అన్నది ఉపశీర్షిక. 'అంతం' ఫేమ్ జి.ఎస్.ఎస్.పి.కల్యాణ్ దర్శ కత్వంలో లక్ష్మి చరిత ఆర్ట్స్– జిఎస్ఎస్‌పికె స్టూడియోస్ పతాకాలపై జి.చరితా రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి అయింది. జి.ఎస్.ఎస్.పి కల్యాణ్ మాట్లాడుతూ– ''నా గత చిత్రం 'అంతం' కమర్షియల్‌గా చాలా మంచి విజయాన్ని సాధించింది. మంచి కథ కోసమే ఇన్ని రోజులు ఆగాల్సి వచ్చింది. సమాజంలో జరుగుతున్న ఒక మంచి పాయింట్‌ని 'వైఫ్, ఐ' చిత్రంలో చాలా వినోదాత్మకంగా చూపించాం. భార్యాభర్తల మధ్య ఉండే అన్ని బంధాలు ఇందులో ఉంటాయి. రొమాం టిక్ కామెడీగా తెరకెక్కిన మా చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కి చాలా మంచి స్పందన వచ్చింది. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలువుతాయి'' అన్నారు. జి.చరితా రెడ్డి మాట్లా డుతూ– ''కల్యాణ్ చెప్పిన కథ విన్నవెంటనే ఓకే చేశాను. ఎందుకంటే.. ఇలాంటి కథలు ఈ జెనరేషన్ లోనే రావాలి. భార్యాభర్తల మధ్య ప్రేమ పోయి అసూయ పెరుగుతోంది.. వైవాహిక జీవితాలు నాశనం అయిపోతున్నాయి. వీటికి కారణం ఏంటని తెలుసుకోలేకపోతున్నారు. మా చిత్రంలో ఆ విషయాన్నే ప్రస్తావించాం. ప్రతి మనిషీ తప్పులు చేస్తారు.. ఆ తప్పు ఏంటో తెలుసుకున్న నాడు ఎలాంటి సమస్యకై నా పరిష్కారం ఉంటుందని చూపిస్తున్నాం'' అన్నారు. కావ్య, సునీల్ నగరం, సూర్య ఆకోండి, మహేష్ విట్ట, అపర్ణ నటించిన ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య.

గుంజన్, అభిషేక్

అభయ్ డియోల్

హీరోకి విలన్ దొరికాడు

'2.ఓ' సినిమాలో అక్షయ్‌కుమార్, 'పేట'లో నవాజుద్దీన్ సిద్ధిఖీ విలన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా ఈ జాబితాలోకి చేరిపోయారు బాలీవుడ్ నటుడు అభయ్ డియోల్. 'అభిమన్యుడు' ఫేమ్ పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా తమిళంలో 'హీరో' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో విలన్‌గా నటించనున్నారు అభయ్ డియోల్. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిం చింది. కల్యాణీ ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

పరేశ్ రావల్

తమిళంలో తొలిసారి

డాక్టర్ లింగం మావయ్యగా 'శంకర్ దాదా' సిరీస్‌లో కామెడీ పండించారు బాలీవుడ్ నటుడు పరేశ్ రావల్. ఇప్పుడు తమిళంలో తన విలనీ సైడ్ చూపించడానికి రెడీ అయ్యారని తెలిసింది. సూర్య హీరోగా 'గురు' దర్శకురాలు సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సూరరై పోట్రు'. మోహన్‌బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో పరేశ్ రావల్ విలన్‌గా నటించనున్నారని టాక్. ఇది ఆయనకు తొలి తమిళ చిత్రం అవుతుంది. ఆర్మీ కెప్టెన్, ఎయిర్ డెక్కన్ వ్యవస్థాపకుడు జీఆర్ గోపీనాథ్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకె క్కుతోందని తెలిసింది. సూర్య ఈ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు నిర్మిస్తున్నారు కూడా. హాలీవుడ్ కొరియోగ్రాఫర్ గ్రెగ్ పొవెల్ ఈ సినిమాకు ఫైట్స్ కంపోజ్ చేస్తున్నారు.

జాక్వెలిన్ ఫెర్నాండెజ్

ఆలియా బాటలో జాక్వెలిన్

సొంత యూ ట్యూబ్ చానెల్స్‌ను స్టార్ట్ చేసి ఆడియన్స్ ఫాలోయింగ్ పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లున్నారు బాలీవుడ్ భామలు. ఇటీవల స్టార్ హీరోయిన్ ఆలియాభట్ తన సొంత యూ ట్యూబ్ చానెల్‌ను స్టార్ట్ చేసి, తన ప్రొఫెషనల్ అండ్ పర్సనల్ విషయాలను షేర్ చేసుకుంటున్నారు. ఇప్పుడు మరో బీటౌన్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ కూడా యూ ట్యూబ్ చానెల్‌ను షురూ చేశారు. ''బాలీవు డ్‌లో నా జర్నీలో భాగంగా నేర్చుకున్న కొత్త విషయాలను నా యూ ట్యూబ్ చానెల్‌లో పంచుకుంటాను. ముఖ్యంగా ఫిట్‌నెస్, బ్యూటిప్స్ విషయాలను కూడా చెప్పాలనుకుం టున్నా. ఇండస్ట్రీలో నాకు మంచి స్నేహితులు ఉన్నారు. వారితో వారికి చెందిన ఇన్‌స్పిరింగ్ స్టోరీస్‌ను చెప్పించాలనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు జాక్వెలిన్ ఫెర్నాండెజ్.

పరిచయం ఐశ్వర్యా తిప్నిస్

రోజుకు ఇరవై నాలుగ్గంటలు
ఏడాదికి మూడు వందల అరవై ఐదు రోజులు
ఏళ్లకు ఏళ్లు బరువు మోసిన అలసిన స్తంభాలు
కత్తి యుద్ధాలు... ఫిరంగి దాడులతో...
నెత్తురోడిన గోడలు... ఇంకే ఘోరాలు చూడాల్సి
వస్తుందోనని భయపడే పైకప్పులు నేలకు వాలి
మట్టిలో కలిసిపోవడానికి సిద్ధమవుతుంటాయి.
అదే జరిగితే... వాటిని అలాగే వదిలేస్తే...
'ఇదీ మా గొప్పతనం' ఏమి చూపించాలి?
భవిష్యత్తు తరాలకు...
మన ముఖం ఎలా చూపించాలి?
అందుకే వాటిని పునరుద్ధరిస్తోంది ఐశ్వర్య
వందల ఏళ్ల నాటి కట్టడాలకు...
కొత్తగా పాతరూపుని తెస్తోంది.
మన భవన నిర్మాణ కౌశలాన్ని పరిరక్షిస్తోంది.
వారసత్వ కట్టడాల వైభవాన్ని పునరుద్ధరిస్తోంది.

● మాహిద్‌పూర్ కోట దర్వాజా దగ్గర ఐశ్వర్య

వైభవోద్ధరణ

'ఇల్లు కట్టి చూడు– పెళ్లి చేసి చూడు' అనే నానుడి ఎందుకొచ్చి ఉంటుంది? ఇల్లు కట్టడం, పెళ్లి చేయడం రెండూ అత్యంత కష్టమైన పనులు కాబట్టి. ఇప్పుడీ పనులన్నీ వ్యవస్థీకృతమైపోయాయి. పెళ్లి చేయాలంటే ఏ వస్తువు ఎక్కడ దొరుకుతుందోననే బెంగ అక్కర్లేదు, పూల మండపం ఎవరు బాగా కడతారని ఆరాలు తీసే పనీ లేదు. మంగళవాయిద్యాల బృందం ఎక్కడ దొరుకుతుందోనని చూడాల్సిన పనీ లేదు. మంచి వంటవాళ్లు ఎవరోనని వాకబు చేయాల్సిన పని అంతకంటే లేదు. ఈ పనులన్నీ ఈవెంట్ నిర్వహకులు చేసి పెట్టేస్తున్నారు. అలాగే ఇల్లు కట్టాలన్నా సరే... స్థలం చూపించి మనకు కావాల్సిన స్పెసిఫికేషన్స్ జాబితా ఇచ్చి, ఇంత మొత్తం అని వాళ్ల చేతిలో పెడితే ఇల్లు రెడీ అయిపోతోంది. ఇంటి వారు చేయాల్సింది గృహ ప్రవేశం ఒక్కటే. కొత్త ఇల్లు కట్టడం ఓకే, మరి... ఎప్పుడో కట్టిన ఇంటిని తిరిగి కట్టాల్సి వస్తే? అది మాత్రం చిన్న పని కాదు, దాని కంటే కొత్త ఇల్లు కట్టుకోవడం చాలా సులభం. నిజమే, అలాగని ఉన్న ఇంటిని నేల కూల్చడానికి మనసంగీకరిస్తుందా? చూసే వారికి ఆ ఇల్లు కేవలం గోడలు, కిటికీలు, పైకప్పు మాత్రమే కావచ్చు... ఆ గోడలతో మనకు కొన్ని జ్ఞాపకాలు అల్లుకుని ఉంటాయి. అమ్మ కిటికీలో నిలబెట్టి గోరుముద్దలు తినిపిస్తుంటే... ఆకాశంలో చందమామను చూస్తూ కిటికీ చువ్వలు పట్టుకుని ఊగిన బాల్యం గుర్తుకు వస్తుంది. ఆ ఇంటిని కట్టిన తాతయ్య కళ్ల ముందు మెదలుతాడు. 'నువ్వు కట్టిన ఈ ఇంటిని నా కంఠంలో ప్రాణం ఉండగా కూల్చను తాతయ్యా, దీనికి మరమ్మత్తులు చేసి ఆధునిక సౌకర్యాలతో నా పిల్లలకు అనువుగా మలుచుకుంటాను' అని తాతయ్య ఫొటో ముందు మాట ఇచ్చేస్తాం. ఇచ్చిన మాట ప్రకారం పాత ఇంటిని పునరుద్ధరించే పనిలో పడతాం. చూసిన వాళ్లు 'ఇంత కష్టపడడం ఎందుకు? కొత్త ఇల్లు కట్టుకోవచ్చు' అని మాతి విరిచినా సరే... ఆ విరుపులేమాత్రమూ బాధించవు. సరి కదా... పాత గోడలను తాకినప్పుడు మనల్ని తడిమే జ్ఞాపకాలు మనల్ని ఉయ్యాలలూగిస్తాయి. ఇంటితో ఉండే అనుబంధం అంత గట్టిది. మరి మన పెద్ద వాళ్లు మనకోసం మిగిల్చిన జ్ఞాపకాల సంపద వందల ఏళ్ల నాటి చారిత్రక కట్టడమైతే? ఎవరెన్ని అన్నా సరే, తప్పని సరిగా పరిరక్షించుకోవాల్సిందే. ఆ కట్టడం అందులో నివసించే వాళ్లకు మాత్రమే కాదు, దేశానికి కూడా అది జ్ఞాపకాల సంపదే. ఢిల్లీలోని సేత్ రామ్ లాల్ ఖేమ్‌కా హవేలీలో నివసిస్తున్న దేవకీ నందన్, నేహా దంపతులు కూడా అలాగే అనుకున్నారు. దేవకీ నందన్‌కి ఢిల్లీ, కశ్మీరీ గేట్ సమీపంలో ఉన్న హవేలీ 175 ఏళ్ల నాటి కట్టడం. మొఘలుల కాలం నాటి నిర్మాణం. ఆ హవేలీకి మరమ్మత్తులు చేసుకున్నారు, అప్పుడు ఎలా కట్టారో అచ్చం అలాగే మళ్లీ కట్టారా అనిపించేటట్లు పునరుద్ధరించుకున్నారు. ఢిల్లీ చాందినీ చౌక్‌లోని ధరంపురా హవేలీ కూడా అలాంటిదే. ఈ రకంగా పాతనిర్మాణాలకు కొత్తదనం తెస్తున్న ఆర్కిటెక్ట్ ఐశ్వర్య తిప్నీస్.

మాహిద్‌పూర్ కోట

పాతతరం కట్టడాలను పరిరక్షిస్తున్న నవతరం ఆర్కిటెక్ట్ ఐశ్వర్యా తిప్నీస్. మధ్యప్రదేశ్‌లోని మాహిద్‌పూర్ కోట, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చదువుకున్న డెహ్రాడూన్ స్కూలు, కోల్‌కతా చందన్ నగర్‌లోని ఫ్రెంచ్ చర్చ్... ఇలా ప్రత్యేకమైన నిర్మాణకౌశలానికి ఆనవాళ్లుగా నిలిచిన కట్టడాలను పటిష్టపరిచారామె. మాహిద్‌పూర్ కోట ఉజ్జయిని జిల్లాలో ఉజ్జయిని పట్టణానికి 50 కి.మీ.ల దూరాన ఉంది. మధ్య యుగం నాటి ఈ నిర్మాణానికి గొప్ప చారిత్రక నేపథ్యం ఉంది. ఈస్టిండియా కంపెనీకి మరాఠా సమాఖ్యకు మధ్య 1817లో భీకరమైన యుద్ధం జరిగింది. ఈ యుద్ధాన్ని మాహిద్‌పూర్ యుద్ధం అంటారు. ఆ యుద్ధంలో స్థానిక హోల్కర్ రాజులు, యువరాజుల నుంచి సామాన్యుల వరకు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఆ యుద్ధంలో కోట దాదాపుగా ధ్వంసమైందనే చెప్పాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత చాలాకాలం భారత ప్రభుత్వం కోటల నిర్వహణ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడంతో నిర్మాణాలు మరింతగా శిథిలం కాసాగాయి. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ సర్వే రిపోర్టుల ఆధారంగా చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకునే పని మొదలైంది. అంతటి కీలకమైన, అత్యంత సంక్లిష్టమైన పనిని చేపట్టిన ఆర్కిటెక్ట్ ఐశ్వర్య. దేశంలో పేరు మోసిన ఆర్కిటెక్టుల్లో ఎక్కువ మంది మగవాళ్లే ఉన్నారు. ఓ ఇరవై ఏళ్లుగా అమ్మాయిలు ఎక్కువ మంది ఆర్కిటెక్చర్ కోర్సు చేస్తున్నారు. అయితే వాళ్లలో ఎక్కువ మంది సీనియర్ ఆర్కిటెక్ట్ దగ్గర సహాయకులుగానే ఉంటున్నారు. కొంతమంది సొంతంగా కెరీర్‌లో నిలదొక్కుకున్నప్పటికీ ఇంత భారీ స్థాయి కోటల పునరుద్ధరణ బాధ్యత తలకెత్తుకున్నది ఐశ్వర్య మాత్రమే.

మన సంప్రదాయమే

ఐశ్వర్య 'న్యూ ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్' స్టూడెంట్. గ్రాడ్యుయేషన్ 2003లో పూర్తయింది, తర్వాత స్కాట్లాండ్‌లోని డూండీ యూనివర్సిటీ నుంచి 'యూరోపియన్ అర్బన్ కన్జర్వేషన్'లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ఇప్పుడామె సొంత సంస్థ నిర్వహిస్తూ (ఐశ్వర్య తిప్నీస్ ఆర్కిటెక్ట్స్) ఆమె చదివిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారసత్వ కట్టడాల పునరుద్ధరణ ఆమెకు ఇష్టమైన వ్యాపకం. 'ఆ ఇష్టమే ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టడానికి దారి తీసింది' అంటారు ఐశ్వర్య. ''పరిరక్షణ అనేది మనకు తెలియని విద్యేమీ కాదు. ఒక వస్తువుని పరిరక్షించడం అనేది మన భారతీయ సంప్రదాయంలోనే ఉంది. యూజ్ అండ్ త్రో విధానం మనది కాదు. ఒక వస్తువుని ఎన్ని రకాలుగా వాడవచ్చో అన్ని రకాలుగా మలుచుకుంటూ ఉపయోగిస్తాం. దానినే ఇప్పుడు 'గోయింగ్ గ్రీన్ అని, సస్టెయినబులిటీ' అనీ అంటున్నాం. భవననిర్మాణ రూపకల్పనను వృత్తిగా ఎంచుకోవడం వరకే నా చాయిస్. ఆ తర్వాత నా ఇష్టం ఎటువైపు తీసుకెళ్తే అటు సాగింది నా ప్రయాణం. మన సంప్రదాయ నిర్మాణాలు, చారిత్రక కట్టడాల మీద నాకున్న ఇష్టమే... వాటిని పరిరక్షించడాన్ని కెరీర్‌గా తీసుకునేలా ప్రభావితం చేసింది'' అన్నారామె. ఐశ్వర్య హెరిటేజ్ కన్జర్వేషన్ ఆర్కిటెక్చర్‌లో తాను అధ్యయనం చేసిన అంశాలను వార్తా పత్రికల్లో వ్యాసాలు రాస్తుంటారు. 'వెర్నాక్యులర్ ట్రెడిషన్, కాంటెంపరరీ ఆర్కిటెక్చర్' అనే పుస్తకం కూడా రాశారు.

కోటల కంటే ఇల్లే కష్టం

కోటలకు మరమ్మత్తులు చేసి పటిష్టపరచడం కష్టం అనుకుంటాం. కానీ ఇళ్లను పరిరక్షించడమే కష్టమైన పని అంటారు ఐశ్వర్య. ''కోటల ఒరిజినల్ డిజైన్‌కు అనుగుణంగా పని చేస్తే సరిపోతుంది. అప్పుడు వాడిన లైమ్, సాండ్ స్టోన్‌ల స్థానంలో అదే లుక్ తీసుకురావడానికి కొంత వరకు ప్రత్యామ్నాయాలను కూడా వాడవచ్చు. ఇళ్లను పునరుద్ధరించేటప్పుడు ఏ మాత్రం రాజీ పడడానికి వీల్లేదు. ఉదాహరణకు ఆ భవనం కట్టినప్పుడు కిటికీలకు రంగు అద్దాలను వాడినట్లయితే ఇప్పుడా డిజైన్, షేడ్ కోసం మార్కెట్‌లు గాలించాల్సిందే. మోడల్ అద్దాన్ని పట్టుకుని నెలలపాటు గాలించిన సందర్భాలూ ఉన్నాయి. దానికి తోడు ఆ ఇంట్లో నివసిస్తున్న వాళ్లు ఇప్పటి అవసరాలకు అనుగుణంగా వాళ్లంతట వాళ్లే కొన్ని మార్పులు చేసుకుని ఉంటారు. గ్రైండర్, ఫ్రిజ్, ఏసీ, కంప్యూటర్ వంటి ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల కోసం టెంపరరీ వైరింగ్ చేసుకుని ఉంటారు. కొన్ని వైర్లు బయటకు వేళ్లాడుతూ ఉంటాయి. ఈ ఇరవై ఒకటో శతాబ్దపు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇంటీరియర్ అంతా రీ డిజైన్ చేయాల్సి ఉంటుంది. అటాచ్‌డ్ టాయిలెట్, క్లోజెట్, మాడ్యులార్ కిచెన్‌తో ఇంటికి మోడరన్ టచ్ ఇవ్వాలి. అదే సమయంలో ఆ భవనం నిర్మాణ కాలం నాటి మనోహరరూపాన్ని కాపాడాలి. నమ్ముతారో లేదో కానీ మాకు మాహిద్‌కోట పునరుద్ధరణకు మూడేళ్లు పడితే సేత్ రామ్ లాల్ ఖేమ్‌కా హవేలీకి దాదాపుగా ఎనిమిదేళ్లు పట్టింది. ఒకటే ప్రాజెక్టు మీద అన్నేసి సంవత్సరాలు పని చేయాలంటే చాలా ఓపిక ఉండాలంటా''రామె. తన విజయ రహస్యం గురించి చెబుతూ... ''ఆర్కిటెక్ట్ మిత్రులు... ఒక్కో ప్రాజెక్ట్ కోసం ఇన్నేసి సంవత్సరాలు గడపాలంటే బోర్ అంటారు. చిన్నప్పుడు చదువుకున్న 'కుందేలు– తాబేలు' కథలోని తాబేలు గెలుపే నాకు స్ఫూర్తి. ఎన్ని ప్రాజెక్టులు చేశాననే సంఖ్య కంటే ఎంతమంచి ప్రాజెక్టులు చేశాననే సంతృప్తే నాకు ముఖ్యం'' అన్నారు ఐశ్వర్య తిప్నీస్ సంతోషంగా.

– మంజీర

పునరుద్ధరణ ఓ ఉద్యమం

చందన్ నగర్ పట్టణం కోల్‌కతాకు దగ్గరగా ఉంటుంది. అక్కడ ఫ్రెంచ్ కాలనీ ఉంది. ఫ్రెంచ్ వాస్తుశైలి భవనాలు వంద వరకున్నాయి. అవన్నీ వారసత్వంగా కాపాడుకోవాల్సిన నిర్మాణాలే. అయితే వాటి గొప్పతనం పట్ల స్థానికులకు పెద్దగా పట్టింపు లేదు. స్థానిక యువతను చైతన్యవంతం చేయడంతోపాటు వారసత్వ కట్టడాల మీద ఆసక్తి ఉన్న యువ ఆర్కిటెక్ట్‌లను సమీకరించి, వారందరి సహకారంతో ప్రాజెక్ట్ పూర్తి చేయగలిగాను. నిజానికి అదొక సోషల్ మూవ్‌మెంట్ అనాలి. అంత ప్రయాస పడిన తర్వాత మాత్రమే ఆ పట్టణానికి ఉన్న చారిత్రక నిర్మాణ నైపుణ్యాన్ని తిరిగి తీసుకురాగలిగాను. గత ఏడాది జనవరిలో ఫ్రెంచ్ అంబాసిడర్ అలెగ్జాండ్రె జిగ్లర్ నుంచి అవుట్ స్టాండింగ్ కమిట్‌మెట్ అవార్డు అందుకున్నాను. ఇది ఫ్రెంచ్‌లో కళ, సాంస్కృతిక రంగాలకు ఇచ్చే అత్యున్నత పురస్కారం. ఇండియాలో ఉన్న ఫ్రెంచ్ వారసత్వ కట్టడాలను పునరుద్ధరించినందుకు ఈ అవార్డు వచ్చింది. డెహ్రాడూన్‌లోని డూన్ స్కూల్ పునరుద్ధరణను పూర్తి చేసినందుకు యునెస్కో నుంచి ప్రశంసాపత్రం అందుకోవడం కూడా నాకు అత్యంత సంతోషకరమైన సందర్భమే అయితే నేను చేపట్టిన నిర్మాణ పునరుద్ధరణ పనులన్నీ ఏ ఒక్కరిద్దరితోనో పూర్తయ్యేవి కావు, సమష్టి కృషితోపాటు అందరిలో నాకున్నంతటి పట్టుదల లేకపోతే సాధ్యమయ్యే పనులు కానే కాదు. అందుకే ఏ పురస్కారమైనా నా టీమ్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ చెందుతుంది.

– ఐశ్వర్య తిప్నీస్, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్

● చందన్ నగర్‌లోని ఫ్రెంచ్ చర్చ్

● సేత్ రామ్ లాల్ ఖేమ్‌కా హవేలీలో దేవకీ నందన్, నేహా దంపతులు

పరి పరిశోధన

ఇక ద్రవాలూ అయస్కాంతాలే!

అయస్కాంతం అన్న పేరు వినగానే మన మనసుల్లో మెదిలేది ఇనుము లాంటి లోహమే. సూక్ష్మస్థాయి ఇనుము రజను (ఫెర్రోఫ్లూయిడ్స్) చూసేందుకు ద్రవంలా కనిపించినా.. దీని అయస్కాంత ప్రభావం తాత్కాలికం. అయితే లారెన్స్ బెర్క్‌లీ నేషనల్ లేబొరేటరీ శాస్త్రవేత్తల పరిశోధనల పుణ్యమా అని ఇకపై ద్రవరూపంలో శాశ్వత అయస్కాంతాలు అందుబాటులోకి రానున్నాయి. అయితే ఏంటి? అంటున్నారా. ఎల



క్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగాల్లో చాలా ప్రయోజనాలే ఉన్నాయి. ఫెర్రోఫ్లూయిడ్స్ 1960ల నుంచి ప్రత్యేకమైన స్పీకర్లు, గడియారాల్లో వాడారు. దాదాపు మిల్లీమీటర్ సైజున్న ఫెర్రోఫ్లూయిడ్స్‌ను త్రీడీ ప్రింటింగ్ ద్వారా తయారు చేయడం ద్వారా తాము శాశ్వత ద్రవ అయస్కాంతాన్ని తయారు చేశామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త టామ్ రస్సెల్ తెలిపారు. వీటిని ఇంకో ద్రవంలో వేలాడదీసినప్పుడు ఫెర్రోఫ్లూయిడ్స్‌లోని నానోస్థాయి కణాలు అంచుల్లో గుమికూడుతున్నట్లు గుర్తించారు. ఈ దశలో వాటిపై అయస్కాంత తీగల చుట్టను దగ్గరకు తీసుకొచ్చినప్పుడు ఫెర్రోఫ్లూయిడ్స్ కూడా చైతన్యవంతమయ్యాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అయస్కాంత తీగ చుట్టను తొలగించిన తరువాత కూడా ఫెర్రోఫ్లూయిడ్స్ తమ అయస్కాంతత్వాన్ని కోల్పోకుండా ఉండటం. ఈ ప్రయోగంలో నీటి బొట్టు చందంగా ఉన్న ఫెర్రోఫ్లూయిడ్స్‌ను ఇతర ఆకారాల్లోనూ తయారు చేసే అవకాశమున్నందున వాటితో శరీరం లోపలి భాగాల్లోకి మందులు సరఫరా చేయగల వ్యవస్థలను అభివృద్ధి చేయవచ్చునని టామ్ తెలిపారు.

❁❁❁❁

కీళ్ల కదలికలతోనూ విద్యుత్తు...

మనం నడుస్తూంటే.. కీళ్లు కూడా కదులుతూంటాయి. మరి ఈ కదలికలను కాస్తా విద్యుదుత్పత్తికి వాడుకునేలా చైనీస్ యూనివర్సిటీ ఆఫ్ హాంగ్‌కాంగ్ శాస్త్రవేత్తలు ఒక పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఒక్కో పరికరం ఉత్పత్తి చేసే 1.6 మైక్రోవాట్ల విద్యుత్తుతో జీపీఎస్ పరికరాలు, ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ఉపయోగించే పరికరాలను నడిపేందుకు ఉపయోగించుకోవచ్చునని అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్‌లో ప్రచు

రితమైన పరిశోధన వ్యాసం చెబుతోంది. ప్రత్యేకమైన మైక్రోఫైబర్ పదార్థంతో తయారైన ఈ పరికరాన్ని మోకాళ్ల వద్ద బిగించుకోవాల్సి ఉంటుందని... శరీరంలోని ఇతర కీళ్ల కంటే మోకాలి కీలు ద్వారా ఎక్కువ కదలికలు ఉంటుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త లియావ్ తెలిపారు. మనిషి కదలికల ద్వారా పుట్టే కంపనాలు చాలా నెమ్మదిగా ఉంటాయని ఫలితంగా విద్యుదుత్పత్తి చేయడం కష్టమవుతుందని.. తాము మాత్రం ఈ సమస్యను అధిగమించేందుకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నామని లియావ్ వివరించారు. ప్రస్తుతం తాము అభివృద్ధి చేసిన యంత్రం దాదాపు 307 గ్రాముల బరువు ఉందని, గంటకు రెండు నుంచి 6.5 కిలోమీటర్ల వేగంతో నడిచే మనుషులపై తాము ఈ యంత్రాన్ని పరిక్షించి చూశామని వివరించారు. యంత్రం ధరించినప్పుడు, సాధారణ పరిస్థితుల్లో వీరి ఉచ్ఛ్వాస నిశ్వాసలను పరిశీలించిన తరువాత యంత్రాన్ని మోసేందుకు ఉపయోగిస్తున్న శక్తి కంటే విద్యుదుత్పత్తి ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందని వివరించారు.

● వాక్ ఫ్యాక్ట్స్

గర్భవతులకు నడక మంచి వ్యాయామం!

స్వాభావిక ప్రసవం (నాచురల్ డెలివరీ) కోసం అందరూ తాపత్రయపడతారు. మంచి శారీరక వ్యాయామం ఉన్నవారికి నాచురల్ డెలివరీ అయ్యే అవకాశం ఉందని అనేక అధ్యయనాలు తేల్చాయి. వాకింగ్ వల తుంటి కండరాల్లో సాగే గుణం పెరుగుతుంది. ఈ అంశమే వారిలో సుఖంగా ప్రసవం అయ్యేందుకు దోహదపడుతుంది. అయితే గర్భవతులకు నడక చాలా మంచి వ్యాయామం అంటున్నారు నిపుణులు. గర్భం ధరించి ఉన్న మహిళలు వాకింగ్ చేయడం అంత మంచిది కాదనే అభిప్రాయం కొందరిలో ఉంటుంది. ఇది కేవలం అపోహ మాత్రమే. గర్భవతులకు వాకింగ్ కంటే మంచి వ్యాయామం మరొకటి లేనే లేదు.

ఒక మహిళ తాను గర్భం దాల్చడానికి ముందు ఉన్న ఫిట్‌నెస్‌ను బట్టి తానెంత దూరం హాయిగా, శ్రమలేకుండా నడవగలన్న అంశాన్ని నిర్ణయించుకొని ఆ మేరకు నడవవచ్చు. ఇలా గర్భం దాల్చి ఉన్నప్పుడు నడక కొనసాగించడం అటు తల్లికీ, ఇటు కడుపులోని బిడ్డకూ ఇరువురికీ మంచిది. అయితే గర్భవతులు నడక వ్యాయామాన్ని కొనసాగించాలనుకున్నప్పుడు ఒకసారి తమ డాక్టర్‌ను సంప్రదించి, తన ఫిట్‌నెస్ ఎంత, ఎంతసేపు నడవాలి అనే అంశాలను తెలుసుకున్న తర్వాతే నడక కొనసాగించడం మంచిది. కాబోయే తల్లికీ, బిడ్డకూ నడక ఎంత మేలు చేస్తుందో తెలుసుకోండి.

● కాబోయే తల్లి నడక వ్యాయామాన్ని కొనసాగించడం వల్ల కడుపులోని బిడ్డ బరువు ఆరోగ్యకరమైన విధంగా పెరుగుతుంది. ప్రసవం సమయానికి ఎంత బరువు ఉండాలో అంతకు చేరుతుంది. అంతేకాదు... స్వాభావికమైన ప్రసవం (నేచురల్ డెలివరీ) అయ్యేందుకు నడక దోహదం చేస్తుంది.

● నడక వల్ల కాబోయే తల్లి బరువు అదుపులో ఉండటమే కాకుండా... ఆ సమయంలో సాధారణంగా మహిళల్లో కనిపించే జెస్టేషనల్ డయాబెటిస్‌ను నడక నివారిస్తుంది.

● గర్భవతుల్లో ఒత్తిడి అనేది చాలా సాధారణంగా కనిపించే అంశం. అన్ని వ్యాయామాల్లో లాగే నడక వల్ల కూడా ఒంట్లో ఆరోగ్యకరమైన ఎండార్ఫిన్లు, సంతోషాన్ని కలిగించే రసాయనాలు వెలువడి గర్భవతుల్లో ఒత్తిడిని తొలగించడంతో పాటు వారిని మరింత హాయిగా సంతోషంగా ఉండేలా చూస్తాయి.

● వాకింగ్ వల్ల వేవిళ్ల సయంలో కనిపించే వికారం తగ్గుతుంది. అలసట, కండరాలు పట్టేయడం (క్రాంప్స్) తగ్గుతాయి. మలబద్ధకం రాదు. వేరికోస్ వెయిన్స్ వచ్చే అవకాశాలు నివారితమవుతాయి. గర్భవతుల్లో సహజంగా కనిపించే రాత్రివేళ నిద్రపట్టకపోవడం అనే లక్షణం నివారితమై, కంటినిండా నిద్రపడుతుంది.

కాస్మటాలజి కౌన్సెలింగ్

వర్షా కాలంలో జుట్టు పొడి బారుతోంది...

నా జుట్టు బాగా పొడవుగా ఉంటుంది. అయితే ప్రతి ఏడాది వర్షాకాలం రాగానే అది బాగా పొడిబారిపోతోంది. చుండ్రు వల్ల తలంతా దురదగా కూడా ఉంటోంది. వర్షాకాలంలో కూడా నా జుట్టు బాగుండాలంటే ఏం చేయాలో దయచేసి సూచించండి.

– ఎమ్. ఉదయలక్ష్మి, కాకినాడ

మీ జుట్టు పొడిబారడం అనే సమస్యకు మీ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మీరు జుట్టుకు రోజువారీ వాడే ఉత్పాదనలు (హెయిర్ ప్రొడక్ట్స్) వంటి అంశాలు కారణమవుతాయి. మీరు రోజూ తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, ఐరన్ పాళ్లు తగ్గడం వల్ల జుట్టు పొడిబారే ప్రమాదం ఉంది. అలాగే వాతావరణంలో తేమ తగ్గినప్పుడు కూడా జుట్టు పొడిబారుతుంది. అంతేకాదు... అది తేలిగ్గా విరిగిపోయేలా (బ్రిటిల్‌గా) కూడా మారుతుంది. ఇలా అనేక అంశాలు మీ సమస్యకు కారణమవుతుంటాయి. మీ విషయానికి వస్తే మొదట మీరు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు మీ జీవనశైలిని ఆరోగ్యకరమైన రీతిలో మార్పులు చేసుకోవడం, ప్రోటీన్, ఐరన్ పుష్కలంగా దొరికేలా మీ ఆహారంలో మార్పులు చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేగాక మీరు మెడికేటెడ్ షాంపూ వాడటం మంచిది. మీ మాడు (స్కాల్ప్)తో పాటు మీ జుట్టు కండిషన్‌ను బట్టి మీరు వాడాల్సిన షాంపూను సూచించడం జరుగుతుంది. మీకు చుండ్రు కూడా ఉందంటున్నారు కాబట్టి... డాక్టర్ సూచించిన యాంటీడాండ్రఫ్ లోషన్ కూడా వాడాల్సి ఉంటుంది. చుండ్రుకు చికిత్స చేయకపోతే జుట్టు రాలిపోవడం అనే సమస్య అదేపనిగా కొనసాగుతూనే ఉంటుంది. అందుకే పైన సూచించిన జాగ్రత్తలు పాటించడంతో పాటు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించండి.

చర్మం పొడిబారకుండా ఉండాలంటే...?

నాది బాగా పొడి చర్మం. నా చర్మం గురించి నేను చాలా శ్రద్ధ తీసుకుంటాను. కొద్ది రోజుల్లో నేను పైచదువుల కోసం కెనడాకు వెళ్లబోతున్నాను. అక్కడి వాతావరణానికి నా చర్మంలో ఎలాంటి మార్పులు వస్తాయో తెలియదు. నా చర్మం పాడవ్వకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– సునయన, హైదరాబాద్

కెనడా వంటిచోట్ల వాతావరణం బాగా చల్లగా ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మం మరింత పొడిబారిపోయే ప్రమాదం ఉంది. సాధారణ సబ్బులు చర్మాన్ని మరింత పొడిబారేలా చేస్తాయి. కాబట్టి మీరు స్నానానికి స్కిన్ పీహెచ్ బ్యాలెన్స్ చేసే మెడికేటెడ్ సబ్బును వాడటం మంచిది. అలాగే మీరు మెడికేటెడ్ మాయిశ్చరైజర్ వాడటం కూడా వాడాల్సి ఉంటుంది. దీనివల్ల మీ చర్మం ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో మీరు మీ చర్మసౌందర్యాన్ని కాపాడుకోవచ్చు.

అమ్మాయికి మొటిమలు వస్తున్నాయి

మా అమ్మాయి వయసు 15 ఏళ్లు. ఆమెకు మొటిమలు వస్తున్నాయి. అవి పెరగకుండా ఉండేందుకు ఏమైనా జాగ్రత్తలు ఉంటే చెప్పగలరు.

– పద్మ, నిజామాబాద్

టీనేజీలో హార్మోన్ల ప్రభావం వల్ల మొటిమలు రావడం చాలా సాధారణం. కానీ తగిన జాగ్రత్తలు తీసుకుంటే మొటిమల తీవ్రతను తగ్గించవచ్చు. మొదటగా... ముఖం కడుక్కోడానికి సబ్బు కాకుండా, నాన్ సోప్ బేస్‌డ్ క్లెన్సర్స్ వాడితే మంచిది. అలా చేయడం వల్ల చర్మం పీహెచ్ బ్యాలన్స్ అయ్యి, నూనె గ్రంథులు సరైన విధంగా పనిచేస్తాయి. ముఖం పైన ఏవైనా క్రీమ్స్‌గానీ లేదా ఇతర ఉత్పాదనలు (ప్రొడక్ట్స్)గానీ వాడే అలవాటు ఉంటే, అవి తప్పనిసరిగా నాన్–కామెడోజెనిక్ అని లేబుల్ చేసినవే వాడాలి. కొంతమందిలో హై గ్లైసిమిక్ ఇండెక్స్ (చక్కెరను తొందరగా విడుదల చేసే పిండిపదార్థాలు) కలిగిన పదార్థాలు తినడం వల్ల కూడా మొటిమలు ఎక్కువగా వస్తాయి. వాటికి దూరంగా ఉండటం లేదా వీలైనంత తక్కువగా తీసుకోవడం మంచిది. ఈ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మొటిమల తీవ్రతను చాలా వరకు తగ్గించవచ్చు. అంతేకాదు... వాటి కారణంగా వచ్చే మచ్చలు (స్కారింగ్), పిగ్మెంటేషన్‌ని కూడా అదుపు చేయవచ్చు.

చుండ్రు ఎందుకు వస్తుంది?

నా వయసు 30 ఏళ్లు. నాకు జుట్టు నుంచి చుండ్రు విపరీతంగా రాలుతోంది. దాంతో నలుగురిలోకి వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంటోంది. యాంటీ–డాండ్రఫ్ షాంపూలు వాడుతున్నప్పటికీ ప్రయోజనం కనబడటం లేదు. అసలు డాండ్రఫ్ ఎందుకు వస్తుంది? దాన్ని తగ్గించడం ఎలా?

– ప్రసాద్, సికింద్రాబాద్

చుండ్రు (డాండ్రఫ్) రావడానికి చాలా కారణాలు ఉంటాయి. సాధారణంగా చర్మంపై గల మలస్సేజియా అనే సూక్ష్మజీవి కారణంగా చర్మంపై రియాక్షన్ వచ్చి డాండ్రఫ్ వస్తుంటుంది. శరీరంలో నూనె గ్రంథులు (ఆయిల్ గ్లాండ్స్) ఎక్కువగా ఉండే చోట చుండ్రు ఎక్కువగా వస్తుంది. ఉదాహరణకు చర్మం (స్కాల్ప్), వీపు భాగం, ముఖం వంటి చోట్ల ఎక్కువగా వస్తుంటుంది. ఇలా శరీరం రియాక్ట్ అవ్వడానికి ఒత్తిడి (స్ట్రెస్), ఆహారపు అలవాట్లు, జీవనశైలి విధానాల వంటివి ముఖ్య కారణాలు. ఉప్పునీరు ఉపయోగించడం, కఠినమైన రసాయనాలు ఉన్న ఉత్పాదనలు వాడటం కూడా డాండ్రఫ్ పెరగడానికి కారణమవుతుంది. మీరు ఒకసారి డాక్టర్‌ను (చర్మవ్యాధి నిపుణులను) సంప్రదించండి. వారు మీకు తగిన / సరిపడే యాంటీ–ఫంగల్ లోషన్స్‌తో తగిన చికిత్సను సూచిస్తారు.

డాక్టర్ సుభాషిణి జయం, కన్సల్టెంట్ మెడికల్ కాస్మటాలజిస్ట్,
ఎన్‌ఛాంట్ మెడ

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

సోమవారం
22-7-2019

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ బఠిండాలో 199 పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), బఠిండాలో గ్రూప్ బీ, సీ పోస్టుల భర్తీకి పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, చండీగఢ్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టుల వివరాలు:
- నర్సింగ్ ఆఫీసర్ గ్రేడ్-2(గ్రూప్ బీ): 150
- లైబ్రరీ అటెండెంట్ గ్రేడ్-2(గ్రూప్ సీ): 01
- ల్యాబ్ అటెండెంట్ గ్రేడ్-2(గ్రూప్ సీ): 8
- హాస్పిటల్ అటెండెంట్ గ్రేడ్-3(గ్రూప్ సీ): 40

విద్యార్హతలు: పదో తరగతి, జీఎన్ఎం సర్టిఫికెట్, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, లైబ్రరీ సర్టిఫికెట్, అనుభవం.
- **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2019 ఆగస్టు 4.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.pgimer.edu.in

నోయిడా మెట్రోరైల్ కార్పొరేషన్‌లో 199 పోస్టులు

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్రాడ్ కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్... నోయిడా మెట్రో రైల్ కార్పొరేషన్‌లో ఒప్పంద పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టుల వివరాలు:
- **స్టేషన్ కంట్రోలర్/ట్రైన్ ఆపరేటర్:** 09.
- **కస్టమర్ రిలేషన్స్ అసిస్టెంట్:** 16.
- **జూనియర్ ఇంజనీర్:** 35.
- **మెయింటెనైర్:** 135.
- **అకౌంట్స్ అసిస్టెంట్:** 03.
- **ఆఫీస్ అసిస్టెంట్:** 01.
- **అర్హత:** ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్, బీటెక్, బీకామ్/సీఏ ఇంటర్/ఐసీడబ్ల్యూఏ, బీబీఏ/బీసీఏ.
- **వయసు:** 18-32 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, సైకో టెస్ట్, స్కిల్/ట్రేడ్ టెస్ట్,పర్సనల్ ఇంటరాక్షన్/గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్టుల ఆధారంగా.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2019 ఆగస్టు 22.
- **వెబ్‌సైట్:** www.becil.com

ఇండియన్ నేవీలో సెయిలర్ ఉద్యోగాలు

భారత నావికాదళం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి సెయిలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:
- సెయిలర్(మెట్రిక్ రిక్రూట్)- ఏప్రిల్ 2020 బ్యాచ్.
- **పోస్టులు:** చెఫ్, స్టీవార్డ్, హైజీనిస్ట్
- **ఖాళీల సంఖ్య:** 400.
- **అర్హతలు:** పదో తరగతి ఉత్తీర్ణత, నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.
- **వయసు:** 2000 ఏప్రిల్ 1, నుంచి 2003 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్స్ ఆధారంగా.
- **వేతనం:** శిక్షణ సమయంలో నెలకు రూ.14,600/- అందుతుంది. శిక్షణ పూర్తయ్యాక డిఫెన్స్ పే మ్యాట్రిక్స్ లెవెల్ 3 (రూ.21,700 రూ.69,100) వేతనం లభిస్తుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.205, ఎస్సీ, ఎస్టీలకు దరఖాస్తు ఫీజు నుంచి మినహాయింపు ఉంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 2019 జూలై 26.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 2019 ఆగస్టు 1.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in/

పీజీటీఎస్‌ఏయూలో పీజీ, పీహెచ్‌డీ కోర్సులు

రాజేంద్రనగర్(హైదరాబాద్)లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజీటీఎస్‌ఏయూ)... 2019-20 సంవత్సరానికి గాను వివిధ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు:
- ఎంఎస్సీ(అగ్రికల్చర్)
- ఎంఎస్సీ(హోంసైన్స్) ✦ ఎంబీఏ(ఏబీఎం)
- ఎంటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)
- పీహెచ్‌డీ(అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, హోంసైన్స్)
- **అర్హత:** పీజీ కోర్సులకు సంబంధిత విభాగంలో యూజీ; పీహెచ్‌డీకి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణత.
- **వయో పరిమితి:** 40 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక విధానం:** పీజీ ప్రవేశాలకు ఐకార్-ఏఐఈఈఏ(పీజీ) 2019; పీహెచ్‌డీ ప్రవేశాలకు ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ 2019 ర్యాంకు ఆధారంగా..
- **ఆన్‌లైన్లో దరఖాస్తులకు చివరి తేది:** 31.07.2019.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

❖ ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ-2019 ప్రిపరేషన్ వీడియో గైడెన్స్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం

WWW.SAKSHIEDUCATION.COM

Google Play / App Store

SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

ఎగ్జామ్ ట్రెండ్స్

జాతీయస్థాయిలో.. అత్యున్నత సర్వీసులుగా భావించే.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్.. తదితర 24 సర్వీసులకు ఎంపిక ప్రక్రియ సివిల్ సర్వీసెస్ పరీక్షలో మార్పులకు యూపీఎస్సీ శ్రీకారం చుట్టిందా..! తొలిదశ సివిల్స్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్‌లో.. కీలక మార్పులు జరగనున్నాయా?! అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది!! ఇటీవల యూపీఎస్సీ విజన్ డాక్యుమెంట్‌లో చేసినట్టు చెబుతున్న ప్రతిపాదనల ప్రకారం సీశాట్ పేపర్ నుంచి అభ్యర్థులకు ఉపశమనం లభించనుంది. అదే సమయంలో దరఖాస్తు చేసినా అటెంప్ట్‌గానే పరిగణించాలనే సిఫార్సుపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్ష నిర్వహణ సంస్థ యూపీఎస్సీ తాజాగా 'విజన్ డాక్యుమెంట్' పేరుతో ప్రభుత్వానికి చేసిన ముఖ్య సిఫార్సులపై నిపుణుల విశ్లేషణ...

సివిల్స్.. మార్పులు ఖాయమేనా!

ప్రిలిమ్స్‌లో జీఎస్ పేపర్-2(సీశాట్) తొలగింపు ప్రతిపాదన

దరఖాస్తు చేసినా అటెంప్ట్‌గానే పరిగణించాలని సిఫార్సు

సివిల్స్ పరీక్ష విధానంపై యూపీఎస్సీ విజన్ డాక్యుమెంట్

మెయిన్స్‌లోనూ మార్పులు జరగొచ్చనే ఊహాగానాలు

సీశాట్ తొలగింపు మంచిదే అంటున్న నిపుణులు

జాతీయస్థాయిలో ఏటా నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌కు పోటీపడే అభ్యర్థుల సంఖ్య దాదాపు అయిదు నుంచి ఆరు లక్షల వరకూ ఉంటుంది. ప్రభుత్వ రంగంలో క్రేజీ కెరీర్‌ను అందించే సివిల్స్ పరీక్షలో విజయం సాధించేందుకు లక్షల మంది ప్రతిభావంతులు ఏళ్ల తరబడి కృషిచేస్తుంటారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పరీక్షలో మార్పులు తేవాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. ద డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ)కి అందజేసిన ఈ డాక్యుమెంట్ అధికారికంగా బహిర్గతం కాకపోయినా.. కీలక సిఫార్సుల గురించి సమాచారం బయటికి వచ్చింది. ఈ సిఫార్సులు సివిల్స్ అభ్యర్థుల్లో ఒకవైపు మోదం, మరోవైపు ఖేదం కలిగించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీఎస్ పేపర్-2 (సీ-శాట్) తొలగింపు!

యూపీఎస్సీ విజన్ డాక్యుమెంట్‌లో కీలక సిఫార్సు.. రెండు పేపర్లుగా నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ స్టడీస్ పేపర్-2ను తొలగించాలనేది! ఈ పేపర్‌నే అభ్యర్థులు సీ-శాట్(సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్)గా పిలుస్తున్నారు. వాస్తవానికి 2011లో ఈ పేపర్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచీ దీనిపై అభ్యర్థుల్లో వ్యతిరేకత కొనసాగుతూనే ఉంది. సీ-శాట్ సిలబస్‌లో పేర్కొన్న అంశాలే ఇందుకు కారణమని చెప్పొచ్చు. సీ-శాట్ పేపర్ సిలబస్‌లో కాంప్రెహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్ ఇన్ క్లూడింగ్ కమ్యూనికేషన్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్ అంశాలను పేర్కొన్నారు. ఇవి ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులకు అనుకూలమనే భావన నెలకొంది. సీశాట్ కారణంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు, సంప్రదాయ డిగ్రీ కోర్సుల విద్యార్థులు సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించడం కష్టంగా మారిందంటూ.. అప్పట్లో జాతీయస్థాయిలో నిరసన సైతం వ్యక్తమైంది. దాంతో సీ-శాట్(జీఎస్ పేపర్-2) అర్హత పరీక్ష మాత్రమేనంటూనే.. ఇందులో కనీసం 33 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుందని యూపీఎస్సీ పేర్కొంది. దీనిపైనా అభ్యర్థులు అసంతృప్తితోనే ఉన్నారు. సీ-శాట్‌పై వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకున్న యూపీఎస్సీ.. ఈ పేపర్‌ను తొలగించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.

మరి రెండో పేపర్?!

రెండు పేపర్లుగా 400 మార్కులకు నిర్వహించే ప్రిలిమ్స్‌లో.. సీ-శాట్ పేపర్‌ను తొలగిస్తే.. కొత్తగా రెండో పేపర్ ఏంటనే సందేహం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉన్న జనరల్ స్టడీస్ సిలబస్‌నే రెండు పేపర్లుగా నిర్వహించే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. కరెంట్ అఫైర్స్, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాలు ఉండే జనరల్ స్టడీస్ పేపర్‌నే రెండుగా విభజించే వీలుంది. వీటికి ప్రస్తుతం సీ-శాట్ సిలబస్‌లో పేర్కొన్న జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ కూడా చేర్చి ప్రశ్నలు అడగొచ్చని అంచనా వేస్తున్నారు.

దరఖాస్తు చేస్తే.. అటెంప్ట్ చేసినట్లే!

విజన్ డాక్యుమెంట్‌లో ఒకవైపు అభ్యర్థులకు ఉపశమనం కలిగించేలా సీశాట్ పేపర్‌ను తొలగించాలని ప్రతిపాదించిన యూపీఎస్సీ.. మరోవైపు అభ్యర్థులకు పిడుగులాంటి ప్రతిపాదన చేసింది. సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు దరఖాస్తు చేసినా.. అటెంప్ట్ చేసినట్లుగానే పరిగణించాలని కీలక సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థుల్లో హాజరు 50 శాతానికి మించకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. వాస్తవానికి దరఖాస్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని యూపీఎస్సీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుంది. కానీ, సగానికి సగం మంది గైర్హాజరు అవుతుండటంతో అనేక వ్యయ ప్రయాసలు ఎదురవుతున్నాయని భావిస్తోంది. అందుకే దరఖాస్తు చేసినా.. అటెంప్ట్‌గానే పరిగణిస్తే.. సీరియస్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేస్తారనే అభిప్రాయంతో యూపీఎస్సీ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం జనరల్ కేటగిరీలో ఆరుసార్లు మాత్రమే అటెంప్ట్ చేసే అవకాశముంది. ప్రస్తుత విధానంలో.. దరఖాస్తు చేసి.. ప్రిపరేషన్ పూర్తికాలేదనుకుంటే.. పరీక్షకు హాజరు కాకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ.. తాజా ప్రతిపాదనతో దరఖాస్తు చేశాక హాజరు కాకపోతే.. ఎంతో విలువైన ఒక అటెంప్ట్ కోల్పోయినట్లే!

బస్వాన్ కమిటీ సిఫార్సులే ఆధారమా?

యూపీఎస్సీ విజన్ డాక్యుమెంట్‌లో ప్రతిపాదించినట్లు చెబుతున్న రెండు కీలక మార్పులకు 2015లో హెచ్ఆర్‌డీ మాజీ కార్యదర్శి బి.ఎస్.బస్వాన్ కమిటీ చేసిన సిఫార్సులే ఆధారమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2016లో అందజేసిన నివేదికలో ఈ కమిటీ పలు సిఫార్సులు చేసింది. అందులో అటెంప్ట్‌ల సంఖ్యను ఆరు నుంచి నాలుగుకు తగ్గించాలని సూచించింది. అదే విధంగా గరిష్ఠ వయో పరిమితిని 27 ఏళ్లకు తగ్గించాలని సలహా ఇచ్చింది. ఒకేసారి అటెంప్ట్‌ల సంఖ్యను తగ్గిస్తే.. అభ్యర్థుల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో మధ్యే మార్గంగా.. దరఖాస్తు చేసినా అటెంప్ట్‌గానే పరిగణించాలనే ప్రతిపాదన చేసినట్లు చెబుతున్నారు.

మెయిన్‌లోనూ మార్పులు ఉంటాయా?

యూపీఎస్సీ విజన్ డాక్యుమెంట్ తాజా ప్రతిపాదనలను చూస్తే.. మెయిన్‌లోనూ మార్పులు ఉంటాయా? అనే సందేహం అభ్యర్థుల్లో తలెత్తుతోంది. బస్వాన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి ఉంటే.. మెయిన్‌లోనూ మార్పులు జరగడానికే ఎక్కువ అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. సివిల్స్ మెయిన్ పరీక్షలకు సంబంధించి ఆప్షనల్ పేపర్‌ను తొలగించాలనేది బస్వాన్ కమిటీ కీలక సిఫార్సు. కొన్ని ఆప్షనల్ సబ్జెక్ట్‌లను ఎంచుకుంటున్న అభ్యర్థుల విజయ శాతం ఎక్కువగా ఉంటోందనే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కమిటీ ఈ సిఫార్సు చేసింది. విజన్ డాక్యుమెంట్‌లోనూ ఇలాంటి ప్రతిపాదన చేసి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సివిల్స్-2020 నుంచే అమలు!

యూపీఎస్సీ విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న ప్రతిపాదనలను సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2020 నుంచే అమలు చేస్తారా? అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. యూపీఎస్సీ ఏవైనా మార్పులు చేసేటప్పుడు కనీసం ఏడాది ముందుగా ఆ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తుంది. కానీ.. 2011లో సీ-శాట్‌ను ప్రవేశపెట్టిన విషయం నోటిఫికేషన్ సమయంలోనే అభ్యర్థులకు తెలిసింది. కాబట్టి సివిల్స్-2020 నుంచే మార్పులు అమల్లోకి వచ్చినా ఆశ్చర్యపడక్కర్లేదనే వాదన సైతం వినిపిస్తోంది. వాస్తవానికి ఏటా ఫిబ్రవరిలో సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్ విడుదలవుతుంది. ప్రిలిమ్స్ పరీక్షను జూన్‌లో, మెయిన్‌ను అక్టోబర్/నవంబర్‌ల్లో నిర్వహిస్తుంది. సివిల్స్-2020 నోటిఫికేషన్‌కు ఇంకా ఆరు నెలల సమయం ఉంది. ఈలోపే విజన్ డాక్యుమెంట్‌కు ఆమోదం లభించి.. నోటిఫికేషన్‌కు రెండు, మూడు నెలల ముందుగా కొత్త మార్పుల గురించి ప్రకటించే ఆస్కారముందని నిపుణులు అంటున్నారు.

మార్పులకు సిద్ధంగా..

సివిల్స్ పరీక్షలో కొత్త మార్పులకు అభ్యర్థులు సిద్ధంగా ఉండటం మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీ-శాట్ తొలగింపు అభ్యర్థులకు అనుకూలమే. కానీ, దాని స్థానంలో జనరల్ స్టడీస్‌ను విస్తృతం చేసేలా కొత్త పేపర్‌ను ప్రవేశపెడితే ఆమేరకు జీఎస్‌పై పట్టు సాధించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రిపరేషన్‌కు శ్రీకారం చుట్టిన అభ్యర్థులు సీ-శాట్‌తోపాటు జీఎస్‌కు మరింత ఎక్కువ సమయం కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

> **సీ-శాట్‌తో ఉపయోగం లేదు**
>
> **ప్ర**స్తుతం నిర్వహిస్తున్న సీ-శాట్ పేపర్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదనే చెప్పొచ్చు. ఈ పేపర్‌ను ప్రవేశపెట్టిన ఉద్దేశానికి అనుగుణంగా సిలబస్ లేదు. సివిల్ సర్వీసెస్ వంటి పరీక్షలకు నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో పరిపాలన దక్షతకు సంబంధించిన ప్రశ్నలు ఉండాలి. కానీ.. ప్రస్తుతం సీ-శాట్ గణిత నేపథ్యం ఉన్నవారికి అనుకూలంగా మారింది. సీ-శాట్‌ను తొలగించాలనే సిఫార్సు నిజమైతే ఆహ్వానించదగ్గ పరిణామమే.
>
> **- ఆర్.సి.రెడ్డి**, డైరెక్టర్, ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్.

> **గ్రామీణ అభ్యర్థులకు ప్రయోజనం**
>
> **సీ**శాట్ పేపర్ తొలగింపు కచ్చితంగా గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనమే. దీనికి వెచ్చించే సమయాన్ని జనరల్ స్టడీస్‌కు కేటాయిస్తే విజయావకాశాలు మరింత మెరుగవుతాయి. ఇక తాజాగా పేర్కొన్న సిఫార్సును చూస్తే.. ప్రిలిమ్స్‌లో జనరల్ స్టడీస్‌నే రెండు పేపర్లుగానూ నిర్వహించే అవకాశం కూడా కనిపిస్తోంది.
>
> **- వి.గోపాలకృష్ణ**, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ అకాడమీ.

> **2020కి ప్రస్తుత విధానంలోనే..**
>
> **వి**జన్ డాక్యుమెంట్‌లో ప్రతిపాదనలను ఆమోదించి దాని ప్రకారం సివిల్స్-2020ని నిర్వహిస్తారని నేను భావించట్లేదు. కారణం.. ఏవైనా మార్పులు చేసేటప్పుడు యూపీఎస్సీ కనీసం ఏడాది ముందుగానే ప్రకటిస్తుంది. ఈసారి కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తుందని భావిస్తున్నాను. దరఖాస్తు చేసినా.. అటెంప్ట్‌గానే పరిగణించాలనే సిఫార్సు ఆమోదయోగ్యం కాదు.
>
> **- శ్రీరామ్**, డైరెక్టర్, శ్రీరామ్స్ ఐఏఎస్.

యోగా.. కెరీర్ యోగం

సహజసిద్ధ ప్రక్రియ

మనిషి శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకొనేందుకు అందుబాటులో ఉన్న సహజసిద్ధ మార్గం యోగా. సంస్కృతంలో యోగా అంటే ఐక్యత, ఒక్కచోటుకి చేరు అనే అర్థం ఉంది. యోగాలో శరీరం, మనసు ఐక్యమవుతాయి. కంప్యూటర్ ముందు గంటల తరబడి పనిచేసేవారు, ఇతర కార్యకలాపాల్లో పని ఒత్తిడిని ఎదుర్కొనే వారు యోగా ద్వారా ఉపశమనం పొందుతున్నారు.

ప్రాక్టీస్ ముఖ్యం

✦ ప్రస్తుతం చాలామంది యోగాలో మెళకువలు నేర్చుకొని వాటిని ఇతరులకు అందిస్తున్నారు. దాంతో యోగా.. టీచింగ్ కెరీర్ మార్గంగా రూపాంతరం చెందింది. అయితే యోగా టీచర్‌గా మారడానికి ముందు ఇన్స్ట్రక్టర్ పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవడం, ప్రాక్టీస్ చేయడం చాలా ముఖ్యం. యోగాలో నైపుణ్యం సాధించడం ఒక్కరోజుల్లో సాధ్యమయ్యే పనికాదు. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్, మనసు లగ్నం చేయడం, సహనం, అంకిత భావం చాలా అవసరం.

✦ యోగా ప్రొఫెషనల్‌గా మారేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల్లో చేరొచ్చు. కేంద్ర ప్రభుత్వం యోగా టీచర్లను సర్టిఫై చేసేందుకు 'స్కీమ్ ఫర్ వాలంటరీ సర్టిఫికేషన్ ఆఫ్ యోగా ప్రొఫెషనల్స్'ను ప్రవేశపెట్టింది. ఇందులో యోగా ఇన్స్ట్రక్టర్ సర్టిఫికేషన్, యోగా టీచర్ సర్టిఫికేషన్, యోగా మాస్టర్ సర్టిఫికేషన్, యోగా ఆచార్య సర్టిఫికేషన్‌లుగా వర్గీకరించింది. దీనికి సంబంధించిన ప్రమాణాలను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయిస్తుంది.

జాబ్ ప్రొఫైల్స్
- రీసెర్చ్ ఆఫీసర్-యోగా అండ్ నేచురోపతీ
- యోగా ఏరోబిక్ ఇన్‌స్ట్రక్టర్.
- క్లినికల్ సైకాలజిస్ట్ ➡ యోగా థెరపిస్ట్
- యోగా ఇన్‌స్ట్రక్టర్ ➡ యోగా టీచర్
- థెరపిస్ట్/నేచురోపత్స్
- ట్రైనర్/ఇన్‌స్ట్రక్టర్ హెల్త్ క్లబ్

కెరీర్ స్కోప్

✦ యోగాలో పొందిన శిక్షణ ఆధారంగా రీసెర్చ్, ట్రైనింగ్ విభాగాల్లో స్థిరపడొచ్చు. దీంతోపాటు యోగా థెరపిస్ట్‌గా కెరీర్‌ను ప్రారంభించొచ్చు.

✦ రిసార్టులు, జిమ్స్, సూల్స్, హెల్త్ సెంటర్స్, హౌజింగ్ సొసైటీస్‌లో ఉపాధి అవకాశాలు ఉంటాయి.

✦ టీవీ ఛానళ్లతో పాటు సెలబ్రిటీలు, ఉన్నత స్థాయిలోని వ్యక్తులు వ్యక్తిగత యోగా ట్రైనర్లను నియమించుకుంటున్నారు. సెలవు రోజుల్లో యోగా ద్వారా ఒత్తిడి నుంచి బయటపడేందుకు విదేశీ పర్యాటకులు భారత్‌కు వస్తున్నారు.

ప్రపంచం సూపర్‌సోనిక్ వేగంతో పరుగెడుతోంది..! ఆహారపు అలవాట్ల నుంచి కొలువుల తీరు వరకు.. సమస్త మానవ జీవన విధానమే మారిపోయింది! ఫలితంగా ఒత్తిళ్లు, మానసిక, శారీరక అనారోగ్యాలు! అలాంటి ఒత్తిడిమయ జీవితం నుంచి ఉపశమనం కల్గించి.. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని చేకూర్చేదే యోగా!! అత్యంత సహజ విధానాల్లో అంతర్గత శాంతితోపాటు సంపూర్ణ స్వస్థత సొంతం చేసుకునేందుకు మార్గం యోగా అంటున్నారు నిపుణులు. భారతీయ ప్రాచీన ప్రక్రియ యోగాకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. యువతకు కెరీర్ వేదికగా మారుతున్న యోగా కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం...

- యోగాకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ
- యువతకు కెరీర్ వేదికగా మారుతున్న వైనం
- కోర్సులను సైతం అందిస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్‌లు

✦ **వేతనాలు:** ఫ్రెషర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన వారు నెలకు రూ.15,000 నుంచి రూ.20,000 వేల వరకు సంపాదించగలరు. అనుభవంతో సంపాదన, వేతనాలు వేగంగా పెరుగుతాయి.

> **అపార ప్రయోజనాలు**
>
> **యో**గా ఓ గొప్ప ప్రక్రియ. దీని ద్వారా మనుషులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. యోగాతో ఆరోగ్యం, ఆధ్యాత్మికత పరంగా మేలు జరుగుతుంది. అంతేకాకుండా యోగా అద్వితీయ అనుభూతిని అందిస్తుంది. ఈ అనుభూతిని నలుగురికి పంచే క్రమంలో యోగా ఓ కెరీర్‌గా అవతరించింది. యోగాలో శిక్షణ పొందిన వారు థెరపిస్టులుగా, యోగా టీచర్లుగా కెరీర్‌ను ప్రారంభించొచ్చు. సొంతంగా యోగా స్టూడియోలను ప్రారంభించి ముందుకెళ్లొచ్చు. ఫ్రీలాన్సర్ యోగా ట్రైనర్లుగా పనిచేయొచ్చు. యోగా కోర్సులకు సంబంధించి ఇషా ఫౌండేషన్‌లో 6 నెలల వ్యవధితో క్లాసికల్ హఠ యోగా కోర్సు అందుబాటులో ఉంది. దీన్ని పూర్తి చేసిన వారికి టీచింగ్ సర్టిఫికెట్స్ ఇస్తారు.
>
> **- శైలజ**, ఇషా ఫౌండేషన్.

కోర్సుల వివరాలు

యోగా టీచర్‌గా మారేందుకు దేశంలో పలు విద్యా సంస్థల్లో అందుబాటులో ఉన్న ప్రాథమిక కోర్సు బీఏ యోగా లేదా బీఎస్సీ యోగా థెరపీ. 50 శాతం మార్కులతో ఇంటర్ లేదా తత్సమానం ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. వీటిని పూర్తిచేసిన వారికి ఎంఏ/ఎంఎస్సీ యోగా థెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇవేకాకుండా పలు పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికేషన్ కోర్సుల్లోనూ చేరి యోగాలో నైపుణ్యం సాధించొచ్చు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో..

✦ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంఏ యోగా అండ్ కాన్షియస్‌నెస్‌తోపాటు పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ యోగా, డిప్లొమా ఇన్ యోగా, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగానను అందిస్తోంది.
- **పీజీ డిప్లొమా ఇన్ యోగా(పార్ట్‌టైమ్)- సీట్లు:** 40
  అర్హత: ఏదైనా డిగ్రీ. **కోర్సు వ్యవధి:** ఏడాది
- ✦ కోర్సులో భాగంగా ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు ప్రాక్టీసెస్, తిరిగి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు థియరీ క్లాసెస్ ఉంటాయి.
- **ఎంఏ యోగా అండ్ కాన్షియస్‌నెస్-సీట్లు:** 30
  అర్హత: ఏదైనా గ్రాడ్యుయేషన్‌తోపాటు యోగాలో బేసిక్ సర్టిఫికెట్ ఉండాలి.
  కోర్సు వ్యవధి: రెండేళ్లు.
- **డిప్లొమా ఇన్ యోగా- సీట్లు:** 50
  అర్హత: ఇంటర్ **కోర్సు వ్యవధి:** ఆరు నెలలు
- **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా-సీట్లు:** 30
  అర్హత: ఎస్ఎస్‌సీ లేదా తత్సమానం
  కోర్సు వ్యవధి: మూడు నెలలు.

యోగా కోర్సులను అందిస్తున్న సంస్థలు
- గాంధీ నేచురోపతిక్ మెడికల్ కాలేజ్, హైదరాబాద్.
- ఎస్‌డీఎం కాలేజ్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్, ఉజిరే, కర్నాటక.
- జేఎస్ఎస్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్, ఊటకమండ్, కర్నాటక.
- శివరాజ్ నేచురోపతి అండ్ యోగా మెడికల్ కాలేజ్, సేలం.
- గవర్నమెంట్ నేచురోపతి అండ్ యోగా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, చెన్నై.
- ఎస్ఆర్‌కే మెడికల్ కాలేజ్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్, తమిళనాడు.
- మహావీర్ కాలేజ్ ఆఫ్ నేచుర

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
22-7-2019

ధోనిలాంటి దిగ్గజాలకు ఎప్పుడు రిటైరవ్వాలో తెలుసు

రిటైర్మెంట్ అనేది పూర్తిగా ఆటగాళ్ల వ్యక్తిగతం. ధోనిలాంటి దిగ్గజానికి ఎప్పుడు తప్పుకోవాలో తెలుసు. భవిష్యత్‌పై దృష్టి సారిస్తూ మా చేతుల్లో ఉన్నదే మేం చేయగలం. అందుబాటులో ఉండనని ప్రకటించాడు కాబట్టి ధోని ఆటపై చర్చ అనవసరం. అతడు సిద్ధంగా ఉన్నాను అని అన్నప్పుడు... ఏం చేయాలో ఆలోచిస్తాం. మాకు ప్రపంచ కప్ ముందు, తర్వాత వేర్వేరు ప్రణాళికలున్నాయి. పంత్ వంటి కురాళ్రను తీర్చిదిద్దడంపై దృష్టిపెట్టాం.

–చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్

రన్నరప్‌తో సరి

ఈ ఏడాది తొలి టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట (పీవీ) సింధుకు నిరాశ ఎదురైంది. ఈ సీజన్‌లో తొలిసారి ఫైనల్ ఆడిన ఆమె ఇండోనేసియా ఓపెన్‌లో తుది మెట్టుపై బోల్తా పడింది. తన ఫైనల్ ప్రత్యర్థిపై పదిసార్లు నెగ్గిన రికార్డు ఉన్నప్పటికీ కీలక తరుణంలో తప్పిదాలతో సింధు మూల్యం చెల్లించుకొని రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గతంలో సింధుపై పద్నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగుసార్లే నెగ్గిన అకానె యామగుచి ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ మూడో టైటిల్‌ను సాధించింది.

- ఫైనల్లో ఓడిన పీవీ సింధు
- ఇండోనేసియా ఓపెన్ టోర్నీ విజేత అకానె యామగుచి

జకార్తా: క్వార్టర్ ఫైనల్లో, సెమీఫైనల్లో తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారిణులపై అలవోక విజయాలు సాధించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఫైనల్లో మాత్రం తడబడింది. ఈ సీజన్‌లో తొలి టైటిల్‌ను గెలిచే అవకాశాన్ని చేజార్చుకుంది. ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి సింధు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ సింధు 15-21, 16-21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. విజేత అకానె యామగుచికి 87,500 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 60 లక్షల 28 వేలు)తోపాటు 12,000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సింధుకు 42,500 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 29 లక్షల 28 వేలు) తోపాటు 10,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

గత డిసెంబర్‌లో సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన అనంతరం సింధుకు ఇండోనేసియా ఓపెన్ రూపంలో ఈ ఏడాది తొలి టైటిల్ సాధించే అవకాశం వచ్చింది. కానీ 51 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో సింధు కీలకదశలో తప్పిదాలు చేసి విజయానికి దూరమైంది. వివిధ టోర్నీల్లో యామగుచితో ఆడిన చివరి నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గిన సింధు ఈసారి మాత్రం అదే ఫలితం రాబట్టలేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో రెండో ర్యాంకర్, ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై, సెమీఫైనల్లో మూడో ర్యాంకర్ చెన్ యుఫె (చైనా)పై అలవోకగా నెగ్గిన సింధు తుది సమరంలో మాత్రం వరుస గేముల్లో ఓటమి చవిచూసింది. ఈ ఏడాది జర్మన్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్‌లలో విజేతగా నిలిచిన యామగుచి ఫైనల్లో ప్రణాళిక ప్రకారం ఆడింది. పలుమార్లు వెనుకపడ్డా ఒత్తిడికి లోనుకాకుండా ఆడి సింధు ఆట కట్టించింది. తొలి గేమ్‌లో సింధు 14-12తో రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నదశలో... యామగుచి అద్భుత ఆటతీరుతో వరుసగా ఎనిమిది పాయింట్లు గెలిచి 20-14తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత సింధు ఒక పాయింట్ సాధించగా... వెంటనే యామగుచి మరో పాయింట్ నెగ్గి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్‌లో స్కోరు 4-4 వద్ద ఉన్నపుడు యామగుచి రెండు పాయింట్లు గెలిచి 6-4తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ యామగుచి విజయాన్ని ఖాయం చేసుకుంది.

> 'అకానె యామగుచి అద్భుతంగా ఆడింది. సుదీర్ఘంగా సాగిన ర్యాలీల్లో ఆమెనే పైచేయి సాధించింది. తొలి గేమ్‌లో నేను రెండు, మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నదశలో తప్పిదాలు చేశాను. ఈ అవకాశాలను ఆమె అనుకూలంగా మల్చుకుంది. నేను తొలి గేమ్‌లో గెలిచిఉంటే తుది ఫలితం మరోలా ఉండేది. రెండో గేమ్‌లో యామగుచికి నేను ఆరేడు పాయింట్ల ఆధిక్యం ఇచ్చాను. దాంతో నేను కోలుకునే అవకాశం లేకుండా పోయింది. తుది ఫలితం నిరాశపరిచినా ఓవరాల్‌గా ఈ టోర్నీలో నా ఆటపట్ల సంతృప్తిగా ఉన్నాను. తదుపరి జపాన్ ఓపెన్ టోర్నీలో ఆడనున్నాను. అక్కడ మరింత మెరుగైన ఫలితం సాధిస్తానన్న నమ్మకం ఉంది.' –పీవీ సింధు

విండీస్ సిరీస్‌కు సై

- మూడు ఫార్మాట్లకు ఒకేసారి జట్ల ప్రకటన
- పూర్తిస్థాయి అందుబాటులో కెప్టెన్ కోహ్లి
- హార్దిక్‌కు విశ్రాంతి!
- బుమ్రా టెస్టులకే
- ఓపెనర్ శిఖర్ ధావన్ పునరాగమనం
- టెస్టులకు భువీ, టి20లకు చహల్, కుల్దీప్ విస్మరణ
- పరిమిత ఓవర్లకు శ్రేయస్, మనీశ్‌లకు పిలుపు
- అరంగేట్రం చేయనున్న నవదీప్ సైనీ, రాహుల్ చహర్

సెలక్షన్ కమిటీ సమావేశానికి వస్తున్న కెప్టెన్ కోహ్లి

ముంబై: ప్రపంచ కప్ సాధించలేకపోయిన బాధను అధిగమిస్తూ వెస్టిండీస్ సిరీస్‌కు టీమిండియాను ఎంపిక చేసింది జాతీయ సెలక్టర్ల బృందం. విడివిడిగా కాకుండా మూడేసి టి20లు, వన్డేలతో పాటు రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు ఒకేసారి జట్లను ప్రకటించింది. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో ఆదివారం ఇక్కడ సమావేశమైన సెలక్టర్లు పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కు 15 మంది చొప్పున, టెస్టులకు 16 మంది సభ్యుల పేర్లను వెల్లడించారు. వీరిలో పేసర్ నవదీప్ సైనీ (ఢిల్లీ), స్పిన్నర్ రాహుల్ చహర్ (రాజస్తాన్) పూర్తిగా కొత్త ముఖాలు. విశ్రాంతి ఊహాగానాలను తోసిరాజంటూ కెప్టెన్ విరాట్ కోహ్లి మొత్తం పర్యటనలో పాల్గొననున్నాడు. వన్డే ప్రపంచ కప్ జట్టులో ఉన్న వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్‌పై వేటు పడింది. పనిభారం రీత్యా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను టెస్టులకే పరిమితం చేయగా, ఫిట్‌నెస్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను పరిగణనలోకి తీసుకోలేదు. ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 3 వరకు జరిగే కరీబియన్ పర్యటనలో భారత్ 3 టి20లు, 3 వన్డేలు, 2 టెస్టులు ఆడుతుంది.

హార్దిక్‌ది గాయమా? విశ్రాంతా?

మూడు ఫార్మాట్లలోనూ కీలకమైన పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను మొత్తం విండీస్ టూర్‌కే ఎంపిక చేయలేదు. ప్రపంచ కప్‌లో బాగానే రాణించిన హార్దిక్... సెమీస్‌కు వచ్చేసరికి ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. కొంతకాలంగా అతడిని వేధిస్తున్న వెన్నునొప్పి తిరగబెట్టకుండా సెలక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

పృథ్వీ షా మళ్లీ మిస్...

అరంగేట్రంలోనే సెంచరీతో అదరగొట్టిన యువ సంచలనం పృథ్వీ షాను ఆ తర్వాత దురదృష్టం వెంటాడుతున్నట్లుంది. పట్టించుకోనవసరం లేని ప్రాక్టీస్ మ్యాచ్‌లో క్లిష్టమైన క్యాచ్ అందుకోబోయి పాదం గాయానికి గురై, కెరీర్‌కు కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన పృథ్వీ... ఇప్పుడు మరో గాయంతో వెస్టిండీస్ సిరీస్‌నూ చేజార్చుకున్నాడు. రెండు నెలల క్రితం ముంబై టి20 లీగ్‌లో ఆడుతూ గాయం బారినపడ్డ అతడు ప్రస్తుతం కరీబియన్ దీవుల్లో ఆడుతున్న భారత 'ఎ' జట్టులో స్థానాన్ని కోల్పోయాడు. విండీస్‌తో టెస్టులకు కొంత సమయం ఉన్నా సెలక్టర్లు పృథ్వీని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో విదేశాల్లో సత్తా చాటేందుకు అతడు ఇంకొంత కాలం ఆగక తప్పలేదు.

టెస్టు జట్టు: సభ్యులు 16

మయాంక్ అగర్వాల్, రాహుల్, పుజారా, కోహ్లి, రహానే, హనుమ విహారి, రోహిత్ శర్మ, రిషభ్ పంత్, సాహా, అశ్విన్, జడేజా, కుల్దీప్, షమీ, ఇషాంత్ శర్మ, బుమ్రా, ఉమేశ్ యాదవ్.

ఎంపిక తీరు: స్పెషలిస్ట్ మూడో ఓపెనర్‌గా ఎవరినీ తీసుకోలేదు. మయాంక్, రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తారు. అవసరమైతే తెలుగు ఆటగాడు విహారిని ఓపెనింగ్‌కు పరిశీలించే వీలుంది. ఈ కారణంగానే దేశవాళీ, 'ఎ' జట్ల తరపున సెంచరీలతో దుమ్మురేపుతున్న ప్రియాంక్ పాంచాల్ (గుజరాత్), అభిమన్యు ఈశ్వరన్ (బెంగాల్)లకు పిలుపు అందలేదు. ప్రపంచ కప్ టాప్ స్కోరర్ రోహిత్ శర్మకు మళ్లీ అవకాశం దక్కింది. రోహిత్ ఆస్ట్రేలియాలో పర్యటించిన జట్టులోనూ సభ్యుడు. ఏడాదిగా గాయంతో అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన వృద్ధిమాన్ సాహాను రెండో వికెట్ కీపర్‌గా తీసుకున్నారు. ఆసీస్ టూర్‌లో జట్టులో ఉన్న మిగతా నలుగురు పేసర్లకూ స్థానం కల్పించిన సెలెక్టర్లు పేసర్ భువనేశ్వర్‌ను పక్కన పెట్టారు. స్పిన్ బాధ్యతలను అశ్విన్-జడేజా-కుల్దీప్ త్రయం మోయనుంది.

వన్డే జట్టు: సభ్యులు 15

రోహిత్ శర్మ, ధావన్, కోహ్లి, రాహుల్, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, పంత్, జడేజా, కుల్దీప్, చహల్, కేదార్ జాదవ్, షమీ, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, నవదీప్ సైనీ.

ఎంపిక తీరు: వేలి గాయంతో ప్రపంచ కప్ నుంచి తప్పుకొన్న ఓపెనర్ శిఖర్ ధావన్ ఫిట్‌నెస్ సాధించడంతో అందుబాటులోకి వచ్చాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నంబర్-4 స్థానం సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో నిఖార్సైన బ్యాట్స్‌మెన్ అయ్యర్, పాండేలకు అవకాశం దక్కింది. సీనియర్ దినేశ్ కార్తీక్‌పై వేటుతో రిషభ్ పంత్ ఏకైక కీపర్‌గా వ్యవహరించనున్నాడు. ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్‌ను తప్పిస్తారని ఊహించినా అతడిపై భరోసా ఉంచారు. ఎడంచేతి వాటం పేసర్ ఖలీల్ పునరాగమనం చేస్తున్నాడు. గాయం నుంచి ఇంకా కోలుకోని ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ పేరు ప్రస్తావనకు రాలేదు.

టి20 జట్టు: సభ్యులు 15

రోహిత్, ధావన్, కోహ్లి, రాహుల్, అయ్యర్, పాండే, పంత్, కృనాల్ పాండ్యా, జడేజా, వాషింగ్టన్ సుందర్, రాహుల్ చహర్, దీపక్ చహర్, ఖలీల్, భువనేశ్వర్, నవదీప్ సైనీ.

ఎంపిక తీరు: జాతీయ జట్టు సభ్యులుగా సోదర ద్వయం రాహుల్ చహర్ (స్పిన్), దీపక్ చహర్ (పేసర్) తొలిసారి మైదానంలో దిగే వీలుంది. దీపక్ గతంలో ఒక వన్డే, ఒక టి20 ఆడాడు. ఐపీఎల్, 'ఎ' జట్టు తరపున అదరగొట్టిన 19 ఏళ్ల రాహుల్ చహర్ తన ప్రతిభకు గుర్తింపుగా టీమిండియా గడప తొక్కాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లకు పట్టించుకోని వాషింగ్టన్ సుందర్‌కు తిరిగి పిలుపొచ్చింది. మణికట్టు ద్వయం కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చహల్‌ను ఎంపిక చేయకపోవడం గమనార్హం. బుమ్రా అందుబాటులో లేని నేపథ్యంలో షమీని పొట్టి ఫార్మాట్‌కు పరిగణించలేదు. అద్భుత ఫామ్‌లో ఉన్నప్పటికీ అతడిపై మరింత భారం మోపకుండా ఖలీల్, దీపక్, సైనీ వంటి యువ పేసర్లను పరీక్షించనున్నారు. భువీ ప్రధాన పేసర్‌గా వ్యవహరిస్తాడు.

రాయుడిపై వివక్ష లేదు

- అతడి '3డి' ట్వీట్‌ను ఎంజాయ్ చేశా
- ఎమ్మెస్కే ప్రసాద్ సమాధానం

ముంబై: విండీస్ టూర్‌కు జట్ల ప్రకటన సందర్భంలో చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ వద్ద... తెలుగు క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడి గురించి మీడియా ప్రస్తావించింది. దీనిపై ఎమ్మెస్కే వ్యంగ్యంగా స్పందించాడు. విజయ్ శంకర్‌ను ప్రపంచ కప్ జట్టులోకి తీసుకుంటూ అతడిని త్రీ డైమెన్షనల్ (బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్) ఆటగాడిగా ప్రసాద్ పేర్కొన్నాడు. దీనిపై అప్పట్లో రాయుడు... 'ప్రపంచ కప్ చూసేందుకు ఇప్పుడే '3డి' కళ్లజోడుకు ఆర్డరిచ్చా' అంటూ వెటకారంగా ట్వీట్ చేశాడు. ఈ నేపథ్యంలో ప్రసాద్ స్పందిస్తూ 'ఆ ట్వీట్ చాలా బాగుంది. సమయోచితం, అద్భుతం కూడా. నేను బాగా ఎంజాయ్ చేశా. ఆ ఆలోచన తనకు ఎలా వచ్చిందో?' అని అన్నాడు. కూర్పు వైవిధ్యం కారణంగానే రాయుడిని ఎంపిక చేయలేదని; అంతేకాని అతనిపై ఎలాంటి వివక్ష చూపలేదని ప్రసాద్ వివరణ ఇచ్చాడు. ఈ విషయంలో అతడు ఎంత ఉద్వేగానికి గురయ్యాడో సెలక్షన్ కమిటీ కూడా అంతే ఉద్వేగానికి లోనైందని అన్నాడు. ఇదే రాయుడు గతేడాది ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికై, యో యో పరీక్ష విఫలమైనప్పుడు విమర్శలు రాగా తాము మద్దతుగా నిలిచిన విషయాన్ని ప్రస్తావించాడు. ప్రపంచ కప్‌లో ధావన్ గాయపడ్డాక జట్టు మేనేజ్‌మెంట్ ఎడంచేతి ఆటగాడు కావాలని కోరిందని, అందుకే పంత్‌ను పంపామని, ఇక ఓపెనర్ రాహుల్‌కు బ్యాకప్‌గా మయాంక్‌ను తీసుకున్నామని ఎమ్మెస్కే వివరించాడు. ఇందులో పూర్తి స్పష్టతతో వ్యవహరించామని తెలిపాడు.

కోన భరత్‌కు తప్పని నిరీక్షణ

సెలక్టర్లు టెస్టులకు పంత్, సాహాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఆంధ్రా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ కోన శ్రీకర్ భరత్‌కు నిరీక్షణ తప్పలేదు. ఇటీవల అద్భుత ఫామ్ రీత్యా భరత్ ఎంపికపై వార్తలు వచ్చాయి. 'ఎ' జట్టు తరపున ప్రదర్శనలనూ లెక్కలోకి తీసుకున్నామని చెప్పిన ఎమ్మెస్కే... టెస్టు జట్టులోకి ఎంపికకు భరత్ చాలా చాలా దగ్గరగా ఉన్నాడని పేర్కొన్నాడు. అయితే, గాయంతో దూరమైన జట్టులోని ఒక రెగ్యులర్ ఆటగాడు ఫిట్‌నెస్ సాధిస్తే ఎంపికలో అతడికే ప్రాధాన్యం ఇవ్వాలన్న అప్రకటిత నియమంతో సాహాకు చాన్స్ దక్కింది.

క్వార్టర్స్‌లో నిఖత్

న్యూఢిల్లీ: థాయ్‌లాండ్ ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారతకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్లు నిఖత్ జరీన్, మొహమ్మద్ హుసాముద్దీన్ (56 కేజీలు) శుభారంభం చేశారు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల 51 కేజీల విభాగంలో నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరగా... హుసాముద్దీన్ రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో 'బై' పొందిన నిఖత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 5-0తో తస్మీన్ బెన్నీ (న్యూజిలాండ్)పై గెలిచింది. హుసాముద్దీన్ తొలి రౌండ్‌లో 4-1తో యుతాపోంగ్ థోంగ్‌డి (థాయ్‌లాండ్)ను ఓడించాడు.

టైటాన్స్ రైడర్‌ను పట్టేసిన తమిళ్ తలైవాస్ ఆటగాళ్లు

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్

తమిళ్ తలైవాస్ విజయం • ప్రొ కబడ్డీ లీగ్

సాక్షి, హైదరాబాద్: ఎన్నో అంచనాల నడుమ ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-7 బరిలో దిగిన తెలుగు టైటాన్స్ జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. సొంత ప్రేక్షకుల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 26-39 స్కోరుతో తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమి చవిచూసింది. టైటాన్స్ నుంచి తలైవాస్‌కు వెళ్లిన స్టార్ ప్లేయర్ రాహుల్ చౌదరి (10 రైడ్ పాయింట్లు, 2 టాకిల్ పాయింట్లు) తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడుగా మంజీత్ చిల్లర్ 5 పాయింట్లతో జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. టైటాన్స్ తరపున సిద్ధార్థ్ దేశాయ్ (5 పాయింట్లు) మళ్లీ మెరిపించలేకపోయాడు.

తొలి పది నిమిషాలే నిలబడింది...

తలైవాస్‌తో పోరులో టైటాన్స్ మొదటి పది నిమిషాలే పోటీ ఇవ్వగలిగింది. తొలి నిమిషంలోనే రాహుల్ తలైవాస్‌కు బోణీ చేశాడు. అయితే 4వ నిమిషంలో టైటాన్స్ సూపర్ టాకిల్ చేసి స్కోర్‌ను 3-4కు తగ్గించింది. టైటాన్స్ స్టార్ రైడర్ సిద్ధార్థ్ తన మొదటి పాయింట్‌ను సాధించడానికి 6 నిమిషాల సమయం పట్టింది. తొలి 10 నిమిషాల ఆట ముగిసేసరికి టైటాన్స్ 7-6తో ఆధిక్యంలో నిలిచింది. ప్రత్యర్థి ఓటమికి తలైవాస్ ఆటగాడు షబీర్ బాపు బాటలు వేశాడు. మొదట సూపర్ టాకిల్‌తో రెండు పాయింట్లు సాధించిన షబీర్... తర్వాత వెంట వెంటనే రెండు రైడ్ పాయింట్లు తెచ్చాడు. 16వ నిమిషంలో రాహుల్ రెండు రైడ్ పాయింట్లతో.. 18వ నిమిషంలో అజయ్ ఠాకూర్ సూపర్ రైడ్‌తో అదరగొట్టడంతో మొదటి అర్ధ భాగం ముగిసే సరికి తలైవాస్ 20-10తో ముందంజలో నిలిచింది. రెండో అర్ధభాగంలో తెలుగు టైటాన్స్ పాయింట్ల కోసం శ్రమించినా తలైవాస్ మోహిత్, మంజీత్‌ల పటిష్టమైన డిఫెన్స్‌ను చేధించడంలో సఫలం కాలేకపోయారు. అంతకుముందు జరిగిన మరో లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చున్ జెయింట్స్ 42-24 తేడాతో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్‌పై ఘన విజయం సాధించింది.

నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో జైపూర్ పింక్ పాంథర్స్; పుణేరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి. మ్యాచ్‌లను రాత్రి గం. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

నాది నిర్ణయలోపమే

ఫైనల్లో ఓవర్‌త్రో అంశంపై అంపైర్ ధర్మసేన వ్యాఖ్య

కొలంబో: ప్రపంచకప్ ఫైనల్ ఫలితాన్ని ప్రభావితం చేసిన ఓవర్‌త్రోకు ఆరు పరుగులు ఇవ్వడంపై తానేమీ చింతించట్లేదని ఆ మ్యాచ్‌కు అంపైర్‌గా వ్యవహరించిన కుమార్ ధర్మసేన (శ్రీలంక) స్పష్టం చేశారు. ఇంగ్లండ్ జట్టుకు ఆరు పరుగులు కేటాయించడం తన నిర్ణయ లోపమేనని ఒప్పుకున్న ధర్మసేన ఆ సమయంలో అదే సరైనదిగా తోచిందని అన్నారు. 'ఓవర్‌త్రోకు ఐదుకు బదులు ఆరు పరుగులు ఇవ్వడం నా నిర్ణయ లోపమే. అది ఇప్పుడు టీవీ రీప్లేలు చూస్తే తెలుస్తోంది. కానీ ఆ సమయంలో మైదానంలో ఉన్నపుడు అది సముచితంగా అనిపించింది. నిర్ణీత సమయంలో తీసుకున్న నా నిర్ణయాన్ని ఐసీసీ అప్పుడు ప్రశంసించింది కూడా. ఇప్పుడు దాని గురించి నాకు చింత లేదు' అని ధర్మసేన వివరించారు. లైగ్ అంపైర్ మారిస్ ఎరాస్మస్‌తో చర్చించాకే ఆరు పరుగులు కేటాయించానని ధర్మసేన తెలిపారు.

శ్రీజ తడాఖా

- కామన్వెల్త్ టీటీ చాంపియన్‌షిప్‌లో మూడు పతకాలు ఖాయం
- మిక్స్‌డ్ డబుల్స్‌లో సత్యన్-అర్చన జంటకు స్వర్ణం

కటక్: స్వదేశంలో జరుగుతున్న కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ అదరగొట్టే ప్రదర్శన చేసింది. మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో సెమీఫైనల్ చేరి కనీసం రెండు కాంస్య పతకాలను ఖాయం చేసుకున్న శ్రీజ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మాత్రం సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. క్వాలిఫయర్ హోదాలో మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన శ్రీజ క్వార్టర్ ఫైనల్లో 11-5, 11-6, 11-9, 17-19, 6-11, 17-15తో సుతీర్థ ముఖర్జీ (భారత్)పై అద్భుత విజయం సాధించింది. అంతకుముందు శ్రీజ తొలి రౌండ్‌లో 11-6, 11-5, 6-11, 12-10, 11-7తో సాగరిక ముఖర్జీ (భారత్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 6-11, 15-13, 13-11, 11-3, 11-8తో చార్లోటి క్యారీ (వేల్స్)పై గెలిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో మధురిక పాట్కర్ (భారత్)తో శ్రీజ ఆడుతుంది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో శ్రీజ-మౌసుమి పాల్ (భారత్) జంట 11-4, 11-8, 7-11, 11-8తో జాంగ్ వాన్ లింగ్-తాన్ లిలిన్ జాసీ (సింగపూర్) జోడీపై విజయం సాధించి సెమీస్‌కు చేరింది. మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో శ్రీజ-ఆచంట శరత్ కమల్ (భారత్) జంట 11-13, 11-8, 11-6, 8-11, 4-11తో పాంగ్ యు ఎన్ కొయెన్-గోయ్ రుయ్ జువాన్ (సింగపూర్) జోడీ చేతిలో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది

మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్‌కే చెందిన సత్యన్ జ్ఞానశేఖరన్-అర్చన కామత్ (భారత్) జంట స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో సత్యన్-అర్చన జంట 11-1, 11-7, 11-4తో పాంగ్ యు ఎన్ కొయెన్-గోయ్ రుయ్ జువాన్ (సింగపూర్) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో సత్యన్, హర్మీత్ దేశాయ్ (భారత్) సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

సెమీస్‌లో ఓడిన పేస్ జంట

న్యూపోర్ట్ (అమెరికా): హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత దిగ్గజం లియాండర్ పేస్ పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్‌లో పేస్-మార్కస్ డానియల్ (న్యూజిలాండ్) ద్వయం సెమీఫైనల్లో పోరాడి ఓడిపోయింది. మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-సెర్గీ స్తకోవ్‌స్కీ (ఉక్రెయిన్) జోడీతో జరిగిన సెమీఫైనల్లో పేస్-డానియల్ జంట 6-3, 6-7 (8/10), 9-11తో ఓటమి చవిచూసింది. సెమీస్‌లో ఓడిన పేస్ జోడీకి 9,180 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 6 లక్షల 32 వేలు)తోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత్ X ఇండోనేసియా

సుజౌ (చైనా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు క్వార్టర్స్‌లో ఇండోనేసియాతో తలపడనుంది. ఆదివారం గ్రూప్ 'సి'లో తమ చివరి లీగ్ మ్యాచ్ ఆడిన భారత జట్టు 1-4 తేడాతో దక్షిణ కొరియా చేతిలో ఓటమి పాలైంది. గ్రూప్‌లో రెండు విజయాలు, ఒక పరాజయంతో రెండో స్థానంలో నిలిచిన భారత్ క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. బాలుర డబుల్స్ విభాగంలో ఇషాన్ భట్నాగర్‌తో జట్టు కట్టిన తెలంగాణ ఆటగాడు పంజాల విష్ణు వర్ధన్ గౌడ్ 17-21, 15-21తో డాంగ్ జు కీ- జూన్ యంగ్ కిమ్ (కొరియా) చేతిలో ఓడారు. ఇండోనేసియా, భారత్‌ల మధ్య సోమవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
22-7-2019

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
560 ▼	178 ▼
38,337	11,419

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	8,147	▼ 61
డోజోన్స్	27,154	▼ 69
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,509	▲ 16
డాక్స్	12,260	▲ 32
షాంఘై	2,924	▲ 23
నికాయ్	21,467	▲ 421

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	68.00	69.64
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	84.83	87.92
€	యూరో	ఎస్‌బీఐ	76.16	79.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.79	65.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.77	49.97
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.82	51.68
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.62	19.33
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	18.04	19.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.38	10.74

ఈ ప్రోత్సాహకాలు లాభాన్నిచ్చేవే..!

కొన్ని ఆప్షన్లు కంపెనీలకే కాదు... వినియోగదారులకూ మేలు చేస్తాయి. ఉదాహరణకు జీవిత బీమా పాలసీ అనేది, పెరిగే బాధ్యతలకు అనుగుణంగా కవరేజీ దానంతట అదే పెరుగుతూ వెళితే ఎంత సౌకర్యంగా ఉంటుందో ఆలోచించండి. అలాగే, సెక్షన్ 80సీ కింద పన్ను రాయితీలు కూడా. సంబంధిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే వారి ఆర్థిక జీవితం మెరుగ్గా ఉంటుంది. అదే సమయంలో వారి పెట్టుబడులపై కంపెనీలకు రాబడులు వస్తాయి. ఇటు వ్యక్తిగతంగా లాభాలను చేకూర్చుతూనే మరోవైపు ఆర్థికవ్యవస్థకూ ప్రయోజనం చేసే పథకాల గురించిన చర్చే ఈ వారం ప్రాఫిట్ ప్లస్ కథనం...

- మ్యూచుఫల్ ఫండ్స్‌లో టాపప్ సిప్
- సేవింగ్స్ ఖాతా కంటే లిక్విడ్ ఫండ్స్ బెటర్
- ఇన్వెస్టింగ్‌ను సులభం చేసే బ్యాలెన్స్‌డ్ ఫండ్స్
- బ్యాంకుల్లోనూ అధిక రాబడులకు స్వీప్ అకౌంట్లు
- ఉన్న బీమా పాలసీల్లోనే కవరేజీ పెంపు

మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారిలో చాలా మంది తమ పెరుగుతున్న ఆదాయానికి తగినట్టు పెట్టుబడులను పెంచుకోరు. ఇటువంటి వారిని దృష్టిలో ఉంచుకుని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు (ఏఎంసీలు) స్టెప్ అప్ లేదా టాపప్ సిప్‌లను ఆఫర్ చేస్తున్నాయి. అంటే ప్రతి నెలా చేస్తున్న సిప్ మొత్తం, నిర్ణీత కాలానికి ఓ సారి (వార్షికంగా లేదా మీరు నిర్ణయించిన దాని ప్రకారం) నిర్ణీత శాతం పెరుగుతూ ఉంటుంది. దీంతో, ఇన్వెస్టర్లు స్వయంగా సిప్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉండదు. ఒక్క టాపప్ సిప్ ఆప్షన్ ఎంచుకుంటే చాలు, మ్యూచువల్ ఫండ్స్ సంస్థే ఆ పని చేసేస్తుంది.

●●●

ఇక బ్యాంకు సేవింగ్స్ ఖాతాల్లో రాబడులు తక్కువేనన్న విషయం తెలిసిందే. సేవింగ్స్ ఖాతాలో మిగులు నిధులను, లిక్విడ్ ఫండ్స్‌లోకి సులభంగా బదలాయించుకోవడం ద్వారా అధిక రాబడులు పొందే అవకాశాన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు కల్పిస్తున్నాయి. ఫలితంగా లిక్విడ్ ఫండ్స్‌లోకి నిధుల రాక పెరిగింది. ఉదాహరణకు ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ సంస్థ 'యాక్టివ్ అకౌంట్ యాప్'ను ఆఫర్ చేస్తోంది. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, తమ వివరాలను ఇవ్వడం ద్వారా అకౌంట్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత ఒక్క సింగిల్ క్లిక్‌తోనే ఈ యాప్ సాయంతో బ్యాంకు సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్‌ను లిక్విడ్ ఫండ్‌లోకి పంపుకోవచ్చు.

●●●

మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది అనుకుంటుంటారు. కానీ, పెట్టుబడుల కేటాయింపు విషయంలో వారికి సమస్య ఎదురవుతుంది. ఈక్విటీల్లో ఎంత ఇన్వెస్ట్ చేయాలి, డెట్‌లో ఎంత ఇన్వెస్ట్ చేయాలన్నది వారి సందేహం. ఇన్వెస్టర్ల తరపున ఈ బాధ్యతను తీసుకుని ఇన్వెస్ట్ చేసేవే బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్. ''ఈక్విటీల విలువ (వ్యాల్యూషన్స్) పెరిగిందనుకోండి, ఆ సమయంలో ఈక్విటీల్లో పెట్టుబడులను తగ్గించి, డెట్ విభాగంలో పెట్టుబడులు పెంచడం ఈ పథకాల్లో జరుగుతుంది. అలాగే, ఈక్విటీ మార్కెట్లు బాగా దిద్దుబాటుకు గురై, స్టాక్స్ ఆకర్షణీయంగా ఉన్నాయనుకోండి, అప్పుడు డెట్ విభాగంలో పెట్టుబడులు తగ్గించి, ఈక్విటీల్లో పెంచడం జరుగుతుంది. దీంతో ఈక్విటీ మార్కెట్లు అస్థిరతంగా మారినా, డెట్ విభాగంలోని పెట్టుబడుల వల్ల ఆ ప్రభావం తగ్గించడం జరుగుతుంది'' అని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సీఐవో, ఈడీ ఎస్.నరేన్ తెలిపారు.

స్వీప్ అకౌంట్లు

ఇప్పుడు చాలా బ్యాంకులు స్వీప్ అకౌంట్లను ఆఫర్ చేస్తున్నాయి. ఈ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ రూ.10,000-25,000 మధ్య ఉంటుంది. ఇది బ్యాంకులను బట్టి వేర్వేరుగా ఉండొచ్చు. నిర్ణీత బ్యాలెన్స్‌కు మించి అదనంగా ఉన్న బ్యాలెన్స్‌ను ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా బ్యాంకు మారుస్తుంది. ఇదంతా ఆటోమేటిగ్గా జరిగిపోతుంటుంది. సేవింగ్స్ ఖాతాల్లో బ్యాలెన్స్‌పై వార్షికంగా 3.5 శాతం వడ్డీనే గిడుతుందని తెలిసిందే. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చడం వల్ల అధిక వడ్డీ రేటు పొందే అవకాశం లభిస్తుంది. కస్టమర్ బ్యాంకుకు వెళ్లి తన సేవింగ్స్ బ్యాంకు ఖాతాను స్వీప్ అకౌంట్‌గా మార్చుకుంటే సరిపోతుంది.

బీమా డిజైనర్ పాలసీలు

వ్యక్తి వయసును బట్టి వివిధ దశల్లో బీమా కవరేజీ అవసరాలు మారిపోతుంటాయి. యువతీ, యువకులు వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత బాధ్యతలు అధికమవుతాయి. అలాగే, వారికి పిల్లలు జన్మించిన తర్వాత బాధ్యతలు ఇంకాస్త పెరుగుతాయి. అందుకనే బీమా సంస్థలు వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా డిజైన్ చేసిన పాలసీలను ఆఫర్ చేస్తున్నాయి. టర్మ్ ప్లాన్‌లలో సమ్ అష్యూరెన్స్ నిర్ణీత కాలానికి (ఐదేళ్లు) ఒకసారి ఆటోమేటిగ్గా పెరిగిపోతుంది. సాధారణ టర్మ్ ప్లాన్ తీసుకుని, తమ అవసరాలకు అనుగుణంగా మళ్లీ అదనపు టర్మ్ ప్లాన్ తీసుకోవడం, అందుకోసం వైద్య పరీక్షలు తరహా ఫార్మాలిటీస్‌ను పూర్తి చేయడం కంటే బీమా మొత్తాన్ని పెంచుకునేందుకు ఈ తరహా పాలసీలు అనుకూలంగా ఉంటాయి. విడిగా టర్మ్ ప్లాన్ తీసుకోవడంతో పోలిస్తే, ఇలా ఉన్న ప్లాన్‌లోనే ఆటోమేటిగ్గా కవరేజీ పెరగడం వల్ల చెల్లించాల్సిన ప్రీమియం తక్కువగా ఉండడం మరో సానుకూలత.

పన్ను రాయితీలు..

ఇక కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఆదాయపన్ను రాయితీలు కూడా... వ్యక్తులు తమ ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపరిచేందుకు ఇస్తున్న ప్రోత్సాహకాలుగానే చూడాల్సి ఉంటుంది. రాయితీల కోసమైనా వ్యక్తులు జీవిత బీమా, రిటైర్మెంట్ ప్లాన్లు, ఇతర పెట్టుబడి సాధనాల వంటి వాటిపైపు దృష్టి సారిస్తారని అంచనా. ఆర్థిక సంవత్సరం చివర్లో సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలకు అర్హమైన పథకాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వేతన జీవులు పరుగులు పెట్టడం ఇదే తెలియజేస్తుంది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఈటీఎఫ్ (సీపీఎస్ఈ ఈటీఎఫ్)లో పెట్టుబడులకూ ఇకపై సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాన్ని కల్పిస్తున్నట్టు తాజా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం మరొకటి. ఇక విశ్రాంత జీవన అవసరాలను ముందుగానే గుర్తించి, రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయించేందుకు ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులకూ కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల ఆదాయ రాయితీకి అదనంగా ఎన్‌పీఎస్‌లో రూ.50వేల పెట్టుబడికి సెక్షన్ 80సీసీడీ 1బీ కింద పూర్తి పన్ను ప్రోత్సాహకాలు ఉన్నాయి. తాజా బడ్జెట్‌లోనూ ఎన్‌పీఎస్ పథకానికి సంబంధించి రాయితీలను కల్పించారు.

లైఫ్‌సైకిల్ ఫండ్

ఇక ఎన్‌పీఎస్ పథకంలోని లైఫ్‌సైకిల్ ఫండ్ కూడా ప్రోత్సాహకమే. ఎన్‌పీఎస్‌లో చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లకు ఈక్విటీలు, కార్పొరేట్, ప్రభుత్వ బాండ్లు, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఏ విభాగంలో ఎంత ఇన్వెస్ట్ చేయాలనే విషయాన్ని క్లిష్టంగా చూస్తున్నారు. అదే లైఫ్ సైకిల్ ఫండ్ ఎంచుకుంటే, ఇన్వెస్టర్ వయసు ఆధారంగా ఆయా విభాగాలకు కేటాయింపులు జరుగుతుంటాయి. వయసు పెరుగుతూ, రిటైర్మెంట్ సమీపిస్తుంటే, ఈక్విటీలకు వాటా తగ్గుతూ డెట్ విభాగాలకు పెరగడం ఇందులో చూడొచ్చు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో అందుబాటు ధరల గృహాలకు (రూ.45 లక్షల వరకు) మరో ప్రోత్సాహకంగా, ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ రాయితీని మరో రూ.1.5 లక్షలు పెంచారు. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ రూ.3.5 లక్షల వరకు ఆదాయపన్ను రాయితీ పొందొచ్చు. ఇది మొదటిసారి ఇంటి కొనుగోలుదారులకు ప్రోత్సాహకంగానే పనిచేస్తుందన్నారు దీపేష్ రాఘవ్.

ప్రోత్సాహకాలతో జాగ్రత్త

- ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్స్ ఆన్‌లైన్‌లోనే, కొన్ని క్లిక్‌లతోనే పొందొచ్చనే ఆఫర్లను ప్రోత్సాహకాలుగా చూడొద్దు. ఇవి అధిక రుణ భారం పెంచే ప్రమాదం ఉంది.
- ప్రతీ నెలా మీ చేతికి అందే వేతనంలో ఇంటి రుణ ఈఎంఐ 50 శాతం మించకుండా చూసుకోవాలి.
- వినియోగ వస్తువులకు రుణాలను తీసుకోరాదన్న సూత్రానికి కట్టుబడి ఉండాలి. కేవలం ఇల్లు వంటి విలువైన ఆస్తి సమకూర్చుకునేందుకు రుణం తీసుకోవడం సమంజసం అవుతుంది.
- ఆకట్టుకునే బెనిఫిట్స్‌ను చూపించి సంప్రదాయ ఎండోమెంట్ బీమా పాలసీలను అంటగట్టే ప్రయత్నాన్ని బీమా సంస్థలు, ఏజెంట్లు చేస్తుంటారు. వీటిల్లో రాబడుల తక్కువగా ఉంటాయన్న విషయాన్ని గమనించాలి. ప్రత్యేకించి ఆయా సందర్భాల్లో రాబడులపై దృష్టి పెట్టాలి.
- మాల్స్‌కు వెళ్లినప్పుడు వారి మాయల్లో పడి ఏవి పడితే అవి కొనుగోలు చేయకుండా ఉండేందుకు గాను క్రెడిట్, డెబిట్ కార్డుల వంటి ప్లాస్టిక్ మనీని తీసుకెళ్లొద్దు. కావల్సినంత నగదునే వెంట తీసుకెళ్లడం మంచిది.

విద్యా రుణానికి మెరుగైన మార్గం

పేరున్న విద్యా సంస్థల్లో చదవడం ద్వారా తమ కెరీర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలన్న ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థుల్లో ఉంటుంది. కానీ, అందరికీ తగినంత ఆర్థిక స్థోమత ఉండకపోవచ్చు. పైగా విద్యా వ్యయాలు ఏటేటా భారీగానే పెరిగిపోతున్న పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనే అభిలాష కూడా ఇటీవలి కాలంలో పెరిగిపోతోంది. అయితే, ఇందుకోసం అయ్యేంత ఖర్చు సొంతంగా భరించే సామర్థ్యం లేదని వెనుకంజ వేయాల్సిన అవసరం లేదు. బ్యాంకుల నుంచి రుణం తీసుకోవడం ఓ మంచి మార్గం. 2015లో సగటు విద్యా రుణం సైజు రూ.5.73 లక్షలుగా ఉంటే, 2018లో రూ.8.5 లక్షలకు పెరిగినట్టు ట్రాన్స్ యూనియన్ సిబిల్ డేటా తెలియజేస్తోంది. మూడేళ్లలోనే 45 శాతం పెరుగుదల కనిపిస్తోంది. కనుక భారీ వ్యయాల కోసం రుణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఎదురుకావచ్చు. ఈ పరిస్థితుల్లో తమ పిల్లల ఉన్నత విద్య కోసం రుణాలు తీసుకునే వారు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి తెలియజేసే కథనమే ఇది.

- సులభంగానే రుణ సదుపాయం
- తక్కువ వడ్డీ రేటుకూ ఆఫర్
- ప్రధానమంత్రి విద్యాలక్ష్మి స్కీమ్ ద్వారా కేంద్రం సాయం
- ఈ పోర్టల్‌లో సమగ్ర వివరాలు
- ఇక్కడి నుంచే దరఖాస్తుకు అవకాశం

విద్యా రుణం తీసుకోవడానికి ముందు ప్రతీ ఒక్కరూ ఏ బ్యాంకులో తక్కువ వడ్డీ రేటు ఉంది, చెల్లింపుల సౌలభ్యాన్ని విచారించుకోవడం ఎంతైనా అవసరం. రుణాలపై వడ్డీ రేట్ల వివరాలను ఆయా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల వెబ్‌సైట్ల సాయంతో తెలుసుకోవచ్చు. ముఖ్యంగా ప్రధానమంత్రి విద్యా లక్ష్మి స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం విద్యా లక్ష్మి పోర్టల్ ద్వారా ఈ విషయంలో పూర్తి సహకారం కూడా అందిస్తోంది. విద్యా రుణం గురించి వివరాలు తెలుసుకోవడంతోపాటు దరఖాస్తు చేసుకోవడం, ఆ దరఖాస్తు తీరు తెన్నులను ట్రాక్ చేసుకునేందుకు ఈ పోర్టల్ సాయపడుతుంది. దీంతో ఆకర్షణీయమైన వడ్డీ రేటుతో, చెల్లింపుల పరంగా సౌకర్యంగా ఉన్న బ్యాంకు నుంచి రుణానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

మార్జిన్ మనీ

కోర్సు ఫీజుల అవసరాలకు అనుగుణంగా బ్యాంకులు నూరు శాతం వరకు రుణాన్ని సర్దుబాటు చేస్తాయి. అయితే, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. రూ.4 లక్షల వరకు రుణానికి మార్జిన్ మనీ (సొంతంగా సమకూర్చుకోవాల్సిన మొత్తం) అవసరం. దేశీయంగానే ఉన్నత విద్య చదవాలనుకుంటే అందుకు అయ్యే వ్యయంలో 5 శాతాన్ని మార్జిన్ మనీగా సమకూర్చుకోవాలి. అదే విదేశాల్లో విద్య కోసం రుణం తీసుకునేవారు 15% మార్జిన్ మనీ రెడీ చేసుకోవాల్సి ఉంటుంది. విద్యా రుణం మొత్తం రూ.4లక్షలకు మించకపోతే బ్యాంకులు హామీ కోరవు. రూ.4లక్షల నుంచి రూ.7.5 లక్షల మధ్య ఉంటే హామీదారును అడుగుతాయి. రూ.7.5 లక్షలకు మించి రుణం తీసుకోదలిస్తే ఆస్తులను తనఖాగా ఉంచాలని కోరతాయి. రుణాల చెల్లింపుల్లో వైఫల్యం చోటు చేసుకుంటే వసూలు కోసం వీటిని కోరడం జరుగుతుంది.

> దరఖాస్తుదారు విద్యాలక్ష్మి పోర్టల్‌లో తప్పకుండా నమోదు చేసుకోవాలి. కామన్ ఎడ్యుకేషన్ లోన్ దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, అవసరమైన వివరాలన్నింటినీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తును పూర్తి చేసిన అనంతరం దరఖాస్తుదారుడు విద్యా రుణం కోసం పోర్టల్‌లో సెర్చ్ చేసి, తన అవసరాలు, సౌలభ్యాలకు అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవచ్చు. ఇక్కడ పూర్తి చేసే దరఖాస్తు పత్రాన్ని అన్ని బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి. అందుకే దీన్ని ఉమ్మడి దరఖాస్తు పత్రంగా పేర్కొన్నారు.

క్రెడిట్ స్కోర్

సాధారణంగా విద్యారుణం తీసుకునే వారికి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు గ్యారంటార్‌గా ఉంటారు. విద్యార్థికి క్రెడిట్ స్కోరు ఉండదు కనుక కుటుంబ సభ్యుల్లో ఒకరు గ్యారంటార్‌గా ఉండాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో హామీదారుగా ఉండేందుకు ముందుకు వచ్చే వారికి క్రెడిట్ స్కోరు తగినంత ఉండేలా చూసుకోవాలి. అప్పుడే రుణ దరఖాస్తు తిరస్కరణకు గురికాకుండా చూసుకోవచ్చు. 750పైన క్రెడిట్ స్కోరు ఉంటే రుణం సులభంగా రావడంతోపాటు, వడ్డీ రేటు తక్కువకు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. లేదంటే పిల్లల విద్యావకాశాలపై ప్రతికూలత ఏర్పడుతుంది.

సక్రమంగా చెల్లింపులు



మొదటి నెల నుంచే తీసుకున్న రుణంపై వడ్డీ జమ అవడం మొదలవుతుంది. కాకపోతే రుణం తీసుకున్న తర్వాత ఈఎంఐల చెల్లింపులు మొదలు కావడానికి మధ్యలో గ్రేడ్ పీరియడ్ ఉంటుంది. విద్యార్థి కోర్స్ పూర్తి చేసుకున్న తర్వాత సాధారణంగా ఒక ఏడాది పాటు ఇది ఉంటుంది. అయితే, ఈ కాలంలో వడ్డీ భారం పెరిగిపోకుండా, వేగంగా రుణ చెల్లింపులు పూర్తయ్యేందుకు గాను తల్లిదండ్రులు ప్రతీ నెలా కొంత మేర చెల్లించడం మంచి ప్రణాళిక అవుతుంది.

అదనపు ప్రయోజనాలు

విద్యా రుణం తీసుకోవడం వల్ల పన్ను ఆదా వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంపై చెల్లించే వడ్డీకి పూర్తిగా పన్ను మినహాయింపు పొందొచ్చు. విద్యా రుణం తీసుకుని, సక్రమ చెల్లింపులు చేయడం వల్ల మంచి క్రెడిట్ స్కోరు కూడా నమోదవుతుంది. ఈ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పిల్లల విద్యా రుణానికి సంబంధించి ప్రణాళిక వేసుకోవాలి.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జూలై-19-2019 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	3-5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	7	7.3	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.5	7	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.75	6.5
కెనరా బ్యాంక్	6.7	6.7	6.4
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.5	6.65	6.45
కార్పొరేషన్ బ్యాంక్	6.35	7	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.1	7.3	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	6.75	7	7.25
ఐడీబీఐ బ్యాంక్	6.5	7.25	6.85
ఇండస్‌ఇండ్ బ్యాంక్	7.25	7.75	7.5
కోటక్ మహీంద్రా బ్యాంక్	7	7.2	7
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5	6.85	6.75
పీఎన్‌బీ	6.75	6.85	6.25
ఎస్‌బీఐ	6.4	7	6.7
సిండికేట్ బ్యాంక్	6.35	7.05	7.15
యస్ బ్యాంక్	7.15	7.75	7.25

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

ఏ పరిస్థితులకైనా అనువైన ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారి ముందు లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ తదితర ఎన్నో ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ మార్కెట్ విలువ ఆధారంగా ప్రత్యేకించి చిన్న, మధ్య, పెద్ద సైజు కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే పథకాలు. లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే... మధ్య, చిన్న స్థాయి కంపెనీలకు దీర్ఘకాలంలో వృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మరి దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసే వారు వీటిల్లో ఏ కంపెనీ అని ఎంపిక చేసుకోవాలి...? ఎక్కువ మంది ఇన్వెస్టర్లకు ఎదురయ్యే సందేహం ఇదే. ఇటువంటి వారికి మల్టీక్యాప్ పథకాలు అనువుగా ఉంటాయి. ఇవి ఒకే తరహా మార్కెట్ సైజు కలిగిన కంపెనీల్లో కాకుండా, లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ విభాగాల్లో మంచి వృద్ధి, రాబడులకు అవకాశాలున్న కంపెనీలను పెట్టుబడులకు ఎంచుకుంటాయి. తద్వారా దీర్ఘకాలంలో మార్కెట్లను మించి రాబడులను ఇచ్చే ప్రయత్నం చేస్తుంటాయి. ఈ మల్టీక్యాప్ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ పథకం మంచి పనితీరు చూపించిన వాటిల్లో ఒకటి.

రాబడులు..: బెంచ్ మార్క్ సూచీతో పోలిస్తే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ ఫండ్ ఒక్క మూడేళ్ల కాలంలో మినహా... ఏడాది, ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్లు, పదిహేనేళ్ల కాల రాబడుల్లో ముందుంది. ప్రతీ నెలా రూ.15,000ను సిప్ రూపంలో 15 ఏళ్ల పాటు ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే నేడు రూ.56.4 లక్షలు సమకూరేది. ఇందులో అసలు పెట్టుబడి రూ.18 లక్షలు. ఏటా 14 శాతం కాంపౌండెడ్ వృద్ధి రేటు ఇది. కానీ, ఇదే కాలంలో ఈ పథకం రాబడులకు ప్రామాణికంగా చూసే బీఎస్ఈ 500 టీఆర్ఐ కాంపౌండెడ్‌గా ఇచ్చిన వార్షిక రాబడి 14 శాతంగానే ఉంది. ఈ పథకం ఏడాదిలో 5.38 శాతం రాబడులు ఇవ్వగా, మూడేళ్లలో 9.60 శాతం, ఐదేళ్లలో 10.98 శాతం, పదేళ్లలో 13.44 శాతం వార్షిక ప్రతిఫలాన్నిచ్చింది. బీఎస్ఈ 500 టీఆర్ఐ రాబడులు ఏడాదిలో 1.75 శాతం, మూడేళ్లలో 10.47 శాతం, ఐదేళ్లలో 9.85 శాతం, పదేళ్లలో 11.70 శాతం రాబడులు ఇచ్చింది. భిన్న మార్కెట్లలోనూ ఈ పథకం స్థిరమైన పనితీరు చూపించిన నేపథ్యంలో దీర్ఘకాల పెట్టుబడుల కోసం ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

పెట్టుబడుల విధానం..: మల్టీక్యాప్ కావడంతో వృద్ధి అవకాశాలు ఎక్కువగా ఏ విభాగంలో ఉంటే, ఆయా విభాగంలోని కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసుకునే వెసులుబాటు ఈ పథకాలకు ఉంటుంది. దాంతో మంచి రాబడులను ఇవ్వగలవు. వృద్ధి అవకాశాలు, విలువ పరంగా చౌకగా ఉన్న వాటిని ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. భిన్న రంగాల్లో ఇన్వెస్ట్ చేయడంతోపాటు, అదే సమయంలో ఒకే రంగంలో ఎక్కువ ఎక్స్‌పోజర్ లేకుండా రిస్క్ చర్యలను కూడా ఈ పథకంలో గమనించొచ్చు. ఇటువంటి చర్యలతోనే ఈ పథకం స్థిరమైన రాబడులను ఇవ్వగలుగుతోంది. ఇక స్మాల్ క్యాప్‌నకు ఎంత, మిడ్‌క్యాప్‌నకు ఎంత, లార్జ్‌క్యాప్‌నకు ఎంత మొత్తం పెట్టుబడులు కేటాయించాలనే విషయంలో ఈ పథకానికి ఓ నమూనా కూడా ఉంది. ప్రస్తుతం ఈ పథకం ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్, టెలికం, విద్యుత్, కన్స్యూమర్ ఆధారిత కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసి ఉంది.

టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఎన్‌టీపీసీ	5.66
ఎస్‌బీఐ	5.42
భారతీ ఎయిర్‌టెల్	4.89
ఇన్ఫోసిస్	4.61
ఐసీఐసీఐ బ్యాంకు	4.15
ఎల్అండ్‌టీ	4.14
ఐటీసీ	3.19
ఓఎన్‌జీసీ	3.15
వేదాంత	2.79
యాక్సిస్ బ్యాంకు	2.49



"విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి చేసే పెట్టుబడి అత్యుత్తమ ప్రయోజనాన్ని అందిస్తుంది."
- బెంజమిన్ ఫ్రాంక్లిన్, అమెరికన్ మేధావి

బొమ్మ-బొరుసు

ఒడిదుడుకుల వారం..!

- గురువారం జూలై సిరీస్ ఎఫ్ అండ్ ఓ ముగింపు
- మారుతి సుజుకి, ఎల్ అండ్ టీ, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాలు ఈవారంలోనే..
- నెమ్మదించిన వినియోగం, పేలవమైన ఫలితాలు, పన్ను అంశాలతో దెబ్బతిన్న సెంటిమెంట్

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో గత వారం నష్టాలను నమోదుచేసిన దేశీ స్టాక్ సూచీలు.. ఈవారంలో భారీ ఒడిదుడుకుల మధ్య ఊగిసలాడే ఆస్కారం ఉందని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. ఇప్పటివరకు వెల్లడైన పలు దిగ్గజ కంపెనీల మొదటి త్రైమాసిక ఫలితాలు నిరాశపరచడం, కేంద్ర బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై సర్‌చార్జ్ పెంపు ప్రతిపాదనలు, వినియోగం నెమ్మదించడం వంటి ప్రతికూల అంశాల నేపథ్యంలో నష్టాల బాట పట్టిన సూచీలు.. ఇక్కడ నుంచి మరింత పతనమై కీలక దీర్ఘకాలిక మద్దతు స్థాయిలను కోల్పోతాయా? లేదంటే, నిలదొక్కుకుంటాయా అనే అంశానికి ఈవారం ట్రేడింగ్ దిశా నిర్దేశం చేయనుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం మార్కెట్ ముగిసిన తరువాత రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ జూన్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించగా.. వీటి క్యూ1 ఫలితాల ప్రభావం సోమవారం ట్రేడింగ్‌పై ఉండనుందని, ప్రధాన సూచీల్లో భారీ వెయిటేజ్ ఉన్న ఈ రెండు దిగ్గజ కంపెనీలు మార్కెట్‌ను ఆడుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈవారంలోని మిగిలిన రోజుల్లో ట్రేడింగ్ ఎలా ఉన్నప్పటికీ.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆశాజనక ఫలితాలను ప్రకటించడం, ఆర్‌ఐఎల్ ఫలితాలు అంచనాలను మించడం అనేవి సోమవారం సూచీల దిశను నిర్దేశించే ప్రధాన అంశాలుగా ఉన్నాయని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. ఇక వారం మొత్తం మీద భారీ ఒడిదుడుకులకే ఆస్కారం ఉందని సాహిల్ ఎడెల్వీస్ వెల్త్ మేనేజ్‌మెంట్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ సాహిల్ కపూర్ అన్నారు. జూలై 25న (గురువారం) జూలై సిరీస్ ఎఫ్ అండ్ ఓ ముగింపు ఉన్నందున ఒడిదుడుకులు అధిక స్థాయిలోనే ఉండేందుకు అవకాశం ఉందన్న ఆయన.. తన అంచనా ప్రకారం నిఫ్టీ 11,650 పాయింట్లకు చేరనుందని, భారీగా పతనమైన అనేక షేర్లకు కొనుగోలు మద్దతు లభించనుందని విశ్లేషించారు. ఫలితాల సీజన్ కొనసాగుతున్నందున ఈవారంలో ఇదే అంశం కీలకంగా మారిందని, ఎంపిక చేసిన షేర్లకు మాత్రమే కొనుగోలు మద్దతు లభించనుందని భావిస్తున్నట్లు ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ అడ్వైజర్స్ చైర్మన్ డీ కే అగర్వాల్ అన్నారు.

ఈవారంలో దిగ్గజ కంపెనీల ఫలితాలు..
నిఫ్టీ 50లోని కంపెనీల జాబితాలో.. హిందుస్తాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎల్ అండ్ టీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, మారుతి సుజుకి, బజాజ్ ఆటో, ఐసీఐసీఐ బ్యాంక్, వేదాంత, బజాజ్ ఫిన్ సర్వ్ ఫలితాలు ఈవారంలోనే వెల్లడికానున్నాయి.

బ్యాంకింగ్ రంగ ఫలితాల్లో..
బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, సిండికేట్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, సౌత్ ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ ఫలితాలు ఈవారంలో వెల్లడికానున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల్లో ఎం అండ్ ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఫలితాలను ప్రకటించనున్నాయి.

250 కంపెనీల ఫలితాలు ఈవారంలోనే..
డీహెచ్‌ఎఫ్‌ఎల్, టీవీఎస్ మోటార్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, జస్ట్ డయల్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్, యునైటెడ్ స్పిరిట్స్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్, జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్, ఒబెరాయ్ రియల్టీ, రిలయన్స్ నిప్పన్ లైఫ్, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్, టాటా స్టీల్ బీఎస్ఎల్, అంబుజా సిమెంట్స్, బయోకాన్, టోరెంట్ ఫార్మా, హావెల్స్ ఇండియా, ఎస్కార్ట్స్ కంపెనీల ఫలితాలు ఈవారంలో విడుదలకానున్నాయి. మార్కెట్ వర్గాలు కంపెనీల ఫలితాలపై భారీ ఆశలనే పెట్టుకోగా.. ఇవి మొత్తంగా నిరాశపరిచే విధంగానే ఉన్నట్లు తాను భావిస్తున్నట్లు సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమిత్ మోడీ అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న దిద్దుబాటు మరి కొంత కాలం ఉండవచ్చని, వర్షాల ఆధారంగా తరువాతి కదలికలు ఉండవచ్చని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ విశ్లేషించారు.

అంతర్జాతీయ అంశాల ప్రభావం..
గురువారం యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్ల ప్రకటన ఉండగా.. అమెరికా జీడీపీ అడ్వాన్స్ రీడింగ్ శుక్రవారం ప్రచురితంకానుంది.

వెనక్కు తగ్గిన ఎఫ్‌పీఐలు

జూలైలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) జూలై 1-19 కాలానికి ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.7,712 కోట్లను ఉపసంహరించుకున్నట్లు డిపాజిటరీల డేటా ద్వారా వెల్లడయింది. గడిచిన ఐదు నెలలుగా నికర పెట్టుబడిదారులుగా కొనసాగుతున్న వీరు.. సూపర్ రిచ్ ట్యాక్స్ అంశం కారణంగా ఈస్థాయిలో భారీ అమ్మకాలకు పాల్పడ్డారని తెలుస్తోంది. అయితే, డెట్ మార్కెట్‌లో రూ.9,371 కోట్లను పెట్టుబడి పెట్టడం ద్వారా ఈనెల్లో వీరి నికర పెట్టుబడి రూ.1,659 కోట్లు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 18% వృద్ధి

- రూ.5,676 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం నమోదు
- స్టాండలోన్ లాభంలో 21 శాతం వృద్ధి
- షేరుకు రూ.5 ప్రత్యేక డివిడెండ్

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు జూన్ త్రైమాసికానికి ఎప్పటి మాదిరే మంచి ఫలితాలను ప్రకటించింది. బ్యాంకు కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.4,808 కోట్లతో పోలిస్తే 18 శాతం పెరిగి రూ.5,676 కోట్లకు చేరుకుంది. కన్సాలిడేటెడ్ ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.28,000 కోట్లతో పోలిస్తే 19 శాతం వృద్ధితో రూ.34,324 కోట్లకు చేరింది. జూన్ త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం రూ.29,176 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.23,978 కోట్లుగానే ఉంది. ఇతర మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం సైతం రూ.4,021 కోట్ల నుంచి రూ.5,148 కోట్లకు పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ స్టాండలోన్ లాభం జూన్ క్వార్టర్‌లో రూ.5,568 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.4,601 కోట్లతో పోలిస్తే 21 శాతం వృద్ధి సాధ్యమైంది. స్టాండలోన్ ఆదాయం సైతం 22.7 శాతం వృద్ధితో రూ.32,361 కోట్లకు చేరుకుంది. బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు 1.40 శాతం, నికర ఎన్‌పీఏలు 0.43 శాతంగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో స్థూల ఎన్‌పీఏలు 1.33 శాతం, నికర ఎన్ పీఏలు 0.41 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగినట్టు తెలుస్తోంది. విలువ పరంగా చూస్తే బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు మొత్తం రుణాల్లో రూ.11,768 కోట్లు, నికర ఎన్‌పీఏలు 3,567 కోట్లుగా ఉన్నాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ.2,613 కోట్లుగా ఉన్నాయి. కన్సాలిటెడ్ రుణాలు 17 శాతం పెరిగి జూన్ చివరి నాటికి రూ.8,80,939 కోట్లుగా ఉన్నట్టు బ్యాంకు తెలిపింది. బ్యాంకు కార్యకలాపాలు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతీ షేరుకు రూ.5 చొప్పున ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని బ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది.

ఎగుమతుల వృద్ధికి సీఐఐ కీలక సూచనలు

న్యూఢిల్లీ: మహిళల వస్త్రాలు, ఔషధాలు, సైక్లిక్ హైడ్రోకార్బన్లు తదితర 31 ఉత్పత్తులు ఎగుమతుల పరంగా ఎక్కువ వృద్ధి అవకాశాలున్నట్టు పారిశ్రామిక సమాఖ్య సీఐఐ నివేదిక తెలిపింది. 8 నెలల తర్వాత దేశ ఎగుమతులు జూన్‌లో తిరోగమనంలోకి వెళ్లిన విషయం తెలిసిందే. జూన్‌లో ఎగుమతులు 9.71% తగ్గి 25 బిలియన్ డాలర్లకు పరిమితమైన నేపథ్యంలో సీఐఐ ఈ కీలక సూచనలు చేసింది. మన ఉత్పత్తులను వినియోగించే దేశాలతో సుంకాలు కాకుండా ఇతర అడ్డంకులు ఏవైనా ఉంటే వెంటనే వాటిని పరిష్కరించుకోవాలని కోరింది. ప్రముఖ అంతర్జాతీయ మార్కెట్లలో సదుపాయాల కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ''వేగంగా మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య దృశ్యం, కొత్త స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో ఎగుమతుల వ్యూహం అన్నది ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. భారత్ అంతర్జాతీయంగా కీలక ఎగుమతిదారుగా అవతరించతగిన ఉత్పత్తుల జాబితాను సీఐఐ గుర్తించి, వీటి ఎగుమతుల వృద్ధికి సూచనలు చేస్తోంది'' అని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు.

రూ.18,000 కోట్ల సమీకరణకు యాక్సిస్ బ్యాంకు నిర్ణయం

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంకు ఈక్విటీ షేర్ల జారీ, డిపాజిటరీ రిసీట్స్ లేదా కన్వర్టబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ.18,000 కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. సంబంధిత ప్రతిపాదనకు శనివారం నాటి బోర్డు సమావేశంలో ఆమోదం తెలిపినట్టు బ్యాంకు ప్రకటించింది. అయితే, ఎప్పుడు ఈ నిధుల సేకరణ కార్యక్రమం చేపట్టేదీ బ్యాంకు పేర్కొనలేదు.

ఈసారి ద్రవ్యోల్బణం 4.1 శాతం

భారత్‌లో ద్రవ్యోల్బణ అంచనాలను తగ్గించిన ఏడీబీ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో ద్రవ్యోల్బణం అంచనాలను ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) తగ్గించింది. ముందుగా అంచనా వేసిన దానికన్నా 0.2 శాతం తక్కువగా 4.1 శాతం స్థాయికి పరిమితం కావొచ్చని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 4.4 శాతంగా ఉండగలదని వివరించింది. రూపాయి బలపడటం, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)అంచనాలు తగ్గడం తదితర అంశాలు ద్రవ్యోల్బణ తగ్గుదలకు కారణాలు కాగలవని ఏడీబీ తెలిపింది. దక్షిణాసియా ప్రాంతంలో తక్కువ ద్రవ్యోల్బణం నమోదవడంలో భారత్ ప్రధాన చోదకంగా నిలుస్తుందని ఏషియన్ డెవలప్‌మెంట్ అవుట్‌లుక్ (ఏడీవో) 2019 అనుబంధ నివేదికలో ఏడీబీ తెలిపింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి ముందుగా భావించిన దానికన్నా 0.2 పర్సంటేజీ పాయింట్లు తక్కువగా 7 శాతానికి పరిమితం కాగలదని ఇందులో పేర్కొంది. 2019లో దక్షిణాసియా ద్రవ్యోల్బణం ముందుగా అంచనా వేసిన 4.7 శాతం కన్నా తక్కువగా 4.5 శాతం మేర నమోదు కాగలదని తెలిపింది.

వివిధ అంశాల కారణంగా సరఫరా, డిమాండ్‌పై ప్రభావం చూపుతూ బ్రెంట్ క్రూడాయిల్ రేట్ల హెచ్చుతగ్గులకు లోను కావడం కొనసాగుతుందని వివరించింది. వీటితో పాటు ఇతరత్రా దేశీయ అంశాల కారణంగా 2019, 2020లో వర్ధమాన ఆసియా దేశాల్లో ద్రవ్యోల్బణం ముందుగా అంచనా వేసినట్లు 2.5 శాతం కాకుండా 2.6 శాతంగా నమోదు కావొచ్చని ఏడీబీ తెలిపింది.

ఐదు రేటింగ్ ఏజెన్సీల పాత్రపైనా సెబీ దర్యాప్తు

న్యూఢిల్లీ: ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోయినా ఐఎల్ అండ్ ఎఫ్ ఎస్ గ్రూపు కంపెనీలకు మంచి రేటింగ్‌లు ఇచ్చిన విషయంలో రేటింగ్ ఏజెన్సీల పాత్రపై సెబీ తన దర్యాప్తును విస్తృతం చేయనుంది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కంపెనీలకు మంచి రేటింగ్‌లు ఇచ్చిన ఐదు కంపెనీల్లో... ఇప్పటికే రెండు రేటింగ్ ఏజెన్సీల సీఈవోలను సెబీ సూచన మేరకు బలవంతంగా సెలవుపై పంపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఐదు రేటింగ్ ఏజెన్సీలకు సంబంధించి తీవ్రమైన లోపాలు ఏవైనా చోటు చేసుకున్నాయా అన్న దానిపైనా సెబీ దృష్టి సారించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. రేటింగ్ విధానాలను ఉద్దేశపూర్వకంగా మార్చడంలో వ్యక్తుల పాత్రను కూడా పరిశీలించనున్నట్టు చెప్పాయి. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూపు కంపెనీల ఖాతాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తున్న గ్రాంట్ థార్న్‌టన్... గ్రూపు తీవ్రమైన నిధుల కొరత సమస్యను ఎదుర్కొంటోందని, ఆర్థిక పనితీరు బలహీనపడినట్టు రేటింగ్ ఏజెన్సీల ఉద్యోగులకు అవగాహన ఉందని, ఈమెయిల్స్ సంభాషణల ఆధారంగా గుర్తించి ప్రాథమిక నివేదికలో తెలియజేసింది. దీంతో సెబీ మరింత లోతుగా దర్యాప్తు చేయనుండడం గమనార్హం.

బోర్డ్ మీటింగ్స్

డీహెచ్‌ఎఫ్‌ఎల్, టీవీఎస్ మోటార్, యునైటెడ్ స్పిరిట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, జీ ఎంటర్‌టైన్‌మెంట్

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 22-7-2019

విశాఖ	350-00
చిత్తూరు	383-00
వరంగల్	328-00
విజయవాడ	340-00
నమక్కల్	380-00
గోదావరి	340-00
చెన్నై	390-00
ముంబై	415-00
21-7-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	325-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.85
బెంగళూరు	375-00
ఢిల్లీ	340-00
కోల్‌కతా	385-00

స్టాక్ స్టాప్

ఫెడరల్ బ్యాంక్ | **బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్** | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 99 **టార్గెట్ ధర:** రూ.125

ఎందుకంటే: ఈ ప్రైవేట్ రంగ బ్యాంక్ పనితీరు నిలకడగానే ఉంది. గత క్యూ4లో రూ.256 కోట్లుగా ఉన్న తాజా మొండి బకాయిలు ఈ క్యూ1లో రూ.415 కోట్లకు పెరిగాయి. ఒత్తిడి రిటైల్ రుణాలు కేరళలోనే అధికంగా ఉన్నాయి. భారీ వరదల కారణంగా కేరళలో పరిస్థితులన్నీ తల్లకిందులు కావడమే దీనికి కారణం. రికవరీ త్వరితంగానే ఉండగలదని యాజమాన్యం ఆశిస్తోంది. తాజా మొండి బకాయిల కారణంగా స్థూల మొండి బకాయిలు 2.99 శాతం నుంచి స్వల్పంగా పెరిగాయి. ఇతర ఆదాయం 45 శాతం వృద్ధితో రూ.392 కోట్లకు, నికర వడ్డీ ఆదాయం 18 శాతం వృద్ధితో రూ.1,154 కోట్లకు పెరిగాయి. మార్జిన్ లు 3.15 శాతంగా ఉన్నాయి. తాజా మొండి బకాయిలు పెరగడంతో కేటాయింపులు సీక్వెన్షియల్‌గా 8 శాతం పెరిగి రూ.192 కోట్లకు చేరాయి. నికర లాభం 46 శాతం వృద్ధితో రూ.384 కోట్లకు పెరిగింది. రుణాలు 19 శాతం వృద్ధి సాధించాయి. డిపాజిట్లు కూడా 19 శాతం పెరిగాయి. కొనసాగుతున్న వృద్ధి, నిలకడగా ఉన్న క్రెడిట్ కాస్ట్ వంటి అంశాల కారణంగా రిటర్న్ ఆన్ అసెట్(ఆర్‌ఓఏ) జోరుగా పెరగగలదని అంచనా. రెండేళ్లలో రుణ వృద్ధి 21 శాతం వృద్ధి చెందగలదని భావిస్తున్నాం.

ఇన్ఫోసిస్ | **బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్** | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 786 **టార్గెట్ ధర:** రూ.840

ఎందుకంటే: ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు స్వల్పంగా అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని ఈ కంపెనీ శుభారంభంతో చేసిందని చెప్పవచ్చు. నిలకడ కరెన్సీ రేట్లలో చూస్తే, ఆదాయం 12 శాతం పెరిగింది. ఎబిటా మార్జిన్ 3 శాతం పెరిగి 21 శాతానికి చేరింది. కంపెనీ ఐదు విభాగాలు (ఆర్థిక సేవలు, కమ్యూనికేషన్స్, ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, హై-టెక్) మంచి ఆదాయ వృద్ధి సాధించాయి. పూర్తి ఆర్థిక సంవత్సరం ఆదాయం అంచనాలను 8-10 శాతం మేర పెంచింది. సమీప భవిష్యత్తులో మంచి వృద్ధి సాధనకు ఇది సంకేతమని భావిస్తున్నాం. ఫ్రీ క్యాష్ ఫ్లోస్‌లో ప్రస్తుతం 70 శాతంగా వాటాదారులకు తిరిగిస్తున్న మొత్తాన్ని 85 శాతానికి పెంచింది. ఈ క్యూ1లో మొత్తం 270 కోట్ల డాలర్ల డీల్స్‌ను సాధించింది. ఒక్క త్రైమాసిక కాలంలో ఇంత విలువైన డీల్స్‌ను సాధించడం ఈ కంపెనీకి ఇదే మొదటిసారి. దీంట్లో కొత్త డీల్స్ సగానికి పైగా ఉండటం విశేషం. వ్యయ నియంత్రణపై దృష్టి సారిస్తామని కంపెనీ చెప్పడంతో మార్జిన్లు మరింతగా మెరుగుపడే అవకాశాలున్నాయి. రెండేళ్లలో ఆదాయం 11 శాతం, షేర్ వారీ ఆర్జన (ఈపీఎస్) 12 శాతం మేర చక్రగతిన వృద్ధి చెందగలదని అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

కేజీ డీ6లో కనిష్ట స్థాయికి గ్యాస్

న్యూఢిల్లీ: గ్యాస్ ఉత్పత్తి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోవడంతో కేజీ-డీ6 బ్లాక్ ప్రస్తుతం చివరి దశలో ఉందని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) వెల్లడించింది. గ్యాస్ ఉత్పత్తికి కావల్సినంత పీడనం లేకపోవడం, బావుల్లో నీరు చొరబడటం తదితర అంశాలు ఉత్పత్తి భారీగా పడిపోవడానికి కారణాలని వివరించింది. అయితే, కేజీ-డీ6 బ్లాక్‌లో పరిస్థితులను మళ్లీ మెరుగుపర్చేందుకు 2020 మధ్య నాటి నుంచి మూడు కొత్త ప్రాజెక్టుల్లో ఉత్పత్తి ప్రారంభించే ప్రక్రియ చేపడుతున్నట్లు జూన్ క్వార్టర్ ఫలితాల వెల్లడి సందర్భంగా ఇన్వెస్టర్లకు తెలిపింది. ఈ మూడింటి నుంచి రోజుకు 30-35 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంసీఎండీ) మేర గ్యాస్ ఉత్పత్తి కాగలదని అంచనా వేస్తున్నట్లు ఆర్‌ఐఎల్ వివరించింది. ముందుగా ఆర్-క్లస్టర్ బావుల నుంచి 2020 మధ్య నాటికి గ్యాస్ ఉత్పత్తి ప్రారంభం కాగలదని భావిస్తున్నట్లు పేర్కొంది. కేజీ-డీ6 బ్లాక్‌లో 2010 మార్చిలో గరిష్టంగా రోజుకు 69.43 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంసీఎండీ) గ్యాస్ ఉత్పత్తి నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ క్వార్టర్‌లో ఇది 1.76 ఎంసీఎండీకి పడిపోయింది.

38,730 దిగువన సెన్సెక్స్ బలహీనం

మార్కెట్ పంచాంగం

అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలాఖరులో జరపనున్న విధాన సమీక్షలో వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు నెలకొన్నప్పటికీ, అమెరికా మార్కెట్ మినహా ఇతర ప్రధాన దేశాల సూచీల్లో జోష్ కన్పించడం లేదు. ఫెడ్ రేటు తగ్గింపుకంటే ట్రేడ్‌వార్స్, వినియోగ డిమాండ్ తగ్గడం తదితర అంశాలతో యూరప్, ఆసియా మార్కెట్లు సతమతమవుతుండగా, ఇందుకు తోడు కొన్ని బడ్జెట్ ప్రతిపాదనలు నొప్పించడంతో మన మార్కెట్లో క్షీణత అధికంగా వుంది. వరుసగా రెండు వారాల్లో భారత్ సూచీలు 3.5 శాతం నష్టపోయాయి. మరోవైపు ఇప్పటివరకూ కార్పొరేట్ ఫలితాలు వెల్లడించిన ప్రధాన కంపెనీల్లో ఇన్ఫోసిస్ షేరు కొత్త రికార్డు సృష్టించి, గతవారం ప్రధమార్థంలో సూచీల పతానాన్ని తాత్కాలికంగా నిరోధించగా, శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత వెల్లడైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లపై ఇన్వెస్టర్ల స్పందన సమీప మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశించవచ్చు. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...,

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



జూలై 19తో ముగిసిన వారం ప్రధమార్థంలో 39, 285 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్, అటుతర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై శుక్రవారం 38,271 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 399 పాయింట్ల నష్టంతో 38,337 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం వేగంగా సెన్సెక్స్ 38,730 పాయింట్ల స్థాయిని అధిగమించలేకపోతే సమీప భవిష్యత్తులో కరెక్షన్ కొనసాగే ప్రమాదం వుంటుంది. పైన సూచించిన స్థాయిపైన ముగిస్తే 39,060 పాయింట్ల వద్దకు, అటుపైన 39,285 పాయింట్ల వద్దకు పెరిగే అవకాశం వుంటుంది. ఈ సోమవారం మార్కెట్ బలహీనంగా ప్రారంభమైతే తొలుత 37,735 పాయింట్ల వద్ద మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే 37,415 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు. ఈ లోపున 200 రోజుల చలన సగటు రేఖ కదులుతున్న 37,065 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

నిఫ్టీ తక్షణ మద్దతు 11,320- నిరోధం 11,460

క్రితం వారం ఎన్ఎస్ఈ నిఫ్టీ గత కాలమ్‌లో ప్రస్తావించిన 50 డీఎంఏ 11,707 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగిన తర్వాత 11,399 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 133 పాయింట్ల నష్టంతో 11,419 పాయింట్ల వద్ద ముగిసింది. గతవారపు 'స్వింగ్ లో' అయిన 11,460 పాయింట్ల దిగువన నిఫ్టీ బలహీనంగా ట్రేడ్ కావొచ్చు. ఈ వారం నిఫ్టీ క్షీణత కొనసాగితే తొలుత 11,320 పాయింట్ల వద్ద మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే వేగంగా 11,250 పాయింట్లస్థాయికి పడిపోవొచ్చు. ఈ లోపున 200 డీఎంఏ కదులుతున్న 11,125 పాయింట్ల స్థాయివరకూ పతనం కావొచ్చు. ఈ వారం తొలి మద్దతును పరిరక్షించుకున్నా, లేదా పాజిటివ్‌గా ప్రారంభమైనా తక్షణం 11,460 పాయింట్ల వద్ద నిరోధాన్ని చవిచూడవచ్చు. అటుపైన ముగిస్తే 11,640 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిని సైతం అధిగమిస్తే తిరిగి నిఫ్టీ 11,710 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

- పి. సత్యప్రసాద్

డైరెక్ట్ ప్లానా? రెగ్యులర్ ప్లానా?

Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ఫండ్స్ ఎన్ఏవీ(నెట్‌అసెట్‌వేల్యూ) ప్రస్తుతమున్న స్థాయి నుంచి ఎంత మేర పతనమైతే, ఆ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు?
-శ్రీనివాస్, విజయవాడ

మీకు ఈ విషయంలో నేను ఎలాంటి సలహా ఇవ్వలేను. ఎన్ఏవీ తగ్గేదాకా ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, మీరు చాలా కాలం ఎదురు చూడాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఈ వెయిటింగ్ నిరంతరం ఉండొచ్చు కూడా ! ఒకవేళ మార్కెట్ 20-25 శాతం పెరిగిందనుకోండి. మార్కెట్ మళ్లీ ఎప్పుడు పడిపోతుందా అని మీరు ఎదురు చూడాల్సి వస్తుంది. దీనికి బదులుగా ఒక మదుపు వ్యూహాన్ని అనుసరించండి. మీరు ఇన్వెస్ట్ చేయాల్సిన మొత్తంలో పది శాతాన్ని ప్రతి నెలా చివరి రోజు ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. ఎన్ఏవీ తగ్గకపోయినా ఈ 10 శాతం మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయండి. మీరనుకున్నట్లుగా ఎన్ఏవీ పడిపోయేదాకా వేచ

జనం గుండెల్లో.. హిస్స్..

నగరంలో బుసకొడుతున్న పాములు

- పాముల పుట్టల్లోకి జన నివాసాలు
- నెల రోజుల్లోనే వందకుపైగా కేసులు నమోదు
- ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత
- ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పరుగులు

సాక్షి, హైదరాబాద్: చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లు... పాముల పుట్టల ప్రాంతాల్లో జనావాసాలు వెలుస్తున్నాయి. నగరంలో జనాభా పెరగడంతో శివారు ప్రాంతాలు కూడా సిటీలో కలిసిపోతున్నాయి. శివారు ప్రాంతాలను ఆక్రమించి చెట్టూపుట్టా అంటూ లేకుండా వెంచర్లు, నిర్మాణాలు చేపడుతుండటంతో పాములు ఇళ్ల మధ్యకు వచ్చి బుస కొడుతున్నాయి. దీంతో పాము కాటు బాధితులు పెరిగిపోతున్నారు. చికిత్స కోసం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. కేవలం నెలన్నర రోజుల్లోనే ఉస్మానియాలో 92 కేసులు, గాంధీలో 20కి పైగా కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు మరో యాభై మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల పాము కాటు కేసులు పెరగడంతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లోని వైద్యులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

గత నెలన్నర రోజుల్లో..

ఉస్మానియాలో నమోదైన పాము కాటు కేసులు	92
గాంధీలో నమోదైన పాము కాటు కేసులు	20

పాముల పుట్టల్లోకి జనావాసాలు...

నగరం శివారు ప్రాంతాలకు కూడా విస్తరించింది. రోజుకో కొత్త వెంచర్ ఏర్పడటంతో పాటు నిర్మాణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. సిటీకి దూరంగా ఉన్న కాలనీల్లో వీధిలైట్లు లేవు. ఉన్నవాటిలో చాలా వెలగడం లేదు. చాలా చోట్ల ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉండటం, అవి చెట్ల పొదలు, రాళ్లు, పుట్టలతో నిండిపోతున్నాయి. నిర్మాణ సమయంలో పిల్లర్ల కోసం గుంతలు తవ్వాల్సి వచ్చినప్పుడు పుట్టల నుంచి పాములు బయటికి వస్తున్నాయి. అక్కడ పని చేసేందుకు వచ్చిన కార్మికులు బయట నిద్రించేటప్పుడో, రాత్రిపూట మలమూత్ర విసర్జనకు వెళ్లినప్పుడో కాటేస్తున్నాయి.

వైద్యులు అందుబాటులో లేక...

నగరం నాలుగు వైపులా 40 కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉంది. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను అంబులెన్స్‌లో తీసుకుని సిటీ రోడ్లపై రద్దీని దాటుకుని ఆస్పత్రులకు చేరుకోవడం చాలా కష్టంగా మారింది. అప్పటికే పరిస్థితి విషమించడంతో చాలా మంది మార్గమధ్యలోనే మృత్యువాతపడుతున్నారు. బాధితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం వనస్థలిపురం, గోల్కొండ, కొండాపూర్, మలక్‌పేట్‌లో ఏరియా ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. అయితే వాటిలో వైద్య పరికరాలు, మందులు, తక్షణ సేవలు అందించే వైద్యులు లేకపోవడంతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. నల్లగొండ, భువనగిరి, మేడ్చల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో ఆయా జిల్లాల బాధితులు కూడా ఇక్కడికే వస్తున్నారు.

ఆందోళన వద్దు..

పాముకాటుకు గురైన వెంటనే కాటు వేసిన చోటుకు ఫైభాగాన తాడుతో గట్టిగా కట్టాలి. వెంటనే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. 10 నిమిషాలకోసారి కట్టును వదులు చేస్తూ ఉండాలి. పాముకాటుకు గురైన వారిలో అధిక శాతం మంది ఆందోళనకు గురై రక్త ప్రసరణ పెరిగి విషం శరీరమంతా వ్యాపించి చనిపోతున్నారు. ఆ వ్యక్తికి పక్కనే ఉండి ధైర్యం చెప్పడం ఎంతో అవసరం.

– డాక్టర్ శ్రవణ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్, ఉస్మానియా ఆస్పత్రి

హైదరాబాద్‌కు ఐసిస్ నమూనాలు!

- మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన రయీసుద్దీన్
- పర్భనీ మాడ్యూల్‌లో అత్యంత కీలక ఉగ్రవాది
- పరీక్షల కోసం ఎఫ్ఎస్ఎల్‌కు చేతిరాత నమూనా

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు అక్కడి పర్భనీలో అరెస్టు చేసిన ఐసిస్ మాడ్యూల్‌కు చెందిన కొన్ని నమూనాల్లో హైదరాబాద్‌కు రానున్నాయి. బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నమూనాలను ఇప్పటికే పుణేలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ(ఎఫ్ఎస్ఎల్)కి పంపిన ఎన్ఐఏ రిపోర్టులు సైతం తీసుకుంది. అయితే, హైదరాబాద్‌లోని ఎఫ్ఎస్ఎల్‌లోనూ వీటిని పరీక్ష చేయించి రిపోర్టులు తీసుకోవాలని న్యాయస్థానం గత వారం ఆదేశించింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో భారీ విధ్వంసాలకు కుట్రపన్నిన ఐసిస్ మాడ్యూల్‌ను మహారాష్ట్ర ఏటీఎస్ అధికారులు 2016లో అరెస్టు చేశారు. అప్పట్లో పట్టుబడిన నసీర్ బిన్ యాఫై చావుస్, షాహిద్ ఖాన్, ఇక్బాల్ అహ్మద్ కబీర్ అహ్మద్, రయీసుద్దీన్ సిద్ధిఖీలకు విదేశంలో ఉన్న ఐసిస్ హ్యాండ్లర్‌తో సంబంధాలు కలిగి ఉన్నారని ఏటీఎస్ ఆరోపించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రయీసుద్దీన్‌కు కింది కోర్టు బెయిల్ తిరస్కరించడంతో అతడి తరపు లాయర్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తన వాదనలు వినిపించిన ఎన్ఐఏ తరపు లాయర్ ఆ మాడ్యూల్‌లో రయీస్ కీలకంగా వ్యవహరించారని వాదించారు.

ఖలీఫాకు బద్ధులమై...

మాడ్యూల్‌కు 'అమీర్'గా (చీఫ్) నసీర్ వ్యవహరించినప్పటికీ తామంతా 'ఐసిస్'అధినేత అబు బకర్ అల్ బగ్దాదీకి (ఖలీఫా) బద్ధులమై ఉంటామని, కాలిఫట్‌గా పిలిచే సైన్యంగా మారుతామని అందరితో ప్రమాణం చేయించింది మాత్రం రయీస్ అని స్పష్టం చేశారు. అరెస్టు సందర్భంలో రయీస్ సహా ఇతరుల నుంచి సేకరించిన బయాహ్ పత్రాల్లో ఉన్న చేతి రాతతో పోల్చడానికి గతంలోనే న్యాయస్థానం నుంచి అనుమతి పొంది రయీస్ చేతిరాతలు తీసుకున్నామని వివరించారు. ఈ నమూనాలను పరీక్షించిన పుణే ఫోరెన్సిక్ ల్యాబ్ సైతం రయీస్ రాసినవే అని తేల్చినట్లు కోర్టుకు తెలిపారు. న్యాయస్థానం నుంచి అనుమతి పొంది రయీస్ చేతిరాతలు తీసుకున్నామని అక్కడా పరీక్షలు పూర్తయిన తర్వాత నివేదిక సంగ్రహించి దాంతో పాటు పుణే ఎఫ్ఎస్ఎల్ ఇచ్చిందీ తమకు సమర్పించాలని స్పష్టం చేసింది. దీంతో బయాహ్ పత్రాలతో పాటు రయీస్ చేతిరాతల్ని హైదరాబాద్ పంపడానికి ఎన్ఐఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో ఉన్న ఎఫ్ఎస్ఎల్ ఇప్పటికే జాతీయ స్థాయిలో అనేక కీలక, ప్రతిష్టాత్మక, హై ప్రొఫైల్ కేసుల్లో తమ నివేదికలు అందించింది. ఈ నేపథ్యంలోనే బాంబే హైకోర్టు ఈ తరహా ఆదేశాలు ఇచ్చి ఉండచ్చని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

సింగపూర్‌లో వైభవంగా బోనాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ ఆధ్వర్యంలో సింగపూర్ సుంగే కేడుట్‌లోని అరసకేడ సరి శివన్ టెంపుల్‌లో ఆదివారం బోనాల పండుగను కనుల పండువగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు భక్తి శ్రద్ధలతో దుర్గాదేవికి బోనాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో పోతురాజులు, పులి వేషాలు, తొట్టెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలో సింగపూర్‌లోని తెలుగు వారందరూ పాల్గొన్నారు. ఆ మహంకాళి తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని సభ్యులు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నీలం మహేందర్, ప్రధాన కార్యదర్శి బసిక ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు గడప రమేశ్, గర్రేపల్లి శ్రీనివాస్, కోశాధికారి నల్ల భాస్కర్ గుప్త, కార్యనిర్వాహక సభ్యుడు ప్రవీణ్ కుమార్ చేన్నోజ్వాల పాల్గొనగా.. వేడుకల సమన్వయ కర్తలుగా గోనె రజిత, దీపా నల్ల, సౌజన్య నంగునూరి, గార్లపాటి లక్ష్మా రెడ్డి, ప్రదీప్ రెడ్డి, లక్కారి గంగాధర్, మడిగె రాజు, మల్లారెడ్డి మిటపల్లి, తొట గంగాధర్, అనుపురం శ్రీనివాస్, జుట్టు ఉమేందర్, టి.శ్రీనివాస్, మంత్రి సాయిరాం, తుర్క శ్రీనివాస్, కటుకం మారుతి, మనోజ్‌లు వ్యవహరించారు.

కంప్యూటర్ సైన్సే కింగ్!

- ఇంజనీరింగ్ తొలిదశ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో అత్యధిక ఆప్షన్లు సీఎస్ఈకే
- ఆ కోర్సువైపే మొగ్గు చూపిన 45,514 మంది విద్యార్థులు
- వివిధ కాలేజీల్లో సీఎస్ఈ సీటు కోసం 9,50,748 ఆప్షన్లు నమోదు
- కొత్త కోర్సుల్లో తక్కువ సీట్లు... అయినా వంద శాతం భర్తీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎప్పటిలాగే ఈసారి కూడా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కోర్సువైపే ఎక్కువ మంది విద్యార్థులు మొగ్గు చూపారు. ఎంసెట్ ప్రవేశాల కమిటీ ఇటీవల ప్రకటించిన మొదటి దశ ప్రవేశాల్లో అత్యధికం మంది విద్యార్థులు సీఎస్ఈలో సీట్లు పొందేందుకే వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 183 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 65,444 సీట్లు అందుబాటులో ఉండగా 53,934 మంది విద్యార్థులే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వారిలో 52,628 మంది విద్యార్థులు మాత్రమే సీట్ల కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో అత్యధికంగా 45,514 మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్‌లో సీటు కోసం వివిధ కాలేజీల్లో 9,50,748 ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఆ తరువాత ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో (ఈసీఈ) సీట్ల కోసం 35,937 మంది విద్యార్థులు 6,09,278 ఆప్షన్లను ఇచ్చుకున్నారు. ఇక మూడో స్థానంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ నిలిచింది. అందులో సీట్ల కోసం 21,646 మంది విద్యార్థులు 2,84,064 వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో చేరేందుకు 20,410 మంది, సివిల్ ఇంజనీరింగ్‌లో చేరేందుకు 16,608 మంది, మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరేందుకు 14,612 మంది

విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు.

ఐదు కొత్త కోర్సులు హౌస్‌ఫుల్...

రాష్ట్రంలోని పలు కాలేజీలు ఈసారి ఐదు కోర్సులను ప్రవేశపెట్టాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ వంటి సబ్జెక్టులతో కంప్యూటర్ ఇంజనీరింగ్ కోర్సుతోపాటు కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (నెట్‌వర్క్స్)ను అందుబాటులోకి తెచ్చాయి. ఏఐ కోర్సు కన్వీనర్ కోటాలో 84 సీట్లు అందుబాటులో ఉండగా వాటిల్లో చేరేందుకు 2,256 మంది విద్యార్థులు 3,580 వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు. కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో 42 సీట్లు అందుబాటులోకి రాగా అందులో చేరేందుకు 135 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్‌లో 42 సీట్లు ఉంటే వాటిల్లో చేరేందుకు 1,781 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు. కంప్యూటర్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నెట్‌వర్క్స్)లో 42 సీట్లు ఉంటే 476 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో 42 సీట్లు అందుబాటులోకి రాగా, వాటిల్లో చేరేందుకు 1,644 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చుకున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న కొత్త కోర్సులపట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం కూడా వాటిల్లో చేరేందుకు ఎక్కువ మంది ఆప్షన్లు ఇచ్చుకోకపోవడానికి ఒక కారణమని ప్రవేశాల క్యాంపు అధికారి బి. శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం: జాక్టో

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఉద్యమం చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (జాక్టో) నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జాక్టో స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించింది. రాష్ట్రంలో నాలుగేళ్లుగా ఉపాధ్యాయులు పదోన్నతులు లేకుండానే పదవీ విరమణ పొందుతున్నారని పేర్కొంది. పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు వేల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని, దీంతో పాఠశాల విద్యా నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని పేర్కొంది. 2017లో చేపట్టిన టీచర్ల నియామకాల ప్రక్రియ ఇంకా పూర్తకాక గందరగోళం నెలకొందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉపాధ్యాయులు పీఆర్సీ, ఐఆర్ కోసం ఎదురుచూపులు చూడాల్సి వస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 20న జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, సమావేశాల నిర్వహణ, జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు, సెప్టెంబర్ 1న హైద్రాబాద్‌లో ఉపాధ్యాయ గర్జన నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో జాక్టో నేతలు బి.భుజంగరావు, ఇ.రఘునందన్, జి.సదానంద్ గౌడ్ పాల్గొన్నారు.

ముసద్దిలాల్ జ్యువెల్లర్స్‌పై మరో కేసు

- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు రూ.75 కోట్లు టోకరా
- చీటింగ్ కేసు నమోదు చేసిన బెంగళూరు సీబీఐ

సాక్షి, హైదరాబాద్: పెద్ద నోట్ల రద్దు సమయంలో తప్పుడు ఇన్వాయిస్‌లతో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చే విషయంలో అడ్డంగా దొరికిపోయిన ముసద్దిలాల్ జ్యువెల్లర్స్‌పై తాజాగా మరో కేసు నమోదైంది. తమకు రూ.75 కోట్లు రుణం తీసుకుని ఎగ్గొట్టారన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐఓబీ) ఫిర్యాదుతో సీబీఐ చీటింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముసద్దిలాల్ జ్యువెల్లర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు కంపెనీ డైరెక్టర్లు మోహన్‌లాల్ గుప్తా, ప్రశాంత్ గుప్తాలను నిందితులుగా చేర్చింది. పంజగుట్ట కేంద్రంగా నడుస్తోన్న ముసద్దిలాల్ జ్యువెల్లర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 2009 అక్టోబర్‌లో ఐఎన్జీ వైశ్యా బ్యాంక్ నుంచి రూ.55 కోట్లు రుణం తీసుకుంది. ఈ క్రమంలో తమ రుణాన్ని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు(ఐఓబీ)కు మార్చాలంటూ ముసద్దిలాల్ జ్యువెల్లర్స్ ఐఎన్జీ వైశ్యా బ్యాంకుకు విన్నవించుకుంది. బ్యాలెన్స్ షీట్ సరిగానే నిర్వహించడంతో సంతృప్తి చెందిన ఐఎన్జీ వైశ్యా బ్యాంకు 2013 మార్చిలో ఆ రుణాన్ని ఐవోబీ బ్యాంకుకు మార్చారు. ఆ తర్వాత బ్యాంకు వద్ద మరికొంత రుణం తీసుకున్నారు. అది కాస్తా రూ.82 కోట్లకు చేరింది. రానురాను రుణాన్ని తిరిగి చెల్లించడంలో ముసద్దిలాల్ జ్యువెల్లర్స్ విఫలమవుతూ వచ్చింది. దీంతో 2014 మార్చిలో ఖాతాలను బ్యాంకు స్తంభింపజేసింది. 2016లో జరిగిన ఆడిట్ తనిఖీల్లో వారు తీసుకున్న రుణంలో రూ.58 కోట్ల రూపాయలను ఇతర కంపెనీలకు మళ్లించినట్లుగా గుర్తించారు. దీంతో తమ వద్ద తీసుకున్న రుణాన్ని ఉద్దేశపూర్వకంగా మళ్లించి తమకు రూ.75 కోట్లు ఎగ్గొట్టారని బ్యాంకు నిర్ధారణకు వచ్చింది. దీంతో ఐవోబీ బ్యాంకు చీఫ్ రీజనల్ మేనేజర్ రవిచంద్రన్ సీబీఐకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీబీఐ బెంగళూరు శాఖ ముసద్దిలాల్ జ్యువెల్లర్స్‌తోపాటు కంపెనీ డైరెక్టర్లు మోహన్‌లాల్ గుప్తా, ప్రశాంత్ గుప్తాలపై ఐపీసీ 120, 406, 420, 468, 471 సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసింది.

భరత్‌ను బేషరతుగా విడుదల చేయాలి

- టీవీవీతోపాటు పలు విద్యార్థి, ప్రజా సంఘాల డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ) నాయకుడు భరత్‌ను బేషరతుగా విడుదల చేయాలని రాష్ట్రంలోని పలు విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. టీవీవీ ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి, ప్రజా సంఘాలు కలసి ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాలు నాయకులు మీడియాతో మాట్లాడుతూ ..వరంగల్ జిల్లాకు మాణిక్యాపూర్‌కు చెందిన భరత్ ఉస్మానియా విద్యార్థిగా, టీవీవీ నాయకుడిగా పలు ఉద్యమాల్లో పాల్గొన్నాడని తెలిపారు. ఈనెల 16న జేఎన్టీయూలోని తన మిత్రులను కలిసేందుకు ఓయూ నుంచి వెళ్లిన భరత్‌ను తెలంగాణ పోలీసులే కిడ్నాప్ చేసి ఐదురోజుల పాటు కస్టడీలో ఉంచుకున్నారని ఆరోపించారు. భరత్‌ను శారీరకంగా, మానసికంగా హింసించి ఈనెల 20న ఛత్తీస్‌గఢ్ పోలీసులకు అప్పగించారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, హోంమంత్రి నైతిక బాధ్యత వహించాలన్నారు. మావోయిస్టులను కలిసేందుకు వెళ్తున్నప్పుడు భరత్‌ను పట్టుకున్నట్లు బీజాపూర్ జిల్లా పోలీసులు అతడిపై అక్రమ కేసులు పెట్టి జగ్దల్‌పూర్ సెంట్రల్ జైలులో నిర్బంధించారని తెలిపారు. ఇదేవిధంగా గతంలో కూడా టీవీవీ బృందాన్ని తెలంగాణ పోలీసులే కిడ్నాప్ చేసి ఛత్తీస్‌గఢ్ పోలీసులకు అప్పగించి సుక్మా జైల్లో నిర్బంధించారని గుర్తు చేశారు. పోలీసు చర్యలను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. అయితే, నిరసన ప్రదర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు ఆందోళనకారుల్ని అడ్డుకోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారుల్ని పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో టీవీవీ కన్వీనర్ చిక్కుడు ప్రభాకర్, వివిధ విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు కోట శ్రీనివాస్, జాన్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

కులానికే ప్రాధాన్యమా?

వ్యక్తి ప్రాణాలకు విలువలేదా?: అమృతా ప్రణయ్

హైదరాబాద్ : కులాంతర వివాహాల కోసం తన జీవితాంతం పోరాటం చేస్తానని గత ఏడాది మిర్యాలగూడలో సంచలనాత్మక రీతిలో హత్యకు గురైన ప్రణయ్ సతీమణి అమృత అన్నారు. ప్రస్తుతం పలువురు కులదురహంకార ధోరణితో వ్యక్తుల ప్రాణాలకుంటే కులానికే ప్రాధాన్యమివ్వడం దారుణమన్నారు. అందరి సహకారం వల్లనే తాను ఎంతో ధైర్యంతో బయటకు వచ్చి మాట్లాడుతున్నానని చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుశ్రుత, దేవార్ష్‌ల న్యాయ పోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో జరుగుతున్న 'కులదురహంకార హత్యలు, ప్రభుత్వ నిర్లక్ష్యం– బాధితులకు న్యాయం కోసం జరగాల్సిన ఉద్యమం మన కర్తవ్యాలు'అనే అంశంపై ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమృత మాట్లాడుతూ... ప్రణయ్ హత్యలో భాగస్వాములైన 8 మందిలో ఒక్కరే జైలులో ఉన్నారని మిగతా వారంతా బయట తిరుగుతున్నారని అందరికీ శిక్ష పడేవరకు తాను రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. కుల దురహంకార హత్యలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని, బాధితులు ధైర్యంగా బయటకు వచ్చి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదనే శక్తివంచన లేకుండా పోరాటం చేస్తున్నానని తెలిపారు. ప్రేమ పేరుతో ఒక్కరు మోసం చేస్తే అందరూ అలా చేస్తారని భావించవద్దన్నారు. వ్యక్తుల ప్రాణాలకంటే కులానికే ప్రాధాన్యమివ్వడం సరైంది కాదన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అనేక మంది బాధితులు తమకు డబ్బులు కాదు... న్యాయం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. సామాజిక వేత్త యు సాంబశివరావు మాట్లాడుతూ.... జనగామ జిల్లా గూడూరు మండలానికి చెందిన సుశృత, ఆమె నాలుగేళ్ల కుమారుడు దేవర్ష్‌లను అతి కిరాతకంగా హత్య చేశారని వారికి శిక్ష పడాల్సిన అవసరం ఉందన్నారు. కులనిర్మూలన సంఘం నేత గాంధీ మాట్లాడుతూ ఇప్పటివరకు 50 కులదురంహంకార హత్యలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులాంతర వివాహాల ప్రోత్సాహానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రణయ్ తండ్రి బాలస్వామి మాట్లాడుతూ... తన కొడుకుదే చివరి హత్య కావాలని కోరుకున్నానని కానీ ఇంకా అలాంటి హత్యలే కొనసాగడం బాధాకరమన్నారు. అమృత చేస్తున్న పోరాటం అమోఘమైందని ఆమె తన కూతురైతే పాదాభివందనం చేసేవాడినన్నారు. కులనిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు బండారి లక్ష్మయ్య అధ్యక్షత న జరిగిన ఈ సదస్సులో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792